

భర్తృహరి నీతి శతకము
రూ॥40/-
పేజీలు:48
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 08, సంచిక: 82 | బుధవారం | 19-02-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



లౌకిక రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్

ఆర్‌టిసికి షాకిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు

బడ్జెట్‌లో ఆరోగ్యశ్రీకి సమృద్ధిగా నిధులు

లోపలి పేజీల్లో



05

ఆర్థిక వ్యవస్థలో పూర్తి విఫలం

- ప్రజాజీవితాలు నాశనం చేస్తున్న ప్రధాని మోదీ
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే విమర్శ



05

అందని ఊపిరి

- 500 కోట్ల మంది రోగుల కష్టం
- పేద దేశాల్లో పరిస్థితి దయనీయం
- మెడికల్ ఆక్సిజన్ లభ్యతపై లాన్సెట్ నివేదిక



05

బ్యాంక్ సిబ్బందికి రక్షణ ఏదీ?

- ఉద్యోగులపై దాడులు గర్హనీయం : ఎఐబిఇఎ




# చిన్నతప్పూ జరగొద్దు

- పకడ్బందీగా భూభారతి విధివిధానాలు
- భవిష్యత్ అవసరాల దృష్ట్యా రూపొందించాలి
- గత ప్రభుత్వ చట్టంతో రోడ్డునపడ్డ లక్షలాది మంది రైతులు
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వర్క్‌షాపు

ప్రజాపక్షం/హైదరాబాద్

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా చిన్న, చిన్న తప్పులకు సైతం ఆస్కారం లేకుండా, పకడ్బందీగా 'భూ భారతి విధివిధానాలను' రూపొందించాలని రెవెన్యూ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఆర్ఒఆర్ 2020' చట్టం వల్లనే లక్షలాది మంది రైతులు రోడ్డున పడ్డారని విమర్శించారు. ఆ చట్టం తీసుకొచ్చి మూడు సంవత్సరాలు గడచినప్పటికీ విధివిధానాలను రూపొందించలేక పోయిందని మండిపడ్డారు. 'భూభారతి చట్టానికి సంబంధించి విధివిధానాలను' రూపొందించడంపై హైదరాబాద్ లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డిలో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో రెండు రోజులపాటు నిర్వహిస్తున్న వర్క్ షాప్‌లో మొదటి రోజు మంగళవారం నాడు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా అసెంబ్లీలో ముసాయిదా బిల్లు ప్రవేశపెట్టిన తర్వాతనే మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు సూచనలు తీసుకుని దేశానికి ఆదర్శంగా ఉండేలా 'భూ భారతి ఆర్ఒఆర్ 2025 చట్టాన్ని' తీసుకొచ్చామని, అదే స్ఫూర్తితో ఈ చట్టానికి సంబంధించిన విధివిధానాలను రూపొందిస్తున్నామని వివరించారు. తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజానీకానికి మెరుగైన, సమగ్రమైన రెవెన్యూ సేవలను సత్వరమే అందించాలనే ఆశయంతో, విస్తృత స్థాయిలో అభిప్రాయాలను సేకరించి, సిఎం రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామన్నారు. సచివాలయంలో కూర్చొని మార్గదర్శకాలను రూపొందించకుండా విస్తృత స్థాయిలో అధికారులు, మేధావులు, అనుభవజ్ఞుల సలహాలు సూచనలు తీసుకుని అందరి అభిప్రాయాలను క్రోడీకరించి, పకడ్బందీగా భూ భారతి విధివిధానాలు తయారు చేస్తున్నామని మంత్రి చెప్పారు. ఎటువంటి విధి విధానాలను రూపొందించకుండానే ఆర్ఒఆర్ 2020 చట్టాన్ని గత ప్రభుత్వం అమలు చేయడంతో ఎదురైన ప్రతికూల పరిస్థితులు మన కళ్లముందే కనిపిస్తున్నాయన్నారు. ఆనాటి పాలకులు ఎంతో గొప్పగా చెప్పుకున్న ధరణిలో అన్ని లొసుగులు, లోపాలు ఉన్నాయని తరువాయి 2లో



> ప్రస్తుత రోజుల్లో ఫేక్ న్యూస్ అనేది మరో ప్రధానమైన ముప్పుగా మారింది. సోషల్ మీడియాలో తప్పుడు సమాచారంతో సమాజంలో గందరగోళం ఏర్పడుతుంది. 24/7 సైబర్ హెల్ప్‌లైన్ 1930 నంబర్‌ను అందరికీ షేర్ చేయాలి. పూర్తిస్థాయిలో పనిచేసే సైబర్ సెక్యూరిటీ బ్యూరో, పౌరులను రక్షించడానికి అంకితమైన సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి.
>
> – ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



# నేరశైలి మారుతోంది

- ప్రజలు, ప్రభుత్వమూ మారాలి
- సవాళ్లు ఎదుర్కోవడానికి అన్ని రకాల ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి
- ఫేక్ న్యూస్, సైబర్ నేరాలను నిరోధించాలి
- సొమ్ము రికవరీలో సైబరాబాద్ పోలీసులు ముందంజ
- 'షీల్డ్ -2025' కాన్‌క్లేవ్‌లో సిఎం రేవంత్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్/రంగారెడ్డి

ఒకప్పుడు ఇంట్లో చొరబడి దోపిడీలు చేసేవారని, ప్రస్తుతం దొంగలు ఎక్కడో ఉండి మన సొమ్మును దొంగిలిస్తున్నారని, నేరాల శైలి మారుతోందని, ఈ మార్పులకనుగుణంగా ప్రజలు, ప్రభుత్వం మారాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. నేరాల విధానం వేగంగా మారుతోందని, సమాజంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కోవడానికి అన్ని రకాల ప్రణాళికలనూ సిద్ధం చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఫేక్ న్యూస్,ఆర్థిక నేరాలను కూడా నిరోధించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణను 'సైబర్ సేఫ్ స్టేట్' గా మార్చేందుకు మనమంతా కలిసి పని చేద్దామని సిఎం పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసిసిలో తెలంగాణ 'సైబర్ సెక్యూరిటీ బ్యూరో'(టిజిసిఎస్‌బి) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే 'షీల్డ్ 2025' కాన్‌క్లేవ్‌ను సిఎం రేవంత్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐటి,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, డిజిపి డాక్టర్ జితేందర్,టిజిసిఎస్‌బి ఇన్‌చార్జ్‌డైరెక్టర్ శిఖాగోయల్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి,సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రెటరీ రమేశ్ ఖాజా తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ సైబర్ సేఫ్టీ విషయంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా నిలపడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. డిజిటల్ సేఫ్టీ, భవిష్యత్తుపైన చర్చించేందుకు 'షీల్డ్ 2025ని' నిర్వహించుకున్నట్లు వెల్లడించారు. సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ కోసం 'ఎకో సిస్టమ్ వ్యవస్థ'ను ఏర్పాటు చేసేందుకు, ప్రభుత్వ నిపుణులు, ఐటి సంస్థలతో కలిసి పనిచేయడానికి,అన్ని రకాల వనరులనూ సమకూరుస్తోందన్నారు. తెలంగాణను సెక్యూర్ బిజినెస్ హబ్‌గా మార్చాలని సూచించారు. దేశంలో సైబర్ నేరగాళ్లు గత ఏడాది రూ. 22,812 కోట్లు దోచుకున్నట్టు ఒక అంచనా ఉన్నదని, ఇది మన ఆర్థిక వ్యవస్థకు, మన పౌరులకు ముప్పు అని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత రోజుల్లో ఫేక్ న్యూస్ అనేది మరో ప్రధానమైన ముప్పుగా మారిందని, సోషల్ మీడియాలో తప్పుడు తరువాయి 2లో



# సిఇసి ఎంపికపై అర్ధరాత్రి నిర్ణయాలా?

- కేంద్ర ప్రభుత్వ చర్య అవమానకరం, అమర్యాదకరం
- ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ

**న్యూఢిల్లీ :** భారత ఎన్నికల సంఘం ముఖ్య కమిషనర్ (సిఇసి) ఎంపికపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. సిఇసి ఎంపికపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతుండగానే ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అర్ధరాత్రి నిర్ణయం తీసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ చర్య అవమానకరం, అమర్యాదకరం అని మండిపడ్డారు. ప్రధాని నేతృత్వంలోని ఎంపిక కమిటీ సమావేశం జరిగిన కొన్ని గంటల తర్వాత, సోమవారం రాత్రి ప్రభుత్వం జ్ఞానేశ్ కుమార్‌ను కొత్త ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి)గా నియమించింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు విచారణను దృష్టిలో ఉంచుకుని సమావేశాన్ని వాయిదా వేయాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ప్రభుత్వాన్ని కోరారు. హోం మంత్రి అమిత్ షా కూడా సభ్యుడిగా ఉన్న ప్యానెల్‌కు రాహుల్‌గాంధీ ఒక అసమ్మతి నోట్‌ను కూడా సమర్పించారు. 2023 చట్టం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి), ఎన్నికల కమిషనర్ల (ఇసి) నియామకాలకు వ్యతిరేకంగా తరువాయి 2లో

## నేడు జ్ఞానేశ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

- 26వ సిఇసిగా నియామకం



**న్యూఢిల్లీ :** కేంద్ర హోంశాఖ సీనియర్ అధికారి జ్ఞానేశ్ కుమార్ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. జమ్ము–కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు చేయడంలో, రామాలయం ట్రస్ట్ ఏర్పాటులో ప్రధానపాత్ర పోషించిన జ్ఞానేశ్ కుమార్ 26వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. 2024 జనవరిలో సహకార శాఖ కార్యదర్శిగా పదవీ విరమణ చేసిన జ్ఞానేశ్ కుమార్ మార్చిలో ఎన్నికల కమిషనర్‌గా నియమితులయ్యారు. ప్రస్తుత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మంగళవారం పదవినుంచి తరువాయి 2లో



# తక్షణమే మిర్చిబోర్డు

- నాఫెడ్ ద్వారా క్వింటా రూ. 25వేలు చొప్పున మిర్చి కొనుగోలు చేయాలి
- తగ్గిన ధరకు పాలకులదే బాధ్యత
- బాగం హేమంతరావు డిమాండ్
- రైతు సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో ఖమ్మం మిర్చి మార్కెట్‌లో ఆందోళన

ప్రజాపక్షం/ఖమ్మం

పడిపోతున్న మిర్చి ధరలను దృష్టిలో ఉంచుకుని తక్షణం మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. గతేడాదితో పోల్చినప్పుడు ఈ ఏడాది సగానికి పడిపోయాయని, పెట్టుబడులు గత ఏడాది కంటే రెట్టింపయ్యాయని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఆందోళన నిర్వహించారు. మిర్చి కొనుగోళ్లను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. మిర్చి మార్కెట్‌ను ముట్టడించే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. రైతులకు, పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పెద్ద సంఖ్యలో తరువాయి 2లో

## ఎసిబికి చిక్కిన అటవీశాఖ అధికారులు

రూ.30వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం



ప్రజాపక్షం/ఇల్లెందు

భద్రాద్రి జిల్లా ఇల్లందు మండలం కొమరారం అటవీశాఖ రేంజ్ అధికారి రెంటాల ఉదయ్ కుమార్, మాణిక్యారం బీట్ అధికారి నునావత్ హరీలాల్ రూ.30వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి మంగళవారం తరువాయి 2లో

# బతుకమ్మకుంట బతికే ఉంది



- తవ్వకాలు చేపట్టిన హైడ్రా
- మోకాల్లోతుకి ఉబికి వచ్చిన పాతాళగంగ !

ప్రజాపక్షం/హైదరాబాద్

కబ్జాలతో బక్కచిక్కిన బతుకమ్మ కుంట ఇంకా తాను ఉన్నానంటూ ఉనికి చాటుకుంది. మోకాల్లోతు తవ్వగానే పాతాళ గంగ వెలుపలికి ఉబికి వచ్చింది. తక్కువ లోతులోనే నీళ్లు ఉబికి రావడంతో స్థానికులు బతుకమ్మకుంట బతికే ఉందంటూ స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. అంబర్‌పేట్ బతుకమ్మకుంట పునరుద్ధరణ పనులకు ఇటీవలనే హైడ్రా శ్రీకారం చుట్టిన విషయం తెల్సిందే. అందులోభాగంగా బతుకమ్మకుంటలో మంగళవారం హైడ్రా సిబ్బంది తవ్వకాలు ప్రారంభించారు. మోకాల్లోతు తవ్వగానే పాతాళగంగ పైకి ఊబికి వచ్చింది. బతుకమ్మకుంట బతికే ఉందని హర్షం తరువాయి 2లో

# జాతర జనసంద్రం

- పెద్దగట్టులో కిక్కిరిసిన భక్తులు
- కన్నులపండువగా చంద్రపట్నం
- మూడోరోజూ వాహనాల మళ్లింపు




ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతర మంగళవారం జనసంద్రమైంది. లక్షలాది మంది భక్తులు ఆయా ప్రాంతాల నుండి తరలి వచ్చి గట్టుపై ఉన్న లింగన్న, చౌడమ్మ తల్లిని దర్శించుకొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. లింగా... ఓలింగా అంటూ శివనామస్మరణ చేశారు. శివసత్తులు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నెత్తిన బోనం... చేతిన వీరచెందుతో శివసత్తులు శివాలెత్తగా... గజ్జెల లాగులు, కాళ్లకు గజ్జెలు, చేతిలో బేరీలు, వీరచెందు భుజాన వీరడోలు వేసుకొని భూమి అదిరేలా నృత్యాలు చేశారు. లింగన్న తమను చల్లంగా చూడాలని మేక, గొర్రెపోతులు, కోళ్ళను చౌడమ్మకు బలి ఇచ్చి నైవేద్యం సమర్పించారు. లింగన్నకు పాలకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకొని తరువాయి 12లో

## కుంభమేళా మృతుల వివరాలు పారదర్శకంగా వెల్లడించాలి


కేంద్ర ప్రభుత్వానికి చాడ డిమాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్




కుంభమేళాలో జరుగుతున్న వరస ఘటనలలో మృతి చెందిన వారి వివరాలను పారదర్శకంగా వెల్లడించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో తరువాయి 2లో

# వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి భారత్, ఖతార్ సంబంధాలు



ప్రధాని, ఖతార్ అమీర్ మధ్య విస్తృత స్థాయి చర్చలు

**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ, ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థని మధ్య మంగళవారం విస్తృత స్థాయిలో చర్చలు సాగాయి. వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేరేలా ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడాలని ఆశించారు. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత, శక్తి, ప్రజల మధ్య సత్సంబంధాల నేపథ్యంగా ఇరు దేశాల మధ్య లోతైన, సాంప్రదాయ సంబంధాలు నెలకొనాలని ఇరు దేశాల నేతలు చర్చలు జరిపారు. అంతేగాక ప్రాదేశిక, ప్రపంచ సమస్యలపైకూడా వారు అభిప్రాయాలను పంచుకున్నారని భారత విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. మోదీ ఆహ్వానంపై ఖతార్ అమిర్ రెండు రోజుల పర్యటనకు భారత్ వచ్చారు. ఆయన భారత్‌ను కలుసుకోవటం ఇది రెండోసారి. గతంలో 2015 మార్చిలో భారత్ పర్యటనకు వచ్చారు. ఖతార్ తరువాయి 12లో



# ఉక్రేన్ లేకుండా అమెరికా, రష్యా చర్చలు

అవసరమైతే జెలెన్‌స్కీతో భేటీకి పుతిన్ సిద్ధం : క్రెమ్లిన్ వెల్లడి

రియాద్/పారిస్ : యుద్ధ సమస్య పరిష్కారానికి ఉక్రేన్ ప్రాతినిధ్యం లేకుండానే చర్చలు ప్రారంభమయ్యాయి. అందరూ ఉత్కంఠతో ఎదురుచూస్తున్న చర్చలు రష్యా–అమెరికా మధ్య సౌదీ అరేబియా రాజు సమక్షంలో రియాద్‌లోని దిరియాహ్ ప్యాలెస్‌లో అధికారస్థాయిలో మంగళవారం మొదటిరోజు నాలుగు గంటలపాటు జరిగాయి. అమెరికాతో ఈ చర్చలు సానుకూలంగా, నిర్మాణాత్మకంగా జరిగాయని రష్యా ప్రతినిధులు చెప్పారు. ఈ సమావేశంలో అమెరికా–రష్యా, సౌదీ అరేబియాల విదేశాంగమంత్రులు, వారి ప్రతినిధులు, మధ్యఆసియా తరపు ప్రతినిధులు పాల్గొన్నారు. ఉక్రేన్‌లో యుద్ధం మొదలై వచ్చేవారంతో మూడు సంవత్సరాలు పూర్తి అవుతుంది. ఉక్రేన్ అధ్యక్షుడు తరువాయి 12లో

# జులై మరణాలకు పోలీసులు కారణం కాదు

## స్పందించిన షేక్ హసీనా




**ఢాకా :** బంగ్లాదేశ్ తాత్కాలిక నాయకుడు మహ్మద్ యూనుస్ ఓ ఉగ్రవాది అని పదవీచ్యుతురాలైన ఆ దేశ ప్రధానమంత్రి షేక్ హసీనా విమర్శించారు. అవామీ లీగ్ పార్టీ నిర్వహించిన ఒక సభలో దృశ్యమాధ్యమ పద్దతిలో ఆమె ప్రసంగిస్తూ, తాను బంగ్లాదేశ్‌కు తిరిగి వస్తాననీ, యూనుస్ ప్రభుత్వంపై ప్రతీకారం తీర్చుకుంటాననీ అన్నారు. ఆమె పదవి వదలివెళ్ళిపోవడానికి ముందు గత ఏడాది జులైనెలలో జరిగిన ప్రదర్శనలో బంగ్లా యువకుల మరణాలు పోలీసు కాల్పులవల్ల జరగలేదని ఆమె అన్నారు. తమపార్టీ కార్యకర్తలను వేధింపులకు గురిచేస్తూ హతమారుస్తున్నారని, పార్టీ ఆస్తులను అగ్నికి ఆహుతిచేస్తూ విధ్వంసం సృష్టిస్తూ దారుణాలకు పాల్పడుతున్నారనీ, ఈ విషయాలపై యూనుస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడంలేదని ప్రశ్నించారు. జులై అల్లర్లలో పోలీసులు, కళాకారులు ఎంతోమంది మరణించారని దీనిపై యూనుస్ స్పందించలేదని విమర్శించారు. జులై అల్లర్లలో 1,500 మంది మరణించారని, వీరంతా బహుశా పోలీసు కాల్పుల్లో మరణించి ఉంటారనీ, వీరి మరణాల వెనుక ఖలీదా జియా ప్రబుత్వ హస్తం ఉండిఉండవచ్చుననీ ఐక్యరాజ్యసమితి మానవహక్కుల కమిటీ ఇటీవల తన నివేదికలో ప్రకటించిన తర్వాత ఖలీదాజియా తీవ్రంగా స్పందించారు.



**తీస్తా నదీజలాల సమస్యపై ఖలీదాజియాపార్టీ నిరసనలు**

బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి ఖలీదాజియాకు చెందిన బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) ఐదు జిల్లాలలో జరిపిన నిరసన ప్రదర్శనలు మంగళవారంతో ముగిశాయి. తీస్తా నదీ జలాలలో భారత్ నుండి బంగ్లాదేశ్‌కు న్యాయబద్ధమైన నీటి వాటా సాధించాలని డిమాండ్ చేస్తూ బిఎన్‌పిపార్టీ నాయకులు, కార్యకర్తలు సోమ, మంగళవారాలలో ఐదు జిల్లాలలో 48 గంటలపాటు నిరసన ప్రదర్శలు జరిపారు. ''జాగో బహే...తీస్తా బచావ్'' అనే నినాదంతో ఈ నిరసన ప్రదర్శనలు జరిపారు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో ఈ ఏడాది చివరన పార్లమెంటు ఎన్నికలకు సన్నాహాలు జరుగుతున్న తరుణంలో పార్టీని ప్రజల్లోకి తీసుకువెళ్ళి, ఉనికిని పెంచుకునేందుకు వీలుగా ఆమె భారత్‌పై గురిపెట్టారు. జాతీయ సమస్యల గురించి, యూనుస్ ప్రబుత్వం గురించి ఆమె పార్టీ కార్యకర్తలు ఎలాంటి ప్రస్తావనా చేయలేదు. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో భారత్ వ్యతిరేకత బాగా ఉండటంతో దానిని ఆసరాగా చేసుకుని ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలోకి వెళ్ళేందుకు ఖలీదాజియాపార్టీ తీస్తానదీ జలాల సమస్యను తీసుకుని నిరసన ప్రదర్శనలకు దిగింది. బిఎన్‌పి తాత్కాలిక అధ్యక్షుడు తారిక్ రెహ్మాన్ ఈ ఐదుచోట్లా ప్రదర్శనలను ఉద్దేశించి దృశ్యమాధ్యమ పద్ధతిలో ప్రసంగించారు. రంగ్‌పూర్, గైబంధా, నిల్ఫామరి, లాల్‌మోనిర్హత్, కురిగ్రామ్ జిల్లాలలోని 11 ప్రదేశాలలో ప్రజాసమీకరణ ద్వారా ఈ నిరసన ప్రదర్శనలు జరిగాయి. తీస్తానదీజలాలకు సంబంధించి భారత్–బంగ్లాదేశ్ మధ్య ఉన్న వివాదాన్ని తక్షణం పరిష్కరించాలని బిఎన్‌పి కార్యకర్తలు తాత్కాలిక ప్రభుత్వాన్ని కోరారు.




# టొరంటో ఏర్‌పోర్ట్‌లో విమానం బోల్తా



**టొరంటో :** కెనడాదేశం టొరంటో విమానాశ్రయంలో దిగుతున్న సమయంలో అమెరికాకు చెందిన డెల్టా ఎయిర్‌లైన్స్ విమానం బోల్తా పడింది. ఐతే విమానంలో ప్రయాణికులు ఎవ్వరూ మరణించలేదు. విమానం రన్ వేపై దిగే సమయంలో రన్ వే పై దట్టంగా మంచు పరుచుకుని ఉంది. 76 మంది ప్రయాణికులు, నలుగురు పైలట్లుతోపాటు మొత్తం 80 మంది విమానంలో ఉండగా వీరిలో 18 మంది గాయపడ్డారు. ప్రయాణికులను సహాయబృందాలు సురక్షితంగా బయటకు తీసుకువచ్చాయి. మిన్నెపొలిస్ నుండి సెయింట్ పాల్స్‌కు ఈ విమానం వెళుతోంది. విమానం చక్రాలు పైకి తేలాయి. ఫ్లయిట్ 4819 విమానంలో ఒక బాలిక తీవ్రంగా గాయపడగా మరో 15 మందిని కూడా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు కెనడియన్ అధికారులు చెప్పారు. దర్యాప్తు నిమిత్తం రెండు రన్‌వేలను కొద్దిరోజులపాటు మూసివేస్తారు.

# గాజాపై ఇక రెండో దశ చర్చలు

## మార్చి 4న అరబ్ లీగ్ సదస్సు



**గాజా :** గాజాలో కాల్పుల విరమణకు సంబంధించిన రెండో దశ చర్చలు ఇక ప్రారంభం అవుతాయని ఇజ్రాయెల్ మంగళవారంనాడు ప్రకటించింది. గాజాలో ఇంకా చాలామంది ఇజ్రాయెలీ బందీలు ఉన్నారనీ, ఇజ్రాయెల్ జైళ్ళనుండి ఖైదీలను కూడా ఇచ్చిపుచ్చుకోవాల్సి ఉందని ఆ దేశ విదేశాంగమంత్రి గిడియాన్ సార్ చెప్పారు. గాజాలో ఇజ్రాయెల్ యుద్ధం ప్రారంభమై ఇప్పటికి 500 రోజులు గడిచింది. 45 రోజుల మొదటిదశ కాల్పుల విరమణ ఒప్పందం జనవరి 19న అమలులోకి వచ్చింది. ఇంకా 12 రోజులపాటు ఈ ఒప్పందం అమలులో ఉంటుంది. మొత్తం 33 మంది బందీలను, 2000 మంది ఖైదీలను పరస్పరం మార్పిడి చేసుకోవాలి. ఈ లోపు రెండో విడత చర్చలకు మధ్యవర్తుల ద్వారా సన్నాహాలు జరుగుతున్నాయి. ఇజ్రాయెల్ ప్రధానమంత్రి నేతన్యాహూపై బందీల బంధువులు తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారు. ఆ దేశంలో నిత్యం నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా, గాజాలో రియల్ ఎస్టేట్ ప్లాన్ అమలు చేస్తామని డోనాల్డ్ ట్రంప్ చేసిన ప్రతిపాదన, గాజాలో పాలస్తీనియన్ల మనుగడ, గాజా పునర్నిర్మాణం వంటి విషయాలపై చర్చించేందుకు ఉద్దేశించిన అరబ్ లీగ్ దేశాల శిఖరాగ్ర సదస్సు మార్చి 4వ తేదీ నాటికి వాయిదా పడింది. ఈ చర్చల్లో జోర్డాన్, ఈజిప్టు దేశాలు ప్రధానపాత్ర పోషిస్తాయి. కాగా సౌదీఅరేబియాలో గాజా పునర్నిర్మాణంపై చర్చించేందుకు గురువారంనాడు సమావేశం జరుగుతుంది. ఈజిప్టు, జోర్డాన్, ఖతార్, అరబ్ ఎమిరేట్స్ దేశాల ప్రతినిధులు పాల్గొంటారు.

# బస్సు లోయలో పడి 30 మందికిపైగా మృతి



**సుక్రీ :** సెంట్రల్ సౌత్ అమెరికా దేశం బొలీవియాలో ఒక బస్సు లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 30 మందికిపైగా ప్రయాణికులు మరణించారు. నలుగురు పిల్లలతోపాటు 14 మంది ప్రయాణికులు ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. నైరుతీప్రాంత జిల్లా యోకల్లాలోని పర్వతప్రాంత రహదారిలో ప్రయాణిస్తుండగా అదుపుతప్పిన బస్సు 800 అడుగుల లోతుకు ఉన్న ఒక లోయలో పడిపోయిందని పోలీసులు చెప్పారు. బొలీవియాలో రహదారులు చాలా అధ్వాన్నంగా ఉంటాయి. ముఖ్యంగా పర్వతప్రాంత రహదారలు మరీదారుణంగా ఉంటాయి. ఐతే డ్రైవరు బస్సును అదుపుచేయలేకపోయాదని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ బొలీవియాలో ఈ ప్రమాదాలలో ఎంతోమంది మరణించారు. పొటోసి–ఒరూరో నగరాలమధ్య ముఖ్యంగా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి.

## బాధ్యతల స్వీకరణ (మొదటి పేజీ తరువాయి)

తప్పుకోవడంతో జ్ఞానేశ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరిస్తారు. అతనితో పాటు ఎన్నికల కమిషనర్‌గా నియమితుడైన సుఖ్‌బీర్ సింగ్‌కూడా బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా సుఖ్‌బీర్ సింగ్ ఎన్నికల కమిషన్ అధికారిగా పనిచేశారు. ఎలక్షన్ కమిషన్ నూతన చట్టం ప్రకారం ఎంపికైన తొలి ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్. తదుపరి లోక్‌సభ ఎన్నికల ప్రకటనకు ముందుగా 2029, జనవరి 26వరకు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. చట్టం ప్రకారం ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు 65 ఏళ్ల వరకు పదవిలో కొనసాగుతారు. 2029, జనవరి 27న జ్ఞానేశ్ కుమార్‌కు 65 ఏల్లు నిండుతాయి. తన పదవీకాలంలో జ్ఞానేశ్ కుమార్ వచ్చే యేడాది బీహార్ అసెంబ్లీ ఎన్నికలు, 2026లో కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు, అలాగే 2026లో జరగాల్సిన తమిళనాడు, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించనున్నారు. పలు అసెంబ్లీ ఎన్నికలతోపాటు 2027లో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలనుకూడా జ్ఞానేశ్వర్ నిర్వహించనున్నారు. కేంద్ర హోంశాఖ అధికారిగా ఉన్నపుడు జ్ఞానేశ్ కుమార్ జమ్ము–కశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దు అమలులో కీలకపాత్ర పోషించారు. సుప్రీంకోర్టు తీర్పు అనంతరం రామమందిరం ట్రస్ట్ ఏర్పాటులో కూడా ముఖ్య భూమికి నిర్వహించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకంపై సుప్రీంకోర్టు విచారణ జరిగేవరకు వేచి చూడాలన్న కాంగ్రెస్ సూచించిన కొద్ది గంటలకే జ్ఞానేశ్ కుమార్ సిఇసిగా నియమితులయ్యారు. జ్ఞానేశ్ కుమార్ 1988 బ్యాచ్‌కు చెందిన కేరళ కేడర్ ఐఎఎస్ అధికారి. కాన్పూర్ ఐఐటిలో సివిల్ ఇంజినీరింగ్‌లో బిటెక్ పూర్తి చేసిన అనంతరం ఐసిఎఫ్ఎలో బిజినెస్ ఫైనాన్స్, అమెరికాలోని హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఎన్విరాన్మెంటల్ ఎకనామిక్స్ కోర్సులను చేశారు. అనంతరం కేరళ ప్రభుత్వంలో ఎర్నాకులం అసిస్టెంట్ కలెక్టర్‌గా, అదూర్ సబ్ కలెక్టర్‌గా, కేరళ అభివృద్ధి సంస్థ ఎండిగా, కొచ్చిన కార్పొరేషన్ కమిషనర్‌గా, పలు ఇతర బాధ్యతలు నిర్వహించారు. కేరళ ప్రభుత్వ కార్యదర్శిగా ఆర్థిక వనరుల పెంపు, ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టుల ఏర్పాటు, ప్రజా పనుల విభాగంలో పలు సంస్కరణలు తీసుకువచ్చారు. భారత ప్రభుత్వ ఉద్యోగిగా ఆయనకు ఎనలేని అనుభవం ఉంది. రక్షణ శాఖ సంయుక్త కార్యదర్శిగా, దేశీయ వ్యవహారాల శాఖలో సంయుక్త కార్యదర్శి, అదనపు కార్యదర్శిగా, పార్లమెంట్ వ్యవహారాల కార్యదర్శిగా, సహకార శాఖ కార్యదర్శిగా పలు బాధ్యతలు నిర్వర్తించారు. 2024 జనవరి 30న ఆయన పదవీ విరణమ చేశారు.

## వెల్లడించాలి (మొదటి పేజీ తరువాయి)

మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మహా కుంభమేళ ప్రచార జోరు తప్ప భక్తులకు సౌకర్యాలు మాత్రం శూన్యంగా ఉన్నాయని విమర్శించారు. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో 30 మంది, ఢిల్లీ రైల్వేస్టేషన్లో 18 మంది మరణించడం, ఛత్తీస్‌గఢ్‌లో కొంతమంది, హైదరాబాద్‌కు చెందిన 10మంది రోడ్డు ప్రమాదంలో మరణించినట్టు అధికార లెక్కలు చెబుతున్నా, కోట్లాదిమంది పాల్గొనే ఈ కుంభమేళాలో మృతుల సంఖ్య ఎక్కువగానే ఉన్నట్లు మేధావులు అంచనా వేస్తున్నారన్నారు. ఆ లెక్కలను కేంద్ర ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు కప్పిపుచ్చుతోందన్న అనుమానం వ్యక్తం చేశారు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయని దీనికి ప్రధాని నరేంద్ర మోదీ సమాధానం చెప్పాలన్నారు. మహా కుంభమేళలో జరుగుతున్న వరుస ఘటనలపై సమగ్రమైన విచారణ జరిపించాలని, భక్తులకు ఏర్పాట్లు సవ్యంగా చేయాలని, మృతి చెందిన కుటుంబాలకు రూ.50 లక్షల చొప్పున నష్టపరిహారం అందజేయాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.

## చిన్నతప్పూ జరగొద్దు (మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు.

**వీలైనంత త్వరగా భూభారతి చట్టం అమలు**

వీలైనంత త్వరగా భూభారతి చట్టానికి సంబంధించిన విధివిధానాలను రూపొందించి, ఈ చట్టాన్ని అమలులోనికి తీసుకొస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. కొత్త సమస్యలు రాకుండా ఉన్న సమస్యలు పరిష్కారమ య్యేలా రైతులకు ప్రయోజనం కలిగేలా, అధికారులు తప్పుచేయడానికి ఆస్కారం లేకుండా విధివిధానాలను రూపొందిస్తున్నామన్నారు. నూతన రెవెన్యూ భూభారతి చట్టం భూ పరిపాలనలో పెను మార్పులను తీసుకురాబోతుందన్నారు. భూ హక్కులను రక్షించడం, భూ వ్యవహారాలలో పారదర్శకత తీసుకురావడం, భూలావాదేవీలను సులభతరం చేసి, సామాన్యులకు కూడా రెవెన్యూ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఈ చట్టం ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ చట్టం తరతరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుందని, భవిష్యత్తులో మరింత మెరుగైన విధానాలు, సాంకేతికతను ఉపయోగించుకుని భూ పరిపాలనను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తామన్నారు. నూతన చట్టం ద్వారా భూ యాజమాన్య హక్కులనే కాకుండా వారి జీవితాలను ఆత్మగౌరవాన్ని ఆర్థిక స్వాతంత్ర్యాన్ని తీసుకొస్తుందని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, సిసిఎల్‌ఏ పిడి , సిఎంఆర్‌ఓ మకరంద్, భూ చట్ట నిపుణులు భూమి సునిల్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి , వికారాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల కలెక్టర్లు వివిధ జిల్లాల ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్‌లో ఎన్నికలు జాప్యంచేసే ఎత్తుగడ

## బంగ్లాదేశ్ వామపక్షాల విమర్శ

**ఢాకా :** పార్లమెంటు ఎన్నికలకే ప్రాధాన్యం ఇవ్వాలని, సత్వరం ఈ ఏడాదిలోనే ఎన్నికలు పూర్తి చెయ్యాలని బంగ్లాదేశ్ వామపక్ష ప్రజాస్వామ్య కూటమి (ఎల్ డి ఎఫ్) ఆ దేశ ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేసింది. స్థానిక ఎన్నికలు ముందా? పార్లమెంటు ఎన్నికలు ముందా? అని ప్రభుత్వం దేశంలో చర్చకు తెరలేపడం ద్వారా మొత్తం ఎన్నికల ప్రక్రియను జాప్యం చేయాలనే ఎత్తుగడను ప్రభుత్వం ముందుకు తీసుకువచ్చిందని బంగ్లాదేశ్ కమ్యూనిస్టుపార్టీ (సిపిబి) అధ్యక్షుడు షా అలమ్, ప్రధాన కార్యదర్శి రూహిన్ హుస్సేన్ ప్రిన్స్ విమర్శించారు. తక్షణం ఎన్నికల తేదీని ప్రకటించాలని కోరారు. ఢాకాలోని ఎన్నికల కార్యాలయంలో బంగ్లాదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ఎఎంఎం నజీర్ ఉద్దీన్‌తో వామపక్ష ప్రజాస్వామ్య కూటమి నాయకులు మంగళవారంనాడు సమావేశమైన తర్వాత వారు పాత్రికేయులతో మాట్లాడారు. దేశంలో ఎన్నికలపై చర్చను లేవదీసి తన ప్రయోజనాలకు ప్రభుత్వం ఉపయోగించుకుంటోందని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల తర్వాతే కొత్త ప్రభుత్వ హయాంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు అవకాశం కల్పించాలని ఎన్నికల ప్రధాన అధికారిని వామపక్ష నాయకులు కోరారు. బంగ్లాదేశ్‌లో స్తభించిపోయిన ప్రజాస్వామ్య ప్రక్రియను తక్షణం పునరుద్ధరించాల్సిన అవసరం ఉందని, వీలైనంత త్వరగా ఈ పునరుద్ధరణ జరగాలని, దేశ ఎజెండాలో ప్రజాస్వామ్య పునరుద్ధరణే ప్రధానాంశం కావాలని షా అలమ్ ప్రధాన ఎన్నికల అధికారిని కోరారు. ప్రజాస్వామ్య సంస్కరణలను, ఎన్నికలను జోడెద్లబండిలా ఏకకాలంలో ముందుకు తీసుకువెళ్ళవచ్చునని ఆయన హితవు చెప్పారు. తమ కూటమి పార్లమెంటు ఎన్నికలకు సిద్ధంగా ఉందని రూహిన్ హుస్సేన్ ప్రిన్స్ అన్నారు. సోషలిస్టుపార్టీ ఆఫ్ బంగ్లాదేశ్ ప్రధాన కార్యదర్శి బజ్లూర్ రషీద్ ఫిరోజ్ మాట్లాడుతూ, తక్షణం





ఎన్నికల ప్రక్రియను ప్రారంభించకపోతే దేశంలో అస్థిరత, భయం, అభద్రత ఇదేవిధంగా కొనసాగుతుందని, భయం, అభద్రత మరింత పెరుగుతాయని హెచ్చరించారు. పార్లమెంటు ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడం ద్వారానే దేశంలో అస్థిరతను, సంక్షోభాన్ని నివారించగలమని ఆయన అన్నారు.

# ప్రైవేటు–ప్రభుత్వ భాగస్వామ్యంతో శిఖరస్థాయికి రక్షణ రంగ విస్తరణ

## రాజేశ్ కుమార్ సింగ్ వెల్లడి

**న్యూఢిల్లీ :** భారత రక్షణరంగ సామూహిక విస్తరణ ప్రైవేటు–ప్రభుత్వరంగ భాగస్వామ్యంతో శిఖరస్థాయికి చేరుకోగలదని ఆ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ చెప్పారు. రక్షణరంగంలో ముందుతరం ఉత్పత్తుల తయారీలో దేశాన్ని ప్రపంచంలోనే ఒక ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దడానికి ప్రైవేటు–ప్రభుత్వ భాగస్వామ్యం ఎంతో కీలకమైనదని ఆయన సూచించారు. సోమవారం సాయంత్రం (17వ తేదీ) పొద్దుపోయిన తర్వాత న్యూఢిల్లీలో జరిగిన రక్షణ రంగ సదస్సులో రాజేశ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, భారతదేశ రక్షణరంగ ఎగుమతులు రూ.21,000 కోట్లకు పెరిగాయనీ, గడచిన పది సంవత్సరాలలో రక్షణరంగ ఎగుమతులు 30 రెట్లు పెరిగాయని చెప్పారు. భారత రక్షణ రంగ వ్యవస్థ సామూహిక విస్తరణ శిఖరస్థాయిలో ఉందనడానికి ఇది ఒక చిహ్నమని బాహాటంగా తెలుస్తోందన్నారు. రక్షణ రంగంలో ప్రభుత్వ అధీనంలో ఉన్న వివిధ సంస్థలు, లైసెన్సుడు కంపెనీలు, ఎంఎస్ఎంఇలు అన్నీ రక్షణపరిశ్రమ మౌలిక విస్తరణకు మూలస్తంభాలుగా ఉపయోపడతాయన్నారు. ఈ రంగంలోకి కొత్తగా ప్రవేశించేవారికి, కొత్త సాంకేతిక పరిజ్ఞాన ప్రవేశానికి ఆటంకాలను తగ్గించడంపైనే తాము దృష్టి కేంద్రీకరిస్తున్నామన్నారు. తద్వారా ఈ రంగం మరింత విస్తరిస్తుందన్నారు. రూ.6.21 లక్షల కోట్లతో ఉన్న రక్షణరంగ బడ్జెట్ 2025–26 ఆర్థిక సంవత్సరంలో రూ.6.81 లక్షలకోట్లతో 9.5 శాతానికి పెరుగుతుందని అంచనావేశారు. రాబోయే దశాబ్దకాలంలో 20–25 బిలియన్ డాలర్లు ఖర్చు చేస్తామని, అదేవిధంగా బహుశా ఆధునీకరణ ద్వారా ఏటా 30 బిలియన్ డాలర్ల మేరకు కూడా విస్తరించే అవకాశం ఉందన్నారు. సమకాలీన ప్రపంచంలో ఆధునిక యుద్ధతంత్రాలలో ఉన్న అత్యంత సంక్లిష్టతను సమర్థవంతంగా అధిగమించాలంటే సాంకేతికంగా ఎంతో ముందంజలో ఉండే రక్షణ పరికరాలు ఎంతో అవసరమనీ, రక్షణ దళంయుద్ధానికి ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండేందుకు వీలుగా సరికొత్త రక్షణ సామాగ్రిని నిర్మించుకోవాలన్న ప్రభుత్వ అభిలాషను ఆ సదస్సులో ఆయన వ్యక్తం చేశారు. రక్షణరంగానికి సంబంధించిన వారందరినీ ఒక్కచోటచేర్చి యాక్సిస్ బబ్యాంక్ ఈ సదస్సుకు ఆతిథ్యం ఇచ్చింది. వీరిలో ప్రభుత్వ అధికారులు, పరిశ్రమలకు చెందినవారు, ఆర్థిక సంస్థలకు చెందినవారు, ఇతరులు ఉన్నారు. వీరందరినీ యాక్సిస్ బ్యాంక్ ఒకేచోటకు చేర్చి ఈ సదస్సు ఏర్పాటు చేసింది. రక్షణరంగాన్ని విస్తరించడానికి అవకాశం ఉన్న, అందుకు అనుబంధంగా సహాయపడేవారంతా సమన్వయంతో రక్షణరంగ అభివృద్ధికి ఉపయోగపడాలని రాజేశ్ కుమార్ సింగ్ కోరారు. ఈ రంగంలో పెట్టుబడుల విస్తరణకు దోహదపడాలని కోరారు. 'ఆత్మనిర్భర్ భారత్'ను సాధించడానికి లేదా వ్యూహాత్మకంగా స్వయంసమృద్ధి సాధించడానికి భారత రక్షణవ్యవస్థను పూర్తిశక్తిసామర్థ్యాలతో తీర్చిదిద్దడానికి సంబంధిత వ్యక్తులు, సంస్థలన్నీ ఒకే వేదికపైన ఏకమై చర్చలు జరపాలని కోరారు. భారత రక్షణ వ్యవస్థకు శక్తిసామర్థ్యాలు సమకూర్చడం దేశ భద్రతలో అత్యంత కీలకమైన విషయమని అన్నారు. ''ఇది ఒక నిరంతర కృషి, దీనిపై అదేపనిగా దృష్టిమరల్చకుండా కృషి చేయాల్సిన అవసరం ఉంది, ఇది ప్రాధాన్యతలలో ఒకటి, రక్షణరంగ ఆధునీకరణ, సంస్కరణ, వ్యూహాత్మక స్వయం సమృద్ధికి అన్వేషణ ఎంతో ముఖ్యం'' అని ఆయన అన్నారు. భారత రక్షణమంత్రిత్వశాఖ ఇటీవల 2025వ సంవత్సరాన్ని ''సంస్కరణల సంవత్సరం''గా ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. వ్యవస్థలను, ఉత్పత్తిదారులను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దడం దీని వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశం అని చెప్పారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విధానంలో సరళీకరణ, పారిశ్రామిక ఉత్పత్తిదారులకు లైసెన్సింగ్ విధానంలో సడలింపులు వంటివన్నీ భారత రక్షణ రంగ వ్యవస్థను, రక్షణ పరిశ్రమ వృద్ధిని మరింత వేగవంతం చేస్తాయని అన్నారు.

## తక్షణమే మిర్చిబోర్డు (మొదటి పేజీ తరువాయి)

రైతులు హాజరు కావడంతో విధి లేక పోలీసులు మార్కెట్‌లోకి అనుమతించారు. రైతు సంఘం, సిపిఐ నాయకులు రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు ఆందోళనకారుల వద్దకు వచ్చి అధికారులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని ధర పెంపుకు సంబంధించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి బాగం హేమంతరావు మాట్లాడుతూ మిర్చి బోర్డు ఏర్పాటుతోనే మిర్చి ధరలకు పరిష్కారం లభిస్తుందన్నారు. రోజు రోజుకు మిర్చి ధర పడిపోతుందని నాఫెడ్‌ను రంగంలోకి దించి మిర్చి క్వింటా ఒక్కింటికి రూ. 25వేల చొప్పున కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. మిర్చి ధర తగ్గింపుకు సంబంధించి పాలకులే బాధ్యత వహించాలని స్పష్టం చేశారు. పెట్టుబడి ఆధారంగా మద్దతు ధరను నిర్ణయించాలని అనేక ఏళ్లుగా ఆందోళనలు జరుగుతున్నప్పటికీ పాలకులు స్పందించడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగం పట్ల వివక్ష ప్రదర్శిస్తుందని, రైతుల సంక్షేమాన్ని పూర్తిగా మరిచిపోయిందని హేమంతరావు ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని కూడా కార్పొరేట్లకు అప్పగించాలని కేంద్రం కుట్ర చేస్తుందన్నారు. నూటికి 60 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. వ్యవసాయ ఉత్పత్తి ధరలను స్థిరీకరించి సాగుకు గిట్టుబాటయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మిర్చి ధర తగ్గింపు విషయంలో వ్యాపారులు, అధికారులు సిండికేట్‌గా మారుతున్నారని ఆయన తెలిపారు. మిర్చి ధర తగ్గింపుపై తగు చర్యలు తీసుకొని పక్షంలో మార్కెట్‌లో వ్యాపార లావాదేవీలను స్తంభింపజేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, మిడికంటి చిన్నవెంకటరెడ్డి, రావి శివరామకృష్ణ, జాగర్లమూడి రంజిత్, ఏపూరి రవీంద్రబాబు, మందడపు రాణి, రైతు సంఘాల నాయకులు పుచ్చకాయల సుధాకర్, బానోత్ రాంకోటి, నూనెశశిధర్, బాగం ప్రసాద్, కూచిపూడి రవి, ప్రసాద్, ఇటికాల రామకృష్ణ, యడ్లపల్లి శంకరయ్య, పొద్దుటూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి నిర్ణయాలా? (మొదటి పేజీ తరువాయి)

దాఖలైన పిటిషన్లను ఈనెల 19న 'ప్రాధాన్యత ఆధారంగా' పరిశీలిస్తామని సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. కాగా, కొత్త ఎన్నికల కమిషనర్‌ను ఎంపిక చేసే కమిటీ సమావేశంలో తాను ప్రధానమంత్రి మరియు హోంమంత్రికి ఒక అసమ్మతి నోట్‌ను సమర్పించానని రాహుల్‌గాంధీ మంగళవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. 'కార్యనిర్వాహక జోక్యం లేని స్వతంత్ర ఎన్నికల కమిషన్‌లో అత్యంత ప్రాథమిక అంశం ఎన్నికల కమిషనర్, ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను ఎంపిక చేసే ప్రక్రియ. సుప్రీంకోర్టు ఆదేశాన్ని ఉల్లంఘించి, భారత ప్రధాన న్యాయమూర్తిని కమిటీ నుండి తొలగించడం ద్వారా, మోడీ ప్రభుత్వం మన ఎన్నికల ప్రక్రియ సమగ్రతపై కోట్లాది మంది ఓటర్ల ఆందోళనలను మరింత తీవ్రతరం చేసింది' అని రాహుల్ తన అసమ్మతి నోట్‌ను ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రతిపక్ష నాయకుడిగా బాబాసాహెబ్ అంబేద్కర్, దేశ వ్యవస్థాపక నాయకుల ఆదర్శాలను నిలబెట్టడం, ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచడం తన కర్తవ్యం అని రాహుల్ అన్నారు. కొత్త సిఇసిని ఎంపికపై ప్రధానమంత్రి, హోంమంత్రి అర్ధరాత్రి నిర్ణయం తీసుకోవడం అగౌరవకరమైనది, అమర్యాదకరమైనదని విమర్శించారు. కమిషనర్ ఎంపిపై సుప్రీంకోర్టులో విచారణ జరగనుందని, ఈ క్రమంలో మోదీ సర్కారు తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. ప్యానెల్‌కు సమర్పించిన తన అసమ్మతి నోట్‌లో రాహుల్ గాంధీ జూన్ 1949లో స్వతంత్ర ఎన్నికల కమిషన్ ఏర్పాటు గురించి చర్చించడానికి రాజ్యాంగ సభలో బి.ఆర్. అంబేద్కర్ ప్రసంగాన్ని ఉదహరించారు. భారత ప్రజాస్వామ్యంలో, ఎన్నికల కమిషన్ వ్యవహారాల్లో కార్యనిర్వాహక జోక్యం గురించి ఆయన ఆ కమిషన్‌లో హెచ్చరించారు. మార్చి 2, 2023న సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులో, ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన కమిటీ ద్వారా సిఇసి, ఎన్నికల కమిషనర్ల నియామకం చేపట్టాలని ఆదేశించిందని గుర్తుచేశారు. అయితే, యథాప్రకారం భారత ఎన్నికల సంఘం నూతన సారథిగా జ్ఞానేష్ కుమార్, ఎలక్షన్ కమిషనర్‌గా వివేక్ జోషి పేర్లను త్రిసభ్య కమిటీ ఖరారు చేసింది. ఆ పేర్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కమిటీ పంపగా ఆమె వెంటనే ఆమోదించారు.

## నేర శైలి మారుతోంది (మొదటి పేజీ తరువాయి)

సమాచారంతో సమాజంలో గందరగోళం ఏర్పడుతుందని సిఎం తెలిపారు. 24/7 సైబర్ హెల్ప్‌లైన్ 1930 నంబర్‌ను అందరికీ షేర్ చేయాలని ఆయన సూచించారు. పూర్తిస్థాయిలో పనిచేసే సైబర్ సెక్యూరిటీ బ్యూరో, పౌరులను రక్షించడానికి అంకితమైన సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అని అన్నారు. గత ఏడాది తెలంగాణ రాష్ట్రంలో ఏడు కొత్త ప్రత్యేక సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లను ప్రారంభించామని, సైబర్ నేరాగాళ్లు దోచుకున్న సొమ్ము రికవరీల్లో సైబరాబాద్ పోలీసులు ముందంజలో ఉన్నారన్నారు. మొదటిసారి ఇలాంటి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నందుకు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్‌ను సిఎం అభినందించారు.మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ త్వరలోనే కొత్త సెక్యూరిటీ పాలసీని ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. అభివృద్ధి, సైబర్‌సెక్యూరిటీ, ఈకో విధానానికి ప్రభుత్వం అనుకూలమైన విధానాలను తీసుకుంటుందన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ ప్రారంభించామని, తద్వారా యువతలో నైపుణ్యాన్ని పెంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. సాంకేతికత ప్రజలకు ఉపయోగపడాలని శ్రీధర్‌బాబు తెలిపారు.

## అటవీశాఖ అధికారులు (మొదటి పేజీ తరువాయి)

పట్టుబడ్డారు. బోయతండా నుంచి స్మశానవాటికకు సంబంధించిన మట్టి రోడ్డు వర్షాకాలంలో వరదలకు కొట్టుకుపోవడంతో జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం గ్రామపంచాయతీ నిధుల ద్వారా రూ.1.50లక్షలు మట్టి రోడ్డు నిర్మాణానికి మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పట్టా ఉన్న పొలం నుంచి మట్టిని తోలేందుకు ప్రయత్నించగా బీట్ అధికారి హరిలాల్ ఆపనిని ఆపి రూ.30వేలు లంచం ఇచ్చి మట్టితోలాలని కాంట్రాక్టర్‌కు తెలపడం జరిగింది. ఈ మేరకు సదరు కాంట్రాక్టర్ అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించడంతో ఏసీబీ అధికారులు పన్నిన పథకం ప్రకారం ఉదయం ఆ కాంట్రాక్టర్ కొమరారం అటవీశాఖ కార్యాలయంలో రేంజి అధికారి, బీట్ అధికారులకు రూ.30వేలు లంచం ఇవ్వగా అక్కడే ఉన్న ఏసీబీ అధికారులు వారిని పట్టుకున్నారు. ఎవరైనా లంచం అడిగితే..టోల్‌ఫ్రీ నం.1064, 91543 388981లకు ఫోన్ చేయాలని, చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. లంచం విషయం చెప్పి అధికారిని పట్టిస్తే మళ్లీ ఆఫీసుల్లో తమ పనులు జరగవనే అపోహలు వీడాలని, న్యాయంగా, చట్టబద్ధంగా ఉన్న బిల్లులను మేమే దగ్గరుండి చేయిస్తామని ఏసీబీ అధికారులు హామీ ఇచ్చారు. ఈ ఏసీబీ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ వై రమేశ్, అధికారులు పాల్గొన్నారు.

## బతికే ఉంది (మొదటి పేజీ తరువాయి)

వ్యక్తం చేశారు. స్థానికులలో ఆనందం పెల్లుబికింది. బతుకమ్మ కుంట కాదు.. ఇది మా స్థలమంటూ ఇప్పటివరకూ నమ్మబలికిన వారు ఇప్పుడేమంటారు అని అక్కడి స్థానికులు ప్రశ్నించారు. కబ్జాల చెరలో చెరువు ఆనవాళ్లను కోల్పోయిన చెరువుకు ప్రాణం పోయమని స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. అక్కడి ముళ్ళ పొదలను తొలగించారు. తవ్వకాలు చేపట్టారు. దశాబ్దాలుగా నింపిన మట్టిని మొత్తం తొలగిస్తే చెరువు కళకళలాడుతుందని స్థానికులు చెబుతున్నారు. అయితే బతుకమ్మ కుంట స్థలం తనదంటూ బిఆర్ఎస్ నాయకుడు ఎడ్ల సుధాకర్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా, కింది కోర్టుకు వెళ్లాలని సూచించిన విషయం తెల్సిందే.

**చెరువు నేపథ్యం ఇది..**

అంబర్‌పేట్ మండలం, బాగ్ అంబర్‌పేట్‌లోని సర్వే నంబరు 563లో 1962 63 లెక్కల ప్రకారం మొత్తం 14.06 ఎకరాల విస్తీర్ణంలో బతుకమ్మ కుంట చేరువు ఉండేది. బఫర్ జోన్‌తో కలిపి మొత్తం చెరువు వైశాల్యం 16.13 ఎకరాల విస్తీర్ణం అని సర్వే అధికారులు తేల్చారు. తాజా సర్వే ప్రకారం అక్కడ కేవలం 5.15 ఎకరాల విస్తీర్ణం మాత్రమే భూమి మిగిలింది. ప్రస్తుతతం మిగిలి ఉన్న 5.15 ఎకరాల విస్తీర్ణంలోనే బతుకమ్మ కుంటను పునరుద్ధరించేందుకు హైడ్రా చర్యలు చేపట్టింది. ప్రస్తుతం అక్కడ నివాసం ఉంటున్న వారికి ఎలాంటి ముప్పు లేకుండా చెరువు తవ్వకానికి హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశించారు. ఒకప్పటి ఎర్రకుంటనే చెరువునే కాలక్రమంలో బతుకమ్మ కుంటగా పేరు మారిందని స్థానికులు, రెవెన్యూ రికార్డులు కూడా ఇదే విషయాన్ని చెబుతున్నాయి. సంవత్సరాల తరబడి బతుకమ్మకుంటలో చెత్తచెదారం, నిర్మాణ వ్యర్థాలు పారబొయడంతో చెరువు ఆనవాళ్లు కోల్పోయింది. బతుకమ్మ కుంట చుట్టూ సుందరీకరణ పనులు చేపట్టాలని హైడ్రా నిర్ణయించింది.

# బడ్జెట్‌లో ఆరోగ్యశ్రీకి సమృద్ధిగా నిధులు




## డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మల్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వచ్చే ఆర్థిక సంవత్సర బడ్జెట్‌లో రాజీవ్ ఆరోగ్యశ్రీకి సమృద్ధిగా నిధులను కేటాయించడంతో పాటు పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోనికి తీసుకొస్తామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క మల్లు అన్నారు. డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ విభాగాలను ఆధునీకరిస్తామన్నారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రీ బడ్జెట్ సమావేశం మంగళవారం జరిగింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి భట్టి విక్రమార్క ప్రస్తుత బడ్జెట్‌లో కేటాయింపులు, ప్రతిపాదనలు తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క, దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ రానున్న ఏడాది కాలంలో రాష్ట్రంలో వైద్య కళాశాల భవనాలు, ఆసుపత్రుల నిర్మాణ పనులు పూర్తవుతాయని మంత్రులు తెలిపారు. పేద, మధ్యతరగతి వర్గాలు అత్యధికంగా ఆధారపడే వైద్య, ఆరోగ్య శాఖకు నిధుల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత నిస్తామన్నారు. గత దశాబ్ద కాలంగా డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని, ప్రస్తుతం ఈ మూడు రంగాలకు ప్రాధాన్యతనిస్తూ రాబోయే రోజుల్లో బలోపేతం చేస్తామని వారు తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను పెద్ద సంఖ్యలో వినియోగించుకునేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రులు ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్లాంటోరియంలు నిర్మించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నదన్నారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్యకార్యదర్శి క్రిస్టియాన చొంగ్తు, సైన్స్ అండ్ టెక్నాలజీ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి హరిత పాల్గొన్నారు.

# ఉద్యాన పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్ పథకం

## అమలు ఆలోచనలో ప్రభుత్వం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు





**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అడవి జంతువు, కోతుల నుండి ఉద్యాన పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ పథకం అమలవుతున్న హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాలలో పర్యటించి, రాష్ట్ర ప్రభుత్వం తరపున సబ్సిడీపై అందించేందుకు విధివిధానాలు తక్షణమే సిద్ధం చేయడంతోపాటు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో మంగళవారం ఉద్యానశాఖ అధికారులతో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అటవి జంతువుల కారణంగా కూరగాయాలు, ఉద్యాన పంటలకు అపార నష్టం వాటిల్లుతుండడంతో ఈ పంటల సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారని ఈ సమస్య పరిష్కారానికి సోలార్ ఫెన్సింగ్ ఓ పరిష్కారమని, ఇందుకు కావాల్సిన చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా మరింత పెద్ద ఎత్తున కూరగాయలు, ఉద్యాన పంటల సాగు చేయడానికి రైతులు ముందుకు రావడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అదేవిధంగా హైదరాబాద్ నగరానికి 100 కిలోమీటర్ల పరిధి లోపు ఉన్న అన్ని ప్రాంతాలలో కూరగాయాల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అందు కోసం పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటు చేసి, రైతులకు ప్రోత్సహకాలు అందించేలా చూడాలని సూచించారు. కూరగాయల సాగు కోసం అవసరం మేరకు యంత్ర పరికరాలు సబ్సిడీపై అందించి, సాగును పెద్ద ఎత్తున ప్రోత్సహించాలన్నారు. రాబోయే రెండు, మూడు ఏళ్లలో కూరగాయల పంటలను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసి, కూరగాయలను దిగుమతి చేసుకొనే స్థితి నుండి ఎగుమతి చేసే స్థితికి తీసుకురావాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకు వచ్చే ఆర్థిక సంవత్సరం సంబంధించి కూడా ముందస్తుగా డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ కోసం దరఖాస్తులను స్వీకరించి, గ్రౌండింగ్ మొదలు పెట్టాలన్నారు. అంతేకాకుండా ఇతర రాష్ట్రాలలో సాగు చేస్తు లాభాలు పొందుతున్న మెకడమియా పంటను రాష్ట్రంలో ప్రవేశపెట్టడానికి గల వాతావరణ స్థితిగతులు, నేలలు, నర్సరీలు, మార్కెటింగ్ అవకాశాలను అధ్యయనం చేయాలని ఉద్యానశాఖ అధికారులను మంత్రి సూచించారు.

## ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని పూర్తి చేయాల్సిందే

మార్చి నెలాఖరు కల్లా ఆయిల్ పామ్ సాగు లక్ష్యాన్ని పూర్తి చేయాల్సిందేనని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. లక్ష్యా న్ని, చేరుకోని ఆయిల్ పామ్ కంపెనీలకు నోటిసులు జారీ చేసి, అవసరమైతే అనుమతులు రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయిల్ పామ్ చట్టంలో ఉన్న నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇప్పటికే విశ్వతేజ ఆయిల్ పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేసి మల్టి నేషనల్ కంపెనీ అయిన హిందుస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ కంపెనీకి సదరు ప్రాంతాన్ని అప్పగించడం జరిగిందన్నారు. లక్ష్యాలను పూర్తి చేయనివాటి స్థానంలో ఆయిల్ ఫెడ్‌కు బాధ్యతలు అప్పగిస్తామని మంత్రి తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆయిల్ పామ్ సాగు కోసం రెండు లక్షల ఎకరాలను లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని ఆదేశించారు. అదేవిధంగా ప్రైవేట్ కంపెనీలు కూడా లక్ష్యానికి అనుగుణంగా ప్లాంటేషన్ పూర్తి చేసేట్టుగా, ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పర్యవేక్షణ చేయాలని ఉద్యానశాఖ డైరెక్టర్‌కి సూచించారు. వచ్చే ఏడాది చివరి నాటికి ఉమ్మడి జిల్లాలలో కనీసం ఒక పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగేలా చూడాలని, పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కనీసం సంబంధిత జిల్లాలలో 6 వేల ఎకరాలకు పైన ప్లాంటేషన్ ఉండేట్టుగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావు, హార్టికల్చర్ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఆయిల్ ఫెడ్ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

# కెసిఆర్ చేసిన అప్పలకు వడ్డీ చెల్లించేందుకే మళ్లీ అప్పలు



## మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కెసిఆర్ పదేళ్ల పాలనలో చేసిన అప్పులకు వడ్డీని చెల్లించేందుకే మళ్లీ అప్పులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని, అందుకే ప్రజాప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో ఆలస్యం జరుగుతోందని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ప్రజలు ఇచ్చిన గొప్ప అవకాశాన్ని బిఆర్‌ఎస్ నిలుపుకోలేకపోయిందన్నారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంఎల్‌ఎలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణతో కలిసి మంత్రి జూపల్లి మాట్లాడుతూ కెసిఆర్ మళ్లీ సిఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నట్టుగా చెబుతున్నవారు, కెసిఆర్ ఎందుకు సిఎం కావాలో కారణాలు చెప్పాలన్నారు. కెసిఆర్ పదేళ్ల పాలన కారణంగా అప్పులకు ప్రతి నెలా రూ.6500 కోట్ల వడ్డీని చెల్లించేలా చేశారని ఎద్దేవా చేశారు. కెసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయి ఉంటే తెలంగాణను అమ్మేసే పరిస్థితి వచ్చేదన్నారు. ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలను కాంట్రాక్టర్లకు దోచిపెట్టారని, మామ, అల్లుడు టెండర్లను పంచుకున్నారని ఆరోపించారు. టెండర్లను పారదర్శకంగా ఆహ్వానించి ఉంటే, రూ.50 వేల కోట్లు మిగిలేవి అని అన్నారు. ప్రజాధనాన్ని లూటీ చేయడంతో పాటు ఆంధ్రా కాంట్రాక్టర్లకు దోచి పెట్టారని ఆరోపించారు. అంబేద్కర్ విగ్రహానికి పదేళ్ల పాలనలో కెసిఆర్ ఏ ఒక్క రోజు కూడా పూలదండ వేయలేదన్నారు. గద్దర్‌ను ఎర్రటి ఎండలో మూడు గంటల పాటు ప్రగతి భవన్ గేటు ముందు నిలబెట్టారని మంత్రి జూపల్లి గుర్తు చేశారు. రూ.5లక్షల బాకీల కోసం అక్షయపాత్ర లాంటి రింగ్ రోడ్‌ను విక్రయిస్తారా అని నిలదీశారు. సర్పంచ్‌లకు ఏళ్ల తరబడి బిల్లులు పెండింగ్‌లో పెట్టిందే కెసిఆర్ అని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌కు కర్రు కాల్చి వాత పెడతారన్నారు.

కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. వెల్దండలో సిఎం రేవంత్ రెడ్డి వెయ్యి ఎకరాల భూమిని కొనుగోలు చేశారని కెటిఆర్ ఆరోపించడం అర్థరహితమని, దీనిని నిరూపించాలని కెటిఆర్‌ను ఆయన డిమాండ్ చేశారు. వంశీకృష్ణ మాట్లాడుతూ కెసిఆర్ వైఖరి వల్లనే ఆంధ్రప్రదేశ్ నీటి దోపిడీకి పాల్పడుతోందన్నారు.

# పర్యాటక శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

## సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖలో పని చేస్తున్న కాంట్రాక్ట్ , అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్ధీకరించడంతో పాటు వారి జీతాల పెంచాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం చాడ వెంకటరెడ్డి నేతృత్వంలో యూనియన్ ప్రతినిధుల బృందం మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతి పత్రం అందజేశారు. పర్యాటక శాఖలో సుదీర్ఘ కాలంగా ఎంతో మంది అతి తక్కువ వేతనాలకే ఉద్యోగులు కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్నారని, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించి పాటు వారి వేతనాల పెంపుతో పాటు న్యాయబద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని మంత్రి జూపల్లిని చాడ వెంకటరెడ్డి కోరారు. దీంతో మంత్రి సానుకూలంగా స్పందిస్తూ జీతభత్యాల పెంపు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక శాఖ కాంట్రాక్ట్, అవుట్ సోర్స్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సబ్బు రాజమౌళి సంస్థ ఉద్యోగులు యల్. సాంబశివ రెడ్డి, యు.రమేష్ బాబు యస్.డి నాసర్ అలీ పాల్గొన్నారు.

# 17 మందికి జీవితఖైదు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పాత కక్షలతో ఒక వ్యక్తిని హత్య చేసిన కేసులో 17 మంది నిందితులకు జీవిత ఖైదు శిక్ష ఖరారైందని సిపి సుధీర్ బాబు వెల్లడించారు. అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అజీంపేట గ్రామంలో పాత కక్షలతో ఒక వ్యక్తిని హత్య చేసిన కేసులో 17 మంది నిందితులకు నల్గొండలోని ఎస్సీ, ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు మంగళవారం జీవిత ఖైదు శిక్ష విధించింది. కొందరు ఆవేశపరుల కుల అహంకారం, పాత కక్షలు, తాత్కాలిక ఉద్రేకం అన్నీ కలిసి ఒక వ్యక్తి మరణానికి కారణమైన సంఘటన అడ్డగూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అజీంపేట గ్రామంలో 2017 సంవత్సరంలో జరిగింది. ఈ కేసులో వివ రాలను పరిశీలిస్తే ఈ సంఘటనలో మృతుడు బట్ట లింగయ్య గతంలో అదే గ్రామానికి చెందిన యాదవ సామాజికవర్గానికి చెందిన ఒక వ్యక్తి మరణానికి కారణమయ్యి బెయిలు మీద బయ టకు రావడం జరిగింది. ఆ పగను మనసులో ఉంచుకున్న అతని కుటుంబ సభ్యులు మరియు తోటి కులస్తులు దసరా పండుగ సందర్భంగా జరిగే ఉత్సవాల్లో మృతుడు బట్ట లింగయ్య కుటుంబంతో సహా పాల్గొనడానికి వెళ్తున్న క్రమంలో గతంలో తన వల్ల చనిపోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఎదురుకాగా వారు క్షణికావేశంతో ఉద్రేకానికి లోనై, దుర్భాషలాడుతూ విచక్షణ రహితంగా, సామూహికంగా భౌతిక దాడికి పాల్పడడం మూలంగా తీవ్ర గాయాల పాలై మృతి చెందడం జరిగింది. ఈ కేసులు 17 మంది నిందితులకు జీవీత ఖైదు ఖరారైనట్లు తెలిపారు.

# 'వర్సిటీ'లకు రూ.5వేల కోట్లు

## బడ్జెట్‌లో కేటాయించాలని సిపిఐ (ఎం)రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విజ్ఞప్తి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఉన్న 15 వి శ్వవిద్యాలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు బడ్జెట్‌లో రూ.5వేల కోట్లు నిధులను కేటాయించాలని సిపిఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు మంగళవారం సిఎంకు జాన్ వెస్లీ లేఖ రాశారు. యూనివర్సిటీలలో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని జాన్ వెస్లీ తెలిపారు. ఇటీవల తను ఉస్మానియా యూనివర్సిటీ సందర్శించిన సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు, రీసెర్చ్ స్కాలర్స్ అక్కడి సమస్యలను తనదృష్టికి తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో అన్ని విశ్వవిద్యాలయాల అభివృద్ధికి రూ.5వేల కోట్లు కేటాయించి, ప్రత్యేకంగా ఓయుకు రూ.1000 కోట్లు నిధులను కేటాయించాలని లేఖలో సిఎంను కోరారు. అదేవిధంగా విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీలు భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడం లేదన్నారు.

కాంట్రాక్ట్ లెక్చరర్లను సుదీర్ఘకాలం కొనసాగించడం, నిధుల తీవ్ర కొరత కారణంగా విద్యార్థులు ల్యాబ్ పరికరాలు, హాస్టల్స్, మెస్, స్పోర్ట్స్ ఇతర మౌలిక సదుపాయాల సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారని తెలిపారు. వందేండ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీకి న్యాక్ నేషనల్ అస్సెస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ గుర్తింపులో వెనుకబడి ఉందని, యూనివర్సిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని జాన్ వెస్లీ లేఖ ద్వారా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# కెసిఆర్‌తోనే తెలంగాణ పూర్వ వైభవం

## సిఎం రేవంత్‌రెడ్డిది తొండాట : మాజీ మంత్రి హరీశ్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2020 గేమ్ ఆడటం లేదని తొండి.. గండి గేమ్ ఆడుతున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. ఆడేది తొండి ఆటని.. గ్యారంటీలకు గండి అని, మాటలు తొండి అని దుయ్యబట్టారు. మహిళలకు 2500 రూపాయలు గండి, తులం బంగారం, 4వేల పింఛన్, ఆరు గ్యారంటీలు అమలు కావటం లేదని తెలిపారు. సిద్దిపేట జయశంకర్ స్టేడియంలో కెసిఆర్ ట్రోఫీ విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి డబ్బుల కలెక్షన్‌లో మాత్రం 2020 గేమ్ ఫాస్టుగా ఆడుతున్నారన్నారు. కెసిఆర్ టెస్టు, వన్‌డే, డిపెండబుల్ ఆల్‌రౌండర్ అని కొనియాడారు. కెసిఆర్‌కు ఎప్పుడు ఎలా ఆడాలో బాగ తెలుసునన్నారు. రేవంత్‌రెడ్డి దమ్ముంటే రా ఏ గ్రామానికైన వెళ్తాం.. నీవు చెప్పిన ఆరుగ్యారంటీలు అమలయినాయా అడుగుతామని హరీశ్‌రావు సవాల్ చేశారు. కెసిఆర్ నాలుగు కోట్ల ప్రజల భావోద్వేగమన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపిన ఘనత కెసిఆర్ అన్నారు. తెలంగాణకు పూర్వవైభవం రావాలంటే మళ్లీ కెసిఆర్ రావాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో ప్రతి గ్రామంలో కెసిఆర్ పాలనను కోరుకుంటున్నారన్నారు. మహిళ క్రికెటర్ త్రిష అందరికి స్ఫూర్తి కావాలన్నారు. సిద్దిపేట గడ్డ నుండి ఇండియాకు ఆడే ఆటగాళ్లు రావాలన్నదే తనకల అన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటమిలు సహజమన్నారు. ఓడిన కృంగిపోకుండా మరోసారి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. రాష్ట్రంలో వచ్చే బిఆర్‌ఎస్ ప్రభు త్వం మూడు పర్యాయాలు ఉంటుందన్నారు. విజేతలకు బహుమతులు అందచేశారు.

# గెలిపిస్తే నిరుద్యోగ సమస్యపై గళం వినిపిస్తా

## స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యావంతులైన మేధావులరా రానున్న పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో మీరు ఓటు వేసే ముందుగా ఒక్కసారి ఆలోచించుకోవాలని మెదక్– నిజామాబాద్ – ఆదిలాబాద్ –కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ విజ్ఞప్తి చేశారు. వందల కోట్లు డబ్బులు వెదజల్లి గెలిచిన తర్వాత కనీసం మీ ఫోన్ కాల్ కూడా ఎత్తని అభ్యర్థులు కావాలో లేక, మీ మధ్యనే ఉండి. మీ కోసం పని చేసే విద్యావంతుడు కావాలో మీరే నిర్ణయించుకోవాలని కోరారు. హైదరాబాద్‌లోని దేశోద్ధరక్‌భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మెదక్– నిజామాబాద్ – ఆదిలాబాద్ – కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి డాక్టర్ మహ్మద్ ముస్తాక్ అలీ, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్. డి.సుధాకర్, అధికార ప్రతినిధులు ఎం. విజయ్, జావీద్ షరీఫ్, డాక్టర్ లక్ష్మానాయక్, యమున గౌడ్ మాట్లాడారు. ఈ సందర్భంగా మహ్మద్ ముస్తాక్ అలీ మాట్లాడుతూ వందల కోట్లకు పడగలెత్తిన కోటీశ్వర్లు రాజకీయ పార్టీల ముసుగులు ధరించి పట్టభద్రులు ఎన్నికల్లో పోటీ చేసి అరచేతిలో స్వర్గం చూపుతూ గెలిచే ప్రయత్నం చేస్తున్నారని, విద్యావంతులైన ఓటరులారా మీలో ఒక్కడిగా ఉన్న విద్యవంతుడైన తనకు ఓటు వేసి గెలిపించుకోవాలని కోరారు. అనేక ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక నిరుద్యోగులుగా మారిన విద్యావంతుల పక్షాన తన వాణి వినిపించే అవకాశం కల్పించాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. తన సేవాభావం చూసి జాతీయ స్థాయి పార్టీ అయిన ఆమ్ ఆద్మీ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని, ఆ పార్టీ అధినేత కేజ్రీవాల్‌కు రాష్ట్ర ఇంచార్జీ డాక్టర్ సుధాకర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ మెదక్– నిజామాబాద్ – ఆదిలాబాద్ –కరీంనగర్ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి పోటీ చేస్తున్న మహ్మద్ ముస్తాక్ అలీకి ఆమ్ ఆద్మీ పార్టీ సంపూర్ణ మద్దతను ఇస్తుందని తెలిపారు. ఏ పదవి లేకపోయినా తన స్వంత నిధులతో నిస్వార్థంగా అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ మీలో ఒక్కరైన మహ్మద్ ముస్తాక్ అలీని విద్యావంతులైన మీరంతా ఏకమై గెలుపించాలని పట్టభద్రుల ఓటర్లును కోరారు.

# ఇంజినీరింగ్ 'బి కేటగిరి' సీట్లు కౌన్సెలింగ్ ద్వారా భర్తీ

## రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌కు ఎఐఎస్‌ఎఫ్ వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** డొనేషన్ల పేరుతో లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఎఐఎస్‌ఎఫ్) డిమాండ్ చేసింది. బి కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇటికాల పురుషోత్తంను కలిసి ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు అధిక ఫీజుల దోపిడి చేస్తున్నాయని ఆరోపించారు. యాజమాన్య కోటా సీట్లను లక్షల రూపాయలకు అమ్ముకుంటూ విద్యా వ్యాపారం చేస్తున్నాయని, డిమాండ్ ఉన్న కోర్సు సీట్లకు ఇష్టానుసారంగా భారీగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీట్లను బ్లాక్‌లో పెడుతూ మెరిట్ విద్యార్థులకు ఇవ్వకుండా లక్షల రూపాయల ఫీజులు కట్టేవారికి సీట్లు ఇస్తున్నారని కొన్ని కోర్సులకు విపరీతమైన డిమాండ్ పెరిగిన నేపధ్యంలో ఆ సీట్లకు అడ్మిషన్ల కొరత సృష్టించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల రూపాయల ఫీజులు రాబడుతున్నారని ఇలాంటి కళాశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనేక ఇంజనీరింగ్ కళాశాలలు నిబంధనలు పాటించడం లేదని అధికారులు తనిఖీలకు వెళ్ళే సమయంలోనే విద్యార్హత కలిగిన టీచింగ్ సిబ్బందిని తాత్కాలికంగా నియమించుకుంటూ అనంతరం విద్యార్హత లేనివారితో కళాశాలలు నిర్వహణ చేస్తూ, పలు ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని, 'బి' కేటగిరి సీట్లను కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేయాలని లక్ష్మణ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ పురుషోత్తంకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్, ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి పాల్గొన్నారు.

# టిజిడిపిఎస్ సలహా కమిటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో విపత్తు నివారణకు ప్రణాళికలు, వాతావరణ మార్పుల ప్రభావం విశ్లేషణ, రాష్ట్ర ఆర్థిక, సామాజిక రంగాల్లో అంతరాలు, అభివృద్ధి విశ్లేషణ, పైలెట్ ప్రాజెక్టులు, పరిశోధనలను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం "తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టిజిడిపిఎస్)" సలహా కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చైర్మన్, డిప్యూటీ సిఎం,ప్రణాళిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో మంగళవారం టిజిడిపిఎస్)" సలహా కమిటీ మొదటి సమావేశం జరిగింది. టిజిడిపిఎస్ సలహా కమిటీలో ఒక చైర్మన్, ఎనిమిది మంది సభ్యులను నియమించారు. ఈ మేరకు ప్రణాళిక విభాగం ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ విశ్లేషణలు, రాష్ట్రంలో స్వల్ప కాలిక, దీర్ఘకాలిక ప్రణాళికలకు సలహా కమిటీ మద్దతుగా ఉంటుందని ప్రభుత్వం భావిస్తుంది.

**కమిటీ :**

1.చైర్మన్: డిప్యూటీ సిఎం, ప్రణాళిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు, సభ్యులుగా : ప్రొఫెసర్ కంచె ఐలయ్య, ప్రొఫెసర్ శాంతా సిన్హా, ప్రొఫెసర్ హిమాంశు, డాక్టర్ సుఖదేవ్ తొరాట్,నిఖిల్ దేవ్, ప్రవీణ్ చక్రవర్తి, ప్రొఫెసర్ భూక్య, ప్రొఫెసర్ పురుషోత్తం రెడ్డి నియమించారు. సలహా కమిటీ సమావేశంలో ప్రణాళిక విభాగం ముఖ్యకార్యదర్శి, తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ సిఇఒ సందీప్ కుమార్ సుల్తానియా పాల్గొంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# వాదనలు వినిపిస్తూ కుప్పకూలిన న్యాయవాది



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ హైకోర్టులో విషాద ఘటన చోటు చేసుకుంది. కోర్టు హాలులో న్యాయవాది కుప్పకూలిన ఘటన తోటి న్యాయవాదులను కలచివేసింది. వివరాల్లోకి వెళితే.. న్యాయవాది వేణుగోపాలరావు 21వ కోర్టు హాలులో ఓ కేసుకు సంబంధించి వాదనలు వినిపిస్తున్న సమయంలో ఒక్కసారిగా కూప్పకూలారు. గమనించిన తోటి న్యాయవాదులు వెంటనే అతన్ని అంబులెన్స్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వేణుగోపాలరావు గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. న్యాయవాది మృతికి సంతాప సూచకంగా 21వ కోర్టులో పిటిషన్ల విచారణను న్యాయమూర్తి నిలిపివేశారు. మిగతా కోర్టుల్లోనూ అత్యవసర పిటిషన్లు, పాస్ ఓవర్ పిటిషన్లను విచారించి.. రెగ్యులర్ పిటిషన్లను వాయిదా వేశారు.

# రుణమాఫీలో రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలం

## రైతు దీక్షలో బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసి-డెంట్, మాజీ మంత్రి కెటిఆర్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు కావచ్చినా ఇప్పటివరకు రుణమాఫీ చేయలేదని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్లులో బిఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఆధ్వర్యంలో రైతులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో నిరసన దీక్షలో మాజీ మంత్రి కెటిఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేవంత్ రెడ్డి 2 లక్షల రుణమాఫీ చేయలేదని విమర్శించారు. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు రైతులు ఆనందంగా ఉన్నారని, 70 లక్షల మంది రైతులకు రుణమాఫీ అందించామని తెలిపారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత 15 నెలలు కావచ్చినా ఇప్పటివరకు రుణమాఫీ చేయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి అత్తగారి నియోజకవర్గం కల్వకుర్తిలో కళ్యాణలక్ష్మి పథకం ప్రకారం ఒక్క తులం బంగా రం కూడా ఇవ్వలేదని కెటిఆర్ చెప్పారు. సిఎం రేవంత్ రెడ్డి ప్రజల్ని మోసం చేసి గెలిచాడన్నారు. అంతే కాకుండా ప్రభుత్వం ప్రజలకు ఏమాత్రం సహాయం చేయలేదు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు పి.సబితా ఇంద్రారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, సురభి వాణి దేవి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్ యాదవ్, అంజయ్య యాదవ్, డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, జిల్లా ఎంపిపిల సంఘం మాజీ అధ్యక్షురాలు తిరుమల శ్రీశైలం గౌడ్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు జప్లావత్ గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, డివిజన్-14, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, హైదరాబాద్.
No. 57/EE/C14/GHMC/KZ/2024-25 ప్రకటన తేది: 18.02.2025
జిహెచ్ఎంసి, గోషామహల్ సర్కిల్-14 కింద గన్ పార్క్ జంక్షన్ సుందరీకరణ కొరకు డిజిటల్ మెకానిజంతో డైనమిక్ వాటర్ ఫౌంటేన్ ఏర్పాటు చేయడం కోసం టెండర్లను ఆహ్వానించడమైనది. టెండర్ ప్రకటన / బిడ్ పిలుపు తేది: 18.02.2025, బిడ్ దాఖలుకు గడువు తేది మరియు సమయం: 25.02.2025న మ.3.00గం.ల వరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ (tender.telangana.gov.in)లో, సాంకేతిక బిడ్లు & ముందస్తు అర్హతకు ప్రారంభం: 25.02.2025న సా.04.30గం.లకు. అందువల్ల అర్హత కలిగిన ఏజెన్సీలు పై కాలంలో అవసరమైన అన్ని వివరాలతో తమ బిడ్లను సమర్పించవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-14, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 10376-PP/CL/ADVT/1/2024-25, Date: 18-02-2025

ప్రజాపక్షం
బుధవారం, ఫిబ్రవరి 19

# అందరి చూపు రియాద్ వైపు

సౌదీ అరేబియా రాజధాని రియాద్ సోమవారం ఒక చారిత్రక సన్నివేశానికి వేదిక అయింది. రష్యా, అమెరికా ఉన్నతస్థాయి మంత్రులు, దౌత్యవేత్తల సమావేశం ఉక్రేన్ తోపాటు యూరప్ ఖండంలో గుబులు పుట్టిస్తోంది. రష్యా–ఉక్రేన్ యుద్ధం పరిసమాప్తం ఆవశ్యకతపై అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు వ్లదిమీర్ పుతిన్‌తో గత బుధవారం టెలిఫోన్ సంభాషణ తదుపరి ఈ సమావేశం జరుగుతోంది. తమ సమస్యపై తమతో సంబంధం లేకుండా అమెరికా, రష్యా ఒప్పందం కుదుర్చుకుంటే అంగీకరించబోమంటున్న ఉక్రేన్, యూరప్, రియాద్ చర్చల బల్లవద్ద తమ సీటు రిజర్వేషన్‌ను డిమాండ్ చేస్తున్నాయి. ఇదే సమయంలో రష్యా–ఉక్రేన్ సంధిపట్ల యూరప్ వైఖరిని నిర్దుష్టపరిచేందుకు ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్ పారిస్‌లో యూరప్ నేతల సమావేశం ఏర్పాటు చేశారు. రష్యా ఆక్రమించుకున్న ఉక్రేన్ భూభాగాలను రష్యాకు కట్టబెట్టే విధంగా ఒప్పందాన్ని సహించబోమని, వాస్తవానికి ఇప్పుడు జరుగుతున్న యుద్ధం రష్యా–యూరప్ మధ్యఅని బ్రిటిష్ లేబర్‌పార్టీ ప్రధాని కీర్ స్టార్మర్ కుండబద్దలు కొట్టారు. ఉక్రేన్‌కు ఆయుధాలేకాదు, సైన్యాన్ని పంపుతామని తమ రణ తృష్ణను వెల్లడించారు. ఉక్రేన్ ఎన్నటికీ నాటో సభ్యురాలు కాజాలదని, అది ఏదో ఒక నాటికి రష్యాలో కలిసిపోతుందని అధ్యక్షుడు ట్రంప్ చేసిన ఆషామాషీ వ్యాఖ్యలు గూడార్థం తెలియక పశ్చిమ యూరప్ నేతలు తలలు పట్టుకున్నారు. ఉక్రేన్ అధ్యక్షుడు ఒలోదిమిర్ జెలెన్స్కీ ట్రంప్ వ్యాఖ్యలను ఖండించారు. అసలు సమస్య ఉక్రేన్‌ను అడ్డంపెట్టుకుని రష్యన్ సరిహద్దులకు నాటోను విస్తరింపజేయాలన్న యూరప్ తాపత్రయం; యూరప్ భద్రత ఒప్పందాలను గౌరవిస్తూ తమ దేశరక్షణకు రష్యా కోరుతున్న హామీలు. మూడేళ్ల క్రితం ఉక్రేన్‌పై రష్యా ప్రారంభించిన సైనిక దాడికి ఇదే మూలం. పుతిన్‌తో చర్చలకు జెలెన్స్కీ పలుమార్లు తిరస్కరించడం గుర్తుచేసుకోదగింది.

1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన నాటినుంచీ – 80 సంవత్సరాలుగా అమెరికా అండతో దిలాసాగా ఉన్న యూరప్ ముఖ్యంగా పశ్చిమ యూరప్ ఇప్పుడు గందరగోళంలో ఉంది.

యూరప్ తమ రక్షణ వ్యయం పెంచుకోవాలని, వారి రక్షణకు తాము బాధ్యత వహించబోమని అధ్యక్షుడు ట్రంప్ తమ మొదటి టరంలో చెప్పారు. ఇప్పుడు పునరుద్ఘాటించారు. 1945లో రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన నాటినుంచీ – 80 సంవత్సరాలుగా అమెరికా అండతో దిలాసాగా ఉన్న యూరప్ ముఖ్యంగా పశ్చిమ యూరప్ ఇప్పుడు గందరగోళంలో ఉంది. అయితే రియాద్ చర్చనీయాంశాలపై స్పష్టత లేదు. ఉక్రేన్–రష్యా మధ్య శాంతితో పాటు ట్రంప్ రష్యా పర్యటనకు ఏర్పాట్లు చేయటం ఎజండా అంటున్నారు. ఇక్కడ ప్రాథమిక అంగీకారం తదుపరి ఉక్రేన్‌ను చర్చల్లో భాగస్వామిని చేస్తారని అంటున్నారు. ఈ చర్చల ద్వారా ఒంటరితనం నుంచి బయటపడతామని రష్యా అధ్యక్షుడు ఆలోచనగా ఉంది. ఉక్రేన్ నాటో సభ్యత్వం మరిచిపోవాలని, రష్యా ఆక్రమించుకున్న క్రిమియాపై క్లెయింను జెలెన్స్కీ వదులుకోవాలని ట్రంప్ సలహాదారులు, స్వయంగా ట్రంప్ అన్నారు. ఇతర ఆక్రమిత ప్రాంతాలు చర్చల్లోకి వస్తాయని, చిన్నచిన్న సర్దుబాట్లు సాధ్యమేనని భావించబడుతోంది.

రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లవరోవ్, పుతిన్ సలహాదారు యూరీ ఉషకోవ్, అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రుబియో, జాతీయ భద్రత సలహాదారు మైక్ వాల్జ్, ప్రత్యేక దూత స్టీవ్ విట్కోఫ్ చర్చల్లో పాల్గొంటున్నారు. "అమెరికా–రష్యా సంబంధాల యావత్ పరిధి పునరుద్ధరించటం, అలాగే ఉక్రేన్ సమస్యపై చర్చలకు సన్నాహాలు చేయటం, ఇరు దేశాల అధ్యక్షుల సమావేశానికి ఏర్పాట్లు రియాద్ చర్చనీయాంశాలని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ చెప్పారు. అందువల్ల తమ తలలమీదుగా అమెరికా – రష్యా ఒప్పందానికి వస్తాయని ఉక్రేన్ అధ్యక్షుడు, పశ్చిమ యూరప్ నేతలు ఆందోళన చెందాల్సిన పనిలేదు.

# కోయ, గోండులు దేశ నిర్మాతలు!

అది గోదావరిలోయ దట్టమైన అడవి ప్రాంతం 2016 మార్చ్ 27 మాఘ పున్నమి వెన్నెల చిగిరిస్తున్న రోజులవి. మాఘ పున్నమి మధ్య భారతదేశంలో అతి ముఖ్యమైన రోజు. దీనిని కోయ పున్నమి అని కూడా సంబోధిస్తారు. ఆసియాలోనే అతి పెద్ద ఆదివాసీల మహా జాతర ప్రారంభం అయ్యే రోజులు కూడ ఇవే. వీటి అనుసంధానంగా గోదావరిలోయలో అనేక వేల్పు జాతరల కలయికలో సరిగ్గా పది సంవత్సరాల క్రితం ఎందుకో తెలియదు గాని ద్విచక్ర వాహనంపై ఒక ప్రయాణం . అది చరిత్ర మూలాన్ని అన్వేషించే ప్రయాణం అని తరువాత అర్థం అయింది. జీవితంలో మనం ఎన్నో ప్రయాణాలు చేస్తాం కానీ కొన్ని ప్రయాణాలు మనకు తెలువకుండ మనం మూలంతో అనుసంధానం అయి చేస్తాం. ఆ ప్రయాణాలు జీవిత ప్రయణాలుగా అనివార్యంగా మారుతాయి. అటువంటి ప్రయాణమే ఇది అని నాకు ఈ ప్రయాణం చేసిన 6 సంవత్సరాల తరువాత అర్థం అయింది.



దట్టమైన అడవులు, కొండలు, కిన్నెరసాని నది, అభయారణ్యంలో ఒక వేల్పు జాతర నడుస్తుంది అని తెలిసింది. అది పూర్తిగా ప్రకృతితో మిళితం అయిన జాతర. నాటి ఖమ్మం జిల్లా నేటి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మర్కోడు అనే ఆదివాసీ గూడెంలో ఉంది ఇది. గోదావరి నీటి మట్టానికి 200 ఫీట్ల ఎత్తు కొండలపై ఉంటుంది కాబట్టి ప్రయాణం కొండ పై సాగాల్సిందే. మొత్తంగా రాత్రి సమయం అడవిదున్నల భయం అధికం. పైగా పులుల సంచారం. అది దాటుకుంటూ అర్ధరాత్రి 12.45 కి చేరింది జాతర ప్రాంగణంలోకి మా ప్రయాణం. వెలిగీ వెలగని దీపాల వెలుతురు. అందులో డోలి చప్పుళ్ళు.. తూత కొమ్ముల శబ్దం, రేల పాటలు, నృత్యాలు, పున్నమి ఆరిన వెలుతురు, తెల్లరుగట్ల పండు పున్నమిలో కోయల ఆటలు.. పూర్తిగా ప్రకృతిలో మిళితమైన జీవనం, చుట్టుపక్కల గూడేలా ఆదివాసీలు చీమల దారల కనిపిస్తున్నారు. మొదట ఇది వేల్పు జాతరనే అనుకున్న కాని అక్కడ గద్దె పై కట్టి ఉన్న ఒక ఎర్రని గుడ్డపై ఏదో ప్రపంచ చరిత్రనీ మార్చగలిగే బొమ్మలు..నా కళ్ళకు మసక మసకగా కనిపించాయి. చిన్నగా గద్దెకు చేరింది నడక. కాని ఆ బొమ్మల అర్థం ఎవరికీ తెలియదు. సామాన్య ప్రజల దృష్టిలో అవి ఏదో విలువలేని బొమ్మలు. కాని నాకు మాత్రం ఏదో ప్రాచీన మూలం ఏదో అనిపిస్తుంది. డోలి చప్పుడు ఆగకుండా వినిపిస్తుంది. రేల పాట లో ఓ రేల..రెల..రే..రెల.. ఉత్తర దిక్కున 36 రాజ్యాలు, పశ్చిమ దిక్కున 24 రాజ్యాలు, తూర్పు దిక్కున 22 రాజ్యాలు, దక్షిణ దిక్కున 18 రాజ్యాలు, 101 రాజ్యాలు కోయలు పాలించినట్లు పాట. మదిలో ఒక ప్రశ్న. ఈ దేశాన్ని పాలించింది కోయ రాజులేనా? అవకాశం ఉందా? నేనొక పరిశోధక విద్యార్థిని అదే కోణంలో ఈ పాటనీ ఆవిష్కరించాలి చూడాలి కూడ, అంతలోపే ఎవరు బిడ్డ మీరు అని ఒక పిలుపు. వయస్సు 70 ఉంటుంది. నాకు ఈ బొమ్మల వివరాలు కావాలి దాద అని అడిగాను. అయిన బేరం బోయిన రాజు బిడ్డ రాజ్యమేలిండు ఇపుడు చెప్ప కాని పొద్దున రాపో అన్నాడు. అపుడు అర్థం అయింది కోయలు రాజరిక పాలకులు అని. రాత్రంతా నిద్రకన్నా ఎపుడు తెల్లరుతుంద అనే ఆత్రుత, మొత్తం మీద తెల్లారి మల్లి గద్దెలపై ఆ దాదనీ మర్యాద చేసి కూర్చోపెట్టినాను. ఈ బొమ్మలు 101 ఉంటాయి. బిడ్డ ఎందుకో 3వ గొట్టు భుంకరాజు, నాల్గవ గొట్టు సనపగని గానీ రాజు, అయిదవ గొట్టు రాయిబండానిరాజు, ఆరవగొట్టు బేరం బోయిన రాజు, 7వ గొట్టు పారేడు గట్టు రాజు, ఏనుగుపై బేరం బోయిన రాజు ఉన్నాడు. ఈ కోయ రాజులు భారతదేశాన్ని పరిపాలన చేసిన ఆనవాళ్లు బిడ్డ ఈ బొమ్మల లిపి అని మొత్తం వివరంగా చెప్పినపుడు అర్థం అయింది.

ఈ దేశ చరిత్ర ఈ వేల్పు పడిగలో ఉంది అని. ఇలా మొదలు అయిన పరిశోధన గోదావరి ఇరు వైపులా 205 ఇలాంటి వేల్పు జాతరాలను పరిశోధన రూపంలో బయటికి తీశాము. ఈ చిత్ర లిపి కోణంలో నేను సింధు లిపి గూర్చి అధ్యయనం చేశాను ఈ దేశంలో చిత్ర లిపి రూపంలో ఉన్న బొమ్మల లిపి ఒక సింధు లోయ నాగరికత లిపిలో కనిపిస్తుంది. మళ్ళీ ద్రావిడ సమాజ ప్రాచీన కులాల్లో కనిపిస్తుంది. మళ్ళీ గోదావరి లోయలో వేల్పు జాతరలా పడిగలలో ఇంకా స్పష్టంగా కనిపిస్తుంది. అంటే కచ్చితంగా భారతదేశం ఉప ఖండంపై గొప్ప నాగరికతగ పిలువబడి ప్రపంచంలోనే ఈ నాగరికత బయటికి వచ్చి 100 సంవత్సరాల అయిన, ఈ రోజు వరకు ఆ లిపినీ చదవలేని భాషను సృష్టించిన సింధు నాగరికత నిర్మాతలు కోయలు అని అపుడే అర్థం అయింది. అలా 2018లో ఈ జాతర పై పుస్తకం విడుదల చేసిన నేను మా మిత్రుడు ఆస్ట్రేలియా నేషనల్ యూనివర్సిటీ ఆంత్రొపాలజీ పరిశోధన విద్యార్థి డా ఏల్విన్ తో రెండవసారి పరిశోధన చేశాను. ఇంకా అనేక వివరాలు సేకరించాను. మొత్తంగా ఈ దేశ నిర్మాత ఈ దేశాన్ని పరిపాలించిన వారు కోయలు అని, సింధు నాగరికత కన్న ముందు నర్మదా నాగరికత ఏర్పాటు చేసింది కోయలు అని నిర్ధారిస్తూ సమ్మక్క సారలమ్మ ఆర్కియాలజీ ఇండియన్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ నీ ప్రారంభించి దేశవ్యాప్త పరిశోధనలు నడిపే వరకు వచ్చింది మా ప్రయాణం. అంటే నాడు చేసిన నా ప్రయాణం నా వేల్పులు నడిపిన ప్రయాణం అనేది నాకు అర్థం అయింది. దేశంలో అనేక ప్రాంతాల్లో కోయలు నిర్మించిన రాజ్య ఆనవాళ్లు చరిత్ర అన్నింటిపై పరిశోధనలు నడపటానికి ఈ జాతర ప్రయాణం ఒక ముఖ్య ఘట్టం. కోయగోండులు అనాగరికులు కాదు, ఈ దేశ నిర్మాతలు; ఈ దేశానికి వ్యవసాయ విధానం, రాజరికం పాలన, ఆర్కిటెక్చర్ ఇంకా అనేక మార్గాలను సూచించిన మొదటి పాలకులు అని నిర్ధారణ చేసేవరకు ఈ కలం ఈ పయనం ఆగదు.

*(ఫిబ్రవరి 19,20,21 తేదీలలో గోదావరి లోయలో మాఘ పున్నమి కోయల మహా జాతర సందర్భంగా)*

డా.మైపతి అరుణ్ కుమార్ ( MA. PhD)
9440102596

# లౌకిక రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్



ఎర్ర కృష్ణ జాంభవ్
9640411238

తన రాజ్యంలో ప్రజలు అందరు సమానంగా ఉండాలని, ఎవ్వరికి ఎలాంటి బేధాభిప్రాయాలు, తారతమ్యాలు ఉండరాదని మతసామరస్యాన్ని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పిన రాజు మన శివాజీ మహారాజ్. శివాజీ మహారాజ్ 1630 సంవత్సరం ఫిబ్రవరి 19వ వైశాఖ మాసపు శుక్లపక్ష తదియనాడు పూణే జిల్లాలోని జున్నార్ పట్టణం దగ్గర శివనేరి కోటలో షాహాజీ, జిజియాబాయి దంపతులకు జన్మించాడు. శివాజీ మహారాజ్ తల్లిదండ్రులు మహారాష్ట్రలోని వ్యవసాయం చేసుకునే భోస్లే కులానికి చెందినవారు. శివాజీ తల్లి జిజియాబాయి యాదవ క్షత్రియ వంశమునకు చెందిన ఆడపడుచు. (దేవగిరి మరాఠా యాదవ రాజుల వంశము). శివాజీకి ముందు పుట్టిన అందరూ మృతి చెందగా ఆమె పూజించే దేవత అయిన శివై పార్వతి పేరు శివాజీకు పెట్టింది.

ఛత్రపతి శివాజీగా ఖ్యాతి పొందిన శివాజీ రాజే భోంస్లే యుద్ధ తంత్రాలలో మాత్రమే కాకుండా పరిపాలనా విధానంలో కూడా భారతదేశ రాజులలో అగ్రగణ్యుడు. మంత్రిమండలి, విదేశాంగ విధానం, పటిష్ఠమయిన గూఢచారి వ్యవస్థ ఏర్పాటు చేసాడు. ప్రజలకోసమే ప్రభువు అన్న సూత్రం పాటించి, వ్యక్తిగత విలాసాలకు ఎటువంటి వ్యయం చేయక ప్రజల సంక్షేమం కోసమే పాటుపడ్డాడు మన శివాజీ .

శివాజీ తండ్రి అయిన షాహాజీ నిజాంషాహీల ప్రతినిధిగా ఉంటూ మొఘల్ రాజులను వ్యతిరేకిస్తూ యుద్ధాల్లో పాల్గొనేవాడు. నిజాంషాహీలపైన షాజహాన్ దండయాత్ర చేసినపుడు షాహాజి సైనికులను బలోపేతం చేయడంలో కీలక పాత్ర వహించాడు. తన ఆదేశాలను ధిక్కరించినందుకు లఖూజీ జాదవ్‌రావ్ అనే మరాఠా యోధుణ్ణి నిజాంషాహీ ప్రభువు హత్య చేయించాడు. ఇది నచ్చని షాహాజీ నిజాంషాహీ ప్రభువుపైన తిరుగుబాటు బావుటా ఎగురవేసి స్వతంత్ర మరాఠా సామ్రాజ్యానికి నాంది పలికాడు.షాహాజీ నిజాంలను ఓడించి గెలుచుకున్న ప్రాంతాల్లో సామ్రాజ్యాన్ని నెలకొల్పడానికి ప్రయత్నిస్తుండగా, మొఘలులు ఆదిల్షాతో కలసి షాహాజీని ఓడించారు. ఆదిల్షాతో సంధి ప్రకారం షాహాజి ప్రస్తుత బెంగుళూరు ప్రాంతాన్ని జాగీరుగా పొంది, పూణే వదిలి వెళ్లవలసి వచ్చింది. షాహాజీ పూణేలో తనకున్న జాగీరును వదులుకోవలసిన అవసరం లేకుండా ఒప్పందం కుదుర్చుకొన్నాడు. షాహాజీ పూణేలో తన జాగీరు వ్యవహారాలను తన భార్యకు అప్పగించి యువకుడయిన శివాజీకి రాజనీతి వ్యవహారాలు నేర్పడానికి కొందరు ముఖ్య అనుచరులతో ఒక విభాగాన్ని ఏర్పాటుచేసి తాను బెంగుళూరు జాగీరుకు వెళ్ళాడు. శివాజీ తల్లి అతనికి పుట్టిన భూమిపైన, ప్రజల పైన ప్రేమ కలుగునట్లు విద్యాబుద్ధులు నేర్పింది. చిన్నప్పటినుండి భారత రామాయణ బలి చక్రవర్తి గాథలు చెప్పి వీర లక్షణాలు మొలకింప చేసింది. పరమత సహనం, స్త్రీల పట్ల గౌరవం తన తల్లివద్దనే నేర్చుకున్నాడు. తన తండ్రి పొందిన పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనతి కాలంలో శివాజీ యుద్ధ తంత్రాలలో నిష్ణాతుడయ్యాడు. సకల విద్యలు తెలుసుకొన్న శివాజీ మరాఠా సామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా తన వ్యూహాలు మొదలు పెట్టాడు. తన 17 ఏళ్ళ వయసులో శివాజీ మొట్టమొదటి యుద్ధం చేసి బిజాపూర్ సామ్రాజ్యానికి చెందిన తోర్నా కోటను సొంతం చేసుకున్నాడు. మరో మూడేళ్ళలో కొండన, రాజ్‌ఘడ కోటలను సొంతం చేసుకొని పూణే ప్రాంతాన్నంతా తన స్వాధీనంలోకి తెచ్చుకున్నాడు.

శివాజీ భవానిదేవి భక్తుడు. శివాజీ తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా చూసేవాడు. కేవలం గుళ్ళు మాత్రమే కాకుండా ఎన్నో మసీదులు కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడొంతులు ముస్లింలు. ఎందరో ముస్లిములు ఉన్నత పదవులు నిర్వహించారు. హైదర్ ఆలీ ఆయుధాల విభాగానికి, ఇబ్రహీం ఖాన్ నావికాదళానికి, సిద్ది ఇబ్రహీం మందుగుండు విభాగానికి అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. శివాజీకి సర్వ సైన్యాధ్యక్షులు దౌలత్ ఖాన్, సిద్ధిక్ అనే ఇద్దరు ముస్లింలు, శివాజీ అంగ రక్షకులలో అతిముఖ్యుడూ, ఆగ్రా నుంచి శివాజీ తప్పించుకోటానికి సహాయపడిన వ్యక్తి మదానీ మెహ్తర్ కూడా ముస్లిమే.

శివాజీ తమ కోటలను సొంత చేసుకోవడం చూసి ఆదిల్షా మోసపూరితంగా శివాజీ తండ్రి అయిన షాహాజీని బందీ చేసాడు. తర్వాత శివాజీని, బెంగుళూరులో ఉన్న శివాజీ అన్న అయిన శంభాజీని పట్టుకోవడానికి రెండు సైన్యాలను పంపగా అన్నదమ్ములిరువురు ఆ సైన్యాలను ఓడించి తమ తండ్రిని బంధ విముక్తుడిని చేయించుకున్నారు. అప్పుడు ఆదిల్షా యుద్ధ భయంకరుడుగా పేరు పొందిన అఫ్జల్ ఖాన్‌ను శివాజీ పైకి యుద్ధానికి పంపించాడు.కోటకు చేరుకొనేలోపు శత్రువులు తమను సమీపించగలరు అన్న విషయం గ్రహించి బాజీ ప్రభు దేశ్‌పాండే అనే సర్దార్ 300మంది అనుచరులతో కలసి తాము శత్రుసైన్యాన్ని ఎదుర్కొంటామని, శివాజీని తన అంగరక్షకులతో ఎలాగయినా కోట చేరుకోమని చెప్పి ఒప్పించాడు. శివాజీ కోట వైపు వెళ్ళిన వెంటనే బాజీ ప్రభు దేశ్‌పాండే రెండు చేతులా ఖడ్గాలు పట్టుకొని శత్రువులతో యుద్ధం చేశాడు.300 మంది సైనికులు తమ ప్రాణాలకు తెగించి అతి బలమయిన శత్రువులతో పోరాడి నేలకొరిగారు. అప్పటికి శివాజీ తన కోట చేరుకున్నాడు. కోటలో తన అనుచరులతో చర్చించిన అనంతరం తాము సిద్ధి జోహార్ సైన్యాన్ని ఎదుర్కొనలేమని గ్రహించిన శివాజీ సంధికి అంగీకరించాడు. సంధిలో భాగంగా శివాజీ సామ్రాజ్యం స్వతంత్ర రాజ్యంగా గుర్తింపు పొందింది. సిద్ధి జోహార్ విజయానికి బహుమతిగా పన్‌హాలా కోట లభించింది. ఈ యుద్ధమే సుల్తానులతో శివాజీ చేసిన ఆఖరి యుద్ధం. ఆ తరువాతి కాలంలో మొఘల్ సైన్యంతో యుద్ధాలు చేయవలసి వచ్చిం ది.

ప్రతిరోజు తాను ఏరికోరి సమకూర్చిన పళ్ళను ఆగ్రాలోని సాధువులకు, గుడులకు, ఫకీర్లకు పంపించేలా అనుమతి తీసుకున్నాడు. కొన్ని నెలలపాటు పళ్ళ బుట్టలు పంపించిన తర్వాత తాను పనిమని



షిగా మారువేషం వేసుకొని కొడుకును బుట్టలో పెట్టుకొని తప్పించుకున్నాడు. శివాజీ, శంభాజీ ఇద్దరూ పళ్ళబుట్టల్లో దాక్కుని తప్పించుకొన్నారని ఒక వాదన.

తప్పించుకున్న తర్వాత శివాజీ రాయఘర్ చేరుకున్నాడు.ఆ తర్వాత రెండు సంవత్సరముల వరకు శివాజీ మోఘలులపై ఎటువంటి సైనిక చర్యకు దిగకుండా పురంధర్ సంధికి కట్టుబడి ఉన్నాడు. మువ్వాజం అనే దక్కన్ రాష్ట్ర పాలకుడి సలహా మేరకు ఔరంగజేబు, శివాజీ ని రాజుగా గుర్తించాడు.కొన్ని రోజులకు ఈ శాంతి ఒప్పందం పటాపంచాలైనది. మొఘలు సైన్యాధిపతులు మహాబత్ ఖాన్,బహాదూర్ ఖాన్, దిలేవార్ ఖాన్ లు మూకుమ్మడిగా శివాజీ పై దాడి చేశారు కానీ వారి ఎత్తులు పారలేదు.శివాజీతో యుద్ధంలో వారు ఘోర పరాజయం పొందారు.శివాజీ జీవిత చరిత్రలో ముఖ్యమైన విజయంగా దీన్ని పేర్కొనవచ్చు.అప్పటికే శివాజీ ప్రాబల్యం తగ్గడం వల్ల, మొఘలులు మరిన్ని యుద్ధాలలో పాల్గొంటూ ఉండడంవల్ల ఔరంగజేబు శివాజీనుండి ముప్పు ఉండదని భావించి పెద్దగా పట్టించుకోలేదు. శివాజీ ఎక్కువ ప్రాచుర్యంపొందేలా కాకుండా రహస్యంగా తన కార్యకలాపాలు నిర్వహించడం మొదలుపెట్టాడు. 1674 నాటికి లక్ష మంది సుశిక్షితులయిన సైన్యాన్ని, ఆయుధాలు, అశ్వాలు, నౌకా వ్యవస్థను సమకూర్చుకున్నాడు. 1670 జనవరి నుండి మొఘల్ కోటల పైన దాడులు చేసి సొంతం చేసుకోవడం మొదలు పెట్టాడు. అలుపెరగని యుద్ధాలతో అలసిపోవడం, సరి అయిన సైన్యం లేకపోవడం, ఖజానా ఖాళీ కావడంతో మొఘల్ సైన్యం శివాజీని ఎదుర్కొనలేకపోయింది.శివాజీ ఎన్నో కోటలను సులువుగా స్వాధీనం చేసుకున్నా, పూణే దగ్గర ఉన్న కొండన కోట స్వాధీనం కాలేదు. ఆకోటను ఉదయ్‌భాన్ రాథోడ్ అనే రాజపుత్రుడు పరిరక్షిస్తుండడమే కారణం. దుర్భేధ్యమయిన ఆ కోట చుట్టూ ఎప్పుడూ సైనికులు పహారా కాస్తుండడంతో శివాజీ తనదగ్గర అత్యంత గొప్ప సైనికాధికారిగా పేరు తెచ్చుకొన్ని తానాజీ మలుసారేకి ఆ కోట స్వాధీనం చేసుకునే బాధ్యత అప్పగించాడు. తానాజీ తన అనుచరులతో రహస్యంగా ఆ కోటను కొద్దిరోజులపాటు క్షుణ్ణంగా అధ్యయనం చేసాడు. అన్ని ప్రధాన ద్వారాల్లో కట్టుదిట్టమయిన సైన్యం ఉంది. చివరగా కోటకు ఒకవైపు ఉన్న ఒక కొండ తానాజీని ఆకర్షించింది. ఆ కొండ చాలా ఏటవాలుగా ఉండడంతో సైన్యం ఆ కొండ ఎక్కడం అసాధ్యం. అప్పుడు తానాజీ 'యశ్వంతి ' అనే పేరుకల ఉడుముకు తాడు కట్టి కొండ పైకి విసిరాడు. తాడు సహాయంతో పైకి వెళ్ళినవారు అందించిన తాళ్ళను పట్టుకొని సైన్యం కోటలోకి చేరుకొంది. చరిత్రలో యుద్ధంలో ఉడుమును ఉపయోగించడం ఇదే ప్రథమం అనుకోవచ్చు.అంతలో తానాజీ సోదరుడు సూర్యాజీ కోట

నేడు శివాజీ మహారాజ్ గారి చరిత్రను వక్రీకరించి శివాజీ మహారాజ్‌ను కేవలం హిందూరాజుగా మాత్రమే చిత్రీకరించే విధంగా పాలకులు ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఛత్రపతి శివాజీ మహారాజ్ లౌకిక పాలకుడు, శివాజీ అన్ని మతాలకు అనుకూలంగా ఉండి, ప్రజలందరినీ బాగా చూసుకునేవాడు. ముస్లింలకు వ్యతిరేకంగా అనేక తిరుగుబాట్లు చేసినప్పటికీ ఆయన పాలనలో ముస్లింలు తగిన విధంగా గౌరవించబడ్డారు. అనేక మసీదులు నిర్మించిన హిందూ పాలకుడు.

ముఖద్వారంపైన దాడి చేసాడు. మారాఠాలకు రాజపుత్రులకు జరిగిన భీకరపోరులో మరాఠాలు గెలిచినా తానాజీ మరణించాడు. ఈ వార్త విన్న శివాజీ 'కోటను గెలిచాము కానీ సింహాన్ని పోగొట్టుకొన్నాము ' అన్నాడు. సింహంవలె పోరాడిన తానాజీ గౌరవార్థం కొండన కోట పేరును సింహఘడ్‌గా మార్చాడు.శివాజీ పట్టాభిషేకము జూన్ 6, 1674న రాయఘడ్ కోటలో వేద పఠనాల మధ్య శివాజీని క్షత్రియరాజులందరికీ అధిపతిగా కీర్తిస్తూ 'ఛత్రపతి ' అని బిరుదును ప్రదానం చేసారు. కొన్నాళ్ళకు 50,000 బలగంతో దక్షిణ రాష్ట్రాల దండయాత్రచేసి వెల్లూరు, గింగీలను సొంతం చేసుకున్నాడు. 27 ఏళ్ళపాటు యుద్ధాలలో గడిపి హిందూ రాజులకు ఆదర్శంగా నిలిచి సువిశాల మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన ఛత్రపతి శివాజీ మూడు వారాలు తీవ్ర జ్వరంతో బాధపడి ఏప్రిల్ 3, 1680 న మధ్యాహ్నం 12 గడియలకు రాయఘడ్ కోటలో మరణించాడు.

శివాజీ మహారాజ్ సుదీర్ఘ యుద్ధ కాలంలో లెక్కలేనన్ని యుద్ధాలు చేసినా ఎన్నడూ పవిత్రస్థలాలను ధ్వంసం చేయలేదు. యుద్ధంలో ఓడిపోయిన శత్రువుల రాజ్యంలో ఉన్న యుద్ధం చేయలేనివారికి, స్త్రీలకు, పసివారికి సహాయం చేసాడు.ఒకసారి శివాజీ సైనికాధికారి ఒక చిన్న ముస్లిం రాజును ఓడించి అతడి అందమయిన కోడలును తీసుకొచ్చి శివాజీ ముందు ప్రవేశపెట్టాడు. శివాజీ ఆమెతో 'నా తల్లి కూడా మీ అంత అందమయినది అయిఉంటే నేను కూడా అందంగా ఉండేవాడిని' అంటూ ఆమెను తల్లిలా గౌరవించి కానుకలతో ఆమె రాజ్యానికి పంపించాడు. మరాఠా సామ్రాజ్యం ముగిసేవరకు శివాజీ ఏర్పాటు చేసిన సైనిక వ్యవస్థ నిలిచి ఉండేది.పటిష్ఠమయిన నౌకాదళాన్ని, ఆశ్వికదళాన్ని ఏర్పాటు చేసాడు. ఎనిమిది నెలలు పంటలు పండించే రైతులు కూడా నాలుగు నెలలు యుద్ధ నైపుణ్యాలను నేర్చుకోవడం శివాజీ విధానాలకు అద్దం పడుతుంది. కేవలం సైనికులే కాక సంఘంలోని అన్ని వర్గాలవారు కోటను పరిరక్షించేవారు. మరణించే నాటికి శత్రువులందరూ వెనుకాడే విధంగా లక్ష సైన్యాన్ని తయారు చేసిన సమర్థుడు శివాజీ మహారాజ్. మరణించేనాటికి 300 కోటలు శివాజీ ఆధీనంలో ఉండేవి. కొండలపైన ఉన్నత సాంకేతిక విలువలతో దుర్భేధ్యమయిన కోటలను నిర్మింపచేయడంలో శివాజీ ప్రపంచ ఖ్యాతి పొందాడు. నాసిక్ నుండి మద్రాసు దగ్గర ఉన్న జింగీ వరకు 1200 కిలోమీటర్ల మధ్య ఈ 300 కోటలు నిర్మించబడ్డాయి. శివాజీ భవానిదేవి భక్తుడు. శివాజీ తన సామ్రాజ్యంలోని అన్ని మతాలను సమానంగా చూసేవాడు. కేవలం గుళ్ళు మాత్రమే కాకుండా ఎన్నో మసీదులు కట్టించాడు. శివాజీ సైన్యంలో మూడొంతులు ముస్లింలు. ఎందరో ముస్లిములు ఉన్నత పదవులు నిర్వహించారు. హైదర్ ఆలీ ఆయుధాల విభాగానికి, ఇబ్రహీం ఖాన్ నావికాదళానికి, సిద్ది ఇబ్రహీం మందుగుండు విభాగానికి అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. శివాజీకి సర్వ సైన్యాధ్యక్షులు దౌలత్ ఖాన్, సిద్ధిక్ అనే ఇద్దరు ముస్లింలు, శివాజీ అంగ రక్షకులలో అతిముఖ్యుడూ, ఆగ్రా నుంచి శివాజీ తప్పించుకోటానికి సహాయపడిన వ్యక్తి మదానీ మెహ్తర్ కూడా ముస్లిమే. తెలుగు సంవత్సరం,1674,జూన్ 6 న హిందూ నెల జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి నాడు ఛత్రపతి శివాజీ పట్టాభిషేక వార్షికోత్సవం జరిగిన సందర్భంగా నేడు దేశం హిందూ సామ్రాజ్య దివస్ జరుపుకుంటారు.

నేడు శివాజీ మహారాజ్ గారి చరిత్రను వక్రీకరించి శివాజీ మహారాజ్‌ను కేవలం హిందూరాజుగా మాత్రమే చిత్రీకరించే విధంగా పాలకులు ప్రయత్నం చేస్తున్నారు. కానీ ఛత్రపతి శివాజీ మహారాజ్ లౌకిక పాలకుడు, శివాజీ అన్ని మతాలకు అనుకూలంగా ఉండి, ప్రజలందరినీ బాగా చూసుకునేవాడు. ముస్లింలకు వ్యతిరేకంగా అనేక తిరుగుబాట్లు చేసినప్పటికీ ఆయన పాలనలో ముస్లింలు తగిన విధంగా గౌరవించబడ్డారు. అనేక మసీదులు నిర్మించిన హిందూ పాలకుడు, అప్పటికి దేశంలో మనువాదం అమలులో లేదు అయినా కూడా శివాజీ మహారాజ్ నిస్వార్థంగా ప్రజలకు సేవచేయడం, తాను చేస్తున్న పనిపట్ల అంకితభావం, మచ్చలేని వ్యక్తిత్వం ఆయన అనుచరులకు, ప్రజలకు ఆదర్శంగా నిలిచాయి. భారతదేశాన్ని ఎందరో రాజులు ఏలినప్పటికీ ఈ లక్షణాలే శివాజీని గొప్పరాజుగా చేసాయి.

ఛత్రపతి శివాజి మహారాజ్‌ను నేటి పాలకులు, నాయకులు, యువత ఆదర్శంగా తీసుకొని దేశంలో ఉన్న ప్రజలకు సమాన అవకాశాలు కల్పించి, సమాజంలో అందరూ సమానమే అనే భావనతో ఉండాలి, శివాజి మహారాజ్ ఆశయాలను, ఆలోచనలను పాటిస్తూ, కుల, మత,లింగ, ప్రాంతీయ బేధాలు లేకుండా ఉండే విధంగా కృషి చేసినప్పుడే శివాజీ మహారాజ్‌కు ఘననివాళి అర్పించినవారమౌతం.

# ఆర్టీసికి షాకిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు



ఎస్.బాబు, అధ్యక్షుడు
టిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్

భారతదేశం లో డీజిల్, పెట్రో ల్ వాహనాలకు బదులుగా కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ వాహనాలను తయారుచేసే సంస్థలకు సబ్సిడీ ఇస్తూ FameI (Fas ter Adoption Manufacturing of Hybrid and Electr ic Vechicles) పథకాన్ని 2015 లో ప్రవేశపెట్టింది. ఈ పథకం 2019 వరకు కొనసాగింది. ఈ పథకం ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలను తయారు చేసే మాన్యుఫాక్చరింగ్ యూనిట్స్‌కు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చింది. ఈ పథకంలో ఎక్కువగా ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు వాహనాలు తయారు అయ్యాయి. తదుపరి Fame II పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 2019లో 10వేల కోట్ల రూపాయల బడ్జెట్ ప్రొవిజన్ పెడుతూ 50 వేల ఎలక్ట్రిక్ బస్సులను పబ్లిక్ ట్రాన్స్‌పోర్టులకు అందజేయాలనే ఉద్దేశంతో ప్రణాళికలు తయారు చేసింది. మార్చి 2024 వరకు కొనసాగిన ఈ స్కీమ్‌లో తయారైన ఎలక్ట్రిక్ బస్సులు వాయు మరియు శబ్ద కాలుష్యంలేని వాహనాలు. వీటి ఛార్జింగ్ కోసం 2700 ఛార్జింగ్ స్టేషన్స్ ఏర్పా టు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఒకసారి ఛార్జింగ్ అయిన ఎలక్ట్రిక్ బస్సు సుమారు 300కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఈ సబ్సిడీ పథకం కింద 50కి పైగా కంపెనీలు ప్రభుత్వం నుండి ఆమోదం పొందాయి. ఒలెక్ట్రా టెక్నాలజీస్, టాటా మోటార్స్, టివిఎస్ మోటార్స్, జెబిఎం కంపెనీ, ఐషర్ ఆటో మొబైల్ కంపెనీ, అశోక్ లే ల్యాండ్ మొదలైనవి ఉన్నాయి. ఒక ఎలక్ట్రిక్ బస్సు ఖరీదు కోటి 50లక్షల నుండి 2కోట్ల వరకు ఉంటుంది. ఎలక్ట్రిక్ వాహనాల తయారీపై మాన్యుఫాక్చరింగ్ యూనిట్లకు కేంద్ర ప్రభుత్వం 20 శాతం సబ్సిడీ ఇస్తోంది. ఈ వాహనాలకు రిజిస్ట్రేషన్ మరియు రోడ్డు ట్యాక్స్‌ల నుండి ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. ఎలక్ట్రిక్ బస్సులు మన దేశంలో అత్యధికంగా సుమారు 400 వరకు ఢిల్లీలో ఉన్నాయి. 360 బస్సులు ముంబయ్‌లో ఉన్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా 3000 ఎలక్ట్రిక్ బస్సుల కోసం కొన్ని సంస్థలు రిజిస్టర్ చేసుకుని ఉన్నాయి. చైనాలో 5 లక్షల వరకు ఎలక్ట్రిక్ బస్సులు ఆపరేషన్‌లో ఉండటం గమనార్హం.

ఎలక్ట్రిక్ బస్సులు PM E Drive Scheme కింద Grass Cost Contract (GCC) పద్ధతిలో బస్సులు కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి లేఖలు కూడా వ్రాసింది. సుమారు 2,800 బస్సులు ఈ సంవత్సరంలో కేటాయించాలని, రాబోయే కాలంలో మరో 3,000 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయింపు కోసం ప్రతిపాదనలు పంపారని తెలుస్తోంది. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ జోన్ లోని ఆర్టీసి డిపోలలో 300 ఎలక్ట్రిక్ బస్సులు ఉన్నాయి. హైదరాబాద్ నగరమంతా 2,800 ఎలక్ట్రిక్ బస్సులు ఆపరేట్ చేయాలని ఆర్టీసి ప్లాన్ చేస్తోంది. కరీంనగర్, వరంగల్, నల్గొండ మొదలైన జిల్లాలకు ఇప్పటికే ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించడం జరిగింది. దేశవ్యాప్తంగా పూణె, ముంబయ్, డెహ్రాడూన్, గోవా, సూరత్, అహ్మదాబాద్, సిల్వెస్సా మరియు నాగ్‌పూర్‌లలో ఎలక్ట్రిక్ బస్సులు రయ్యి మంటూ దూసుకుపోతున్నాయి. ప్రయాణీకుల సౌకర్యం కోసం ప్రతి సీటుకు సిసి కెమెరా, ఎమర్జన్సీ బటన్, లిథియం అయాన్ బ్యాటరీతో నిర్మితమై ఉన్నాయి. తెలంగాణ ఆర్టీసి 1000 ఎలక్ట్రిక్ బస్సుల కోసం ఆర్డర్ పెట్టినట్లుగా తెలుస్తోంది. వీటిలో 500 ఎలక్ట్రిక్ బస్సులు హైదరాబాద్‌లో, మిగిలిన 500 బస్సులు జిల్లాలకు కేటాయిస్తారు. ఆర్టీసి ఈ బస్సులను మాన్యుఫాక్చరింగ్ యూనిట్స్ నుండి అద్దెకు తీసుకుంటాయి. బస్సు అద్దె కాల పరిమితి 12 సంవత్సరాలు. కాల పరిమితి పూర్తయిన పిదప ఎలక్ట్రిక్ బస్సులు మదర్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌కు చేరుకుంటాయి. ఇవి ఆర్టీసి సొంత బస్సులు కావు. ప్రభుత్వం కొత్త బస్సులు ఆర్టీసికి కొని ఇచ్చినట్లుగా జెండాలు ఊపి డాంబికాలు పోతోంది.

తెలంగాణలో అన్నిరకాల వాహనాలు సుమారు కోటి 60 లక్షలు. వాటిలో కోటి 13 లక్షలు ద్విచక్ర వాహనాలు. 20 లక్షలు మోటారు కార్లు. స్టేజి క్యారేజీలు 17,956. కాంట్రాక్ట్ క్యారేజీలు 9,244. మరియు స్కూలు బస్సులు 28,962 ఉన్నాయి. ఆర్టీసిలో ఉన్న 9,200 బస్సులలో 2,800 డీజిల్ అద్దె బస్సులు. అంటే 6,400 బస్సులు మాత్రమే ఆర్టీసికి సొంత వాహనాలుగా ఉన్నాయి. దేశం మొత్తంలో 1,89,70,000 ప్రైవేట్ బస్సులున్నాయి. వీటివల్ల జరగని కాలుష్యం కేవలం ఆర్టీసి బస్సుల వల్లే జరుగుతోందా? తెలంగాణలో ఉన్న వాహనాలలో ఆర్టీసి బస్సులు కేవలం 0.09 శాతం మాత్రమే. వీటి ద్వారా వచ్చే శబ్ద మరియు వాయు కాలుష్యం అతి తక్కువ. పరిసరాలు కాలుష్యం అవుతున్నాయని, ఆర్టీసి బస్సుల వల్ల శబ్ద మరియు వాయు కాలుష్యం పెరుగుతోందని ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టటం సమంజసం కాదు. హైదరాబాద్ జనాభా 1,10,00,000. వీరి ప్రయాణ నిమిత్తం 6,000 బస్సులు అవసరం అవుతాయి. కానీ కేవలం 2,800 బస్సులను మాత్రమే ఆర్టీసి నడుపుతోంది. బెంగుళూరు జనాభా 1,40,00,000. వారి అవసరాల కోసం కర్ణాటక ప్రభుత్వం 6,512 బస్సులు నడుపుతోంది. అలాగే చెన్నయ్ జనాభా కేవలం 68,00,000. ఆ ప్రయాణీకుల అవసరాల కోసం చెన్నయ్‌లో 3,442 బస్సులను ఆ ప్రభుత్వం నడిపిస్తోంది. అతి తక్కువ బస్సులు, అతి తక్కువ కాలుష్యం తెలంగాణ రాష్ట్రంలోనే ఉండటం గమనార్హం.

తెలంగాణ ఆర్టీసి ఎలక్ట్రిక్ బస్సులను అద్దెకు తీసుకోవటం వల్ల అద్దె బస్సుల శాతం పెరిగి ఆర్టీసి సొంత బస్సులు తగ్గిపోతాయి. సంస్థ యొక్క సిబ్బంది కూడా కుదించబడి ఆర్టీసి మనుగడ ప్రశ్నార్థకమవుతుంది. ఎలక్ట్రిక్ బస్సులకు కిలోమీటర్‌కు 58 రూపాయలు చెల్లించడం వల్ల కొన్ని రూట్లలో ఆర్టీసికి నష్టం వచ్చే అవకాశం కూడా ఉంది. ప్రస్తుతం ఉన్న అద్దె డీజిల్ బస్సులపై ఆర్టీసికి నష్టాలు వస్తూనే ఉన్నాయి. ఆర్టీసి బస్సులు తగ్గినప్పుడు ఎలక్ట్రిక్ వాహనాల మెయిన్‌టెనెన్స్ ఆర్టీసి డిపోలలోనే చేయడం వల్ల గ్యారేజీలు కూడా ప్రైవేట్ పరం అయ్యే అవకాశం ఉంది. చీమలు పెట్టిన పుట్టలలో పాములు దూరినట్లు ప్రైవేట్ అనకొండలు ఆర్టీసి ఆస్తులను కబ్జా చేస్తాయనడంలో సందేహం లేదు. బస్–స్టాఫ్ రేషియో తగ్గిపోవడం, రిక్రూట్‌మెంట్ లేకపోవడం వల్ల రాజ్యాంగపరంగా వచ్చే రిజర్వేషన్లు కూడా ఉద్యోగాలలో పోయి నిరుద్యోగ సమస్య పెరిగే అవకాశం ఉంది. అంటే కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పెంచేందుకే ప్రైవేట్ డీలర్లకు సబ్సిడీ ఇస్తోందా?

ప్రైవేట్ మాన్యుఫాక్చరర్‌కి ఇచ్చే సబ్సిడీ ఆర్టీసి సంస్థలకి ఇచ్చి ఎలక్ట్రిక్ బస్సులను కొనుక్కునే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహకరించాలని ఆర్టీసి కార్మిక వర్గం మరియు ట్రేడ్ యూనియన్లు అభిప్రాయపడుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు బడ్జెట్ ప్రొవిజన్ పెట్టాలి. ప్రభుత్వమే బస్సులు కొని ఆర్టీసికి అందివ్వాలి. అలా చేయటం వల్ల ఆర్టీసి సొంత నిర్వహణలో ఎలక్ట్రిక్ బస్సులు ఉంటాయి. అప్పుడు ఆస్తులు, సిబ్బంది ఇబ్బంది లేకుండా ఉంటాయి. ప్రస్తుతం ఉన్నటువంటి ఆర్టీసి డీజిల్ బస్సులను రెట్రో ఫిట్‌మెంట్ పాలసీపై ఎలక్ట్రిక్ వాహనాలుగా తయారు చేసే విధంగా మాన్యుఫాక్చరింగ్ యూనిట్స్‌కి ప్రభుత్వం ప్రతిపాదనలు పంపటాన్ని యూనియన్లు వ్యతిరేకిస్తున్నాయి. అసలే నష్టాల పాట పాడుతున్న ఆర్టీసికి ఈ డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చాలంటే ఒక బస్సుకు సుమారు 70,00,000 ఖర్చవుతుందని తెలుస్తోంది. నష్టాలలో ఉన్న ఆర్టీసికి ఈ డబ్బు సమకూర్చుకునే వనరులు లేవు. కాబట్టి బస్సు మార్పిడి విధానం ఆర్టీసికి ఫీజబుల్ కాదు. ఎలక్ట్రిక్ అద్దె వాహనాలతో డిపోలు నింపి ఆర్టీసి ప్రైవేటీకరణకు మార్గం సుగమం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లుగా కనిపిస్తోంది.

## బ్యాంకు సిబ్బందికి రక్షణ ఏది?

### ఉద్యోగులపై దాడులు గర్హనీయం: ఎఐబిఇఎ

**చెన్నై:** బ్యాంకు సిబ్బందికి పని ప్రదేశాల్లో రక్షణ కరువైందని అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య (ఎఐబీఈఏ) ఆగ్రహం వ్యక్తం చేసింది. బీహార్, నవాడాలో యూనియన్ బ్యాంకు మేనేజర్ అభయ్ కుమార్‌పై దాడిని తీవ్రంగా ఖండించింది. పనివేళల్లో సిబ్బందికి రక్షణ లేదని మరోమారు రుజువు అయిందని ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి సీహెచ్ వెంకటాచలం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిబ్బందిపై దాడి గర్హనీయమన్నారు. చాలా బ్యాంకుల్లో భద్రతా సిబ్బంది లేకపోవడం వల్ల దాడులకు ఆస్కారం ఉంటోందని పేర్కొన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి బ్యాంకు శాఖలో సాయుధ గార్డు ఉండాలని, కాల్పులు వంటివి జరిగినప్పుడు ప్రతిఘటించేందుకు సర్వాధికారులు భద్రతా సిబ్బందికి ఉండాలని డిమాండ్ చేశారు. డబ్బు, విలువైన వస్తువులకు రక్షణ కల్పిస్తే సరిపోదని... మానవ సంపదను పరిరక్షించుకోవాలని సూచించారు. ‘ఉద్యోగులపై దాడులు జరుగుతుంటే ఆర్బీఐ మౌనం వహిస్తోంది. డీఎఫ్ఎస్ కూడా పట్టించుకోవడంలేదు. ఏం చేయాలో యాజమాన్యాలకు తెలియడం లేదు. నిరుద్యోగం అత్యధికంగా ఉన్న మన దేశంలో బ్యాంకు శాఖల్లో సముచిత సిబ్బందిని నియమించడానికి ఉన్న సమస్య ఏమిటి? శాఖలో సాయుధ గార్డు వుంటే మేనేజర్‌పై దాడి జరిగేదే కాదు. యాజమాన్యాలు, ఆర్బీఐ, డీఎఫ్ఎస్ ఈ విషయాలపై దృష్టి పెట్టాలి. బ్యాంకు సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి విధుల్లో నిర్వర్తించే పరిస్థితి ఏర్పడింది’ అని వెంకటాచలం అసహనం వ్యక్తంచేశారు. సిబ్బందిపై దాడులకు, నియామక సమస్యలకు నిరసనగా మార్చి 24, 25 తేదీల్లో సమ్మెకు బ్యాంకు సంఘాల ఐక్యఫోరం ఇప్పటికే పిలుపునిచ్చింది కానీ దీనిని వాయిదా వేయాల్సి రావచ్చన్నారు. అన్ని యూనియన్లతో చర్చించిన తర్వాత తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని వెంకటాచలం వెల్లడించారు.

## కాంగ్రెస్‌కు పూర్వ వైభవమే లక్ష్యం

### మహారాష్ట్ర అధ్యక్షుడి బాధ్యతల్లోకి హర్షవర్ధన్ సప్కాల్

**ముంబై:** మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తేవడమే లక్ష్యమని హర్షవర్ధన్ సప్కాల్ అన్నారు. ఆయన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో పార్టీని బలపర్చడమే కాకుండా తిరిగి అధికారంలోకి తెస్తామని సంకల్పించారు. పార్టీ సమావేశంలో మాట్లాడుతూ సభ్యులు, నాయకుల నుంచి పూర్తి సహకారాన్ని కోరారు. కృషి లేకుండా విజయాన్ని అందుకోలేమని వక్కాణించారు. మహారాష్ట్రలో కోటి మందిని సభ్యులుగా చేర్చుకొనే ప్రక్రియను బీజేపీ చేపట్టడాన్ని దుయ్యబట్టారు. ‘అది అతిపెద్ద పార్టీ అయితే... శివసేన, ఎన్‌సీపీని ఎందుకు విడదీసింది... కాంగ్రెస్ నేతలను ఎందుకు చేర్చుకుంది?’ అని హర్షవర్ధన్ ప్రశ్నించారు. నిజాయతీ, నిబద్ధతగల నాయకులు, కార్యకర్తలు ఉంటేనే పార్టీ వర్ధిల్లగలుగుతుందని అన్నారు. తనకు పదవుల ఆపేక్ష లేదని... సీఎం లేక ఎంపీ లేదా ఎమ్మెల్యే కావాలన్న ఆశలేదన్నారు. కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు, కాంగ్రెస్ నేతను సీఎం కుర్చీలో కూర్చోబెట్టేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. తొలుత పార్టీ కిందిస్థాయి నేతలతో సమావేశాలు నిర్వహించి, భవిష్యత్ ప్రణాళికలు రూపొందిస్తానన్నారు. కలిసికట్టుగా ముందుకెళుదామంటూ పార్టీ శ్రేణులనుద్దేశించి హర్షవర్ధన్ అన్నారు.


## మహాకుంభ్ ‘మృత్యుకుంభ్’గా మారుతోంది..

### సిఎం మమతా బెనర్జీ

**కోల్‌కతా:** బంగ్లాదేశీ ఛాందసవాదులతో తనకు సంబంధాలున్నాయంటూ బిజె పి చేస్తున్న ఆరోపణలపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ విరుచుకుపడ్డారు. తనపై చేస్తున్న ఆరోపణలను రుజువు చేయాలని సవాలు విసిరారు. ఆ విధంగా చేస్తే తాను రాజీనామా చేయడానికి సిద్ధమేనని అసెంబ్లీలో మాట్లాడుతూ అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహాకుంభ మేళా నిర్వహణలోపాలపై కూడా అక్కడి బిజెపి ప్రభుత్వాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని మమత తప్పుపట్టారు. నిర్వహణా లోపాల వల్ల మహాకుంభ ‘మృత్యుకుంభ్’గా మారుతోందంటూ విమర్శించారు. ‘ఇది మృత్యుకుంభ్... నేను మహాకుంభ్‌ను గౌరవిస్తాను, గంగామాతను గౌరవిస్తాను. కానీ అక్కడ సరైన ప్లానింగ్ లేదు. ఎంతమంది కోలుకున్నారు? డబ్బున్న వాళ్లు, విఐపిలకు క్యాంపులు (టెంట్లు) దొరుకుతున్నాయి. పేదలకు ఎలాంటి ఏర్పాట్లు లేవు. మేళాలో తొక్కిసలాట జరగడం సహజమే అయినా అలా జరక్కుండా ఏర్పాట్లు చేయడం ముఖ్యం. అందుకు మీరు ఎలాంటి ప్లానింగ్ చేశారు’’ అంటూ కేంద్రం, యుపిలోని బిజెపి ప్రభుత్వాన్ని మమత నిలదీశారు. బంగ్లాదేశ్ ఛాందసవాదులతో తాను కుమ్మక్కవుతున్నట్టు ఆరోపిస్తున్న బిజెపి ఎమ్మెల్యేలపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఫిర్యాదు చేస్తానని మమతా బెనర్జీ తెలిపారు.

# ఆర్థికవ్యవస్థలో పూర్తి విఫలం

### ప్రజల జీవితాలు నాశనం చేస్తున్న మోదీ.. మల్లికార్జున ఖర్గే విమర్శ



**న్యూఢిల్లీ:** ఎలాంటి దూరదృష్టిలేని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ఆర్థికవ్యవస్థలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జునఖర్గే విమర్శించారు. విఫల ఆర్థిక విధానాల ద్వారా భారతదేశ ప్రజల జీవితాలను ఆయన నాశనం చేస్తున్నారని విమర్శించారు. దార్శనికతలేని మోదీ ప్రభుత్వం చుక్కాని లేని నావగా మారిందని విమర్శించారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ ఆర్థిక అభివృద్ధి గురించి పరిహాసాస్పదమైన ప్రకటనలు చేస్తున్నారని విమర్శించారు. ఎక్స్ వేదికగా ఈ మేరకు ఆయన మంగళవారంనాడు పోస్టింగ్ పెట్టారు. దేశ ఆర్థికవ్యవస్థ మంచి ఫలితాలను ఇస్తోందని నిర్మలాసీతారామన్ చెప్పడం చూస్తే, మోదీ ప్రభుత్వం కంటే హాస్యాస్పదమైనది మరేదీ లేదని తెలుస్తోందని విమర్శించారు.

2025 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకూ స్టాక్ మార్కెట్ నుండి రూ.45 లక్షలకోట్లు తుడిచిపెట్టుకుపోయాయనీ, నిఫ్టీలోని 50 సంస్థలు గత ఐదు సంవత్సరాలలో ఎన్నడూలేనివిధంగా ఈ త్రైమాసికంలో అత్యంత దారుణమైన లాభాలవృద్ధిని నమోదవు చేశాయని విమర్శించారు. విదేశీ మదుపరులు రూ.1.56 లక్షల కోట్ల మేరకు స్టాక్స్‌ను గత ఏడాది అక్టోబరు నుండి ఇప్పటివరకూ విక్రయించేశారనీ, వీటిల్లో ఈ ఏడాదిలో ఒక లక్ష కోట్లరూపాయల మేరకు స్టాకులు కూడా ఇందులో కలిసే ఉన్నాయని వివరించారు. దీనివల్ల భారత్‌లో చిన్న మధ్యతరహా మదుపరుల సంపద తుడిచిపెట్టుకుపోయిందని ఖర్గే విమర్శించారు. ‘‘రూపాయి విలువ రూ.87లుగా ఉంది, దీని అర్థం ఏమిటంటే వాణిజ్యలోటు ఆకాశాన్ని అంటిందని. దిగుమతులు కూడా గడచిన ఐదు సంవత్సరాలలో ఎన్నడూలేనివిధంగా 62.21 శాతం మేరకు గణనీయంగా పెరిగాయి. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న వాణిజ్య విధానం భారత దేశానికి వినాశకరంగా పరిణమించింది’’ అని ఖర్గే ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు. ‘‘గడచిన పది సంవత్సరాలలో యుపిఎ ప్రభుత్వ హయాంలో అంటే 2004 నుండీ 2014 వరకూ దేశ ఎగుమతులు 549.36 శాతం మేరకు వృద్ధి చెందాయి, అదేవిధంగా మోదీ పది సంవత్సరాల పాలనలో అంటే 2014 నుండీ 2024 ఏప్రిల్–నవంబరు కాలం వరకూ గమనిస్తే దేశ ఎగుమతులు 24.72 శాతం మేరకు మాత్రమే పెరిగాయి. అదే విధంగా గడచిన పది సంవత్సరాలకాలంలో కార్పొరేట్ పన్నును రూ.10 లక్షల కోట్ల మేరకు వదులుకున్నారు. వారు ఉద్యోగాలు సృష్టిస్తారన్న ఆశతో ఈ పన్నులను వదులుకున్నారు, కానీ కార్పొరేట్ పన్ను రాయితీలవల్ల దేశంలో ఎనిమిది, తొమ్మిది కంపెనీలు ప్రయోజనం పొందాయి, అదే సమయంలో ఉద్యోగాలను తగ్గించాయి’’ అని ఖర్గే విమర్శించారు. ప్రపంచ సుంకాల యుద్ధంలో భారత్ ప్రముఖస్థానంలో ఉందని విమర్శించారు. ‘‘మన తయారీ రంగం నిండా మునిగిపోయింది, మేక్ ఇన్ ఇండియా, ఉత్పత్తితో ముడిపడిన ప్రోత్సాహకాలు (పిఎల్ఐ పథకం) వంటి పథకాలు విఫలమయ్యాయి, యువతరంలో నెలకున్న నిరుద్యోగానికి ఇంతవరకూ పరిష్కారం లభించలేదు, ధరల పెరుగుదల సమస్యవల్ల పొదుపు కరిగిపోతోంది, వినియోగం తగ్గిపోయింది, మార్కెట్లు మందగమనంలో నడుస్తున్నాయి, నిర్మలాసీతారామన్ ప్రవేశపెట్టిన కొత్త సంవత్సరం బడ్జెట్‌వల్ల ప్రజలకు ఎంతమాత్రం ఉపశమనం లభించలేదు, గ్రామీణ వేతనాలలో వృద్ధి శూన్యస్థానంలోనే ఉంది, రూపాయి రోజు రోజుకూ విలువ క్షీణించిపోతున్నది, గడచిన పది సంవత్సరాలలో ఇప్పటివరకూ రూపాయి విలువ 43 శాతం మేరకు క్షీణించింది, దిగుమతుల బిల్లులు భారీగా పెరిగిపోయాయి, చమురు, సహజవాయులువల దిగుమతుల బిల్లులు గడచిన పది సంవత్సరాలుగా పెనుభారంగా మారాయి, ఎలాంటి దార్శనికత, దూరదృష్టిలేని, చుక్కానిలేని, విధానంలేని నరేంద్రమోదీ ప్రభుత్వహయాంలో ఆర్థిక వ్యవస్థ పూర్తిగా విఫలమైంది, భారతదేశ ప్రజల జీవితాలను ఆయన నాశనం చేస్తున్నారు’’ అని ఖర్గే విమర్శించారు. భారత ఇన్వెస్టర్లు భారీగా లాభాలు సంపాదించుకుంటున్నారనీ, భారత వాటాలను విదేశీ సంస్థల మదుపరులు (ఎఫ్ఐఐ) విక్రయించడమంటే లాభాలను ముందుగా బుకింగ్ చేసుకున్నట్లేనని, భారత మార్కెట్, భారత ఆర్థిక వ్యవస్థలో పెట్టిన పెట్టుబడులకు ఈనాడు మంచి లాభాలు తిరిగి లభిస్తున్నాయని నిర్మలాసీతారామన్ సోమవారం చేసిన ప్రకటనను ఖర్గే ఖండించారు.

# అందని ఊపిరి 500 కోట్ల మంది రోగుల కష్టం



### పేద దేశాల్లో పరిస్థితి దయనీయం
### ప్రాణవాయువు అవసరం ఆసియాఆఫ్రికాలో అధికం
### మెడికల్ ఆక్సిజన్ లభ్యతపై ‘లాన్సెట్’ నివేదిక

**న్యూఢిల్లీ:** ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులు అంటే దాదాపు 500 కోట్ల మందికి మెడికల్ ఆక్సిజన్ (ప్రాణ వాయువు) అందడంలేదు. దీర్ఘకాల రోగాలతో బాధపడేవారితో శస్త్రచికిత్స నేపథ్య పరిస్థితుల్లో రోగులకు మెడికల్ ఆక్సిజన్ అవసరం ఉంటుంది. కోవిడ్19 తరహా మహమ్మారుల వేళ దీనికి డిమాండ్ అధికమవుతుంది. మెడికల్ ఆక్సిజన్ కొరత ప్రభావం పేద దేశాల రోగుల పైనే అధికంగా ఉంటున్నట్లు లాన్సెస్ అధ్యయనం తేల్చింది. ప్రపంచవ్యాప్తంగా మెడికల్ ఆక్సిజన్ అవసరమైన రోగుల్లో 82 శాతం మంది పేదమధ్య ఆదాయ దేశాలు (ఎల్ఎంఐసీలు)లో ఉండగా, దక్షిణతూర్పు ఆసియాతో పాటు పసిఫిక్, సబ్ సహారన్ ఆఫ్రికాలో 70శాతం మంది ఉన్నట్లు తెలిపింది. పేదమధ్య ఆదాయ దేశాలకు మధ్య వ్యత్యాసం ఎక్కువగా ఉందని తెలిపింది. ఈ మేరకు ప్రపంచ జనాభాకు మెడికల్ ఆక్సిజన్ లభ్యతపై లాన్సెట్ గ్లోబల్ హెల్త్ కమిషన్ అధ్యయనం జరిపింది. పేద, మధ్యస్థాయి ఆదాయ దేశాల మధ్య అసమానతలు... సరఫరాలో తేడాలు... డిమాండ్‌లభ్యతతో పాటు ఖర్చుల్లో వ్యత్యాసాలు గుర్తించినట్లు నివేదిక తెలిపింది. శస్త్రచికిత్సలతో పాటు ఆస్తమా, ట్రామా రోగులకు, మాతృశిశు సంరక్షణకు మెడికల్ ఆక్సిజన్ అవశ్యం కాగా మెడికల్ ఆక్సిజన్ లభ్యతపై మెల్బోర్న్ యూనివర్సిటీతో సహా పరిశోధకుల అంతర్జాతీయ బృందం కొన్ని సిఫార్సులు చేసింది. ప్రాణవాయువు నల్లబజారీ పెరగడంతో సమస్య మరింత జఠిలమైంది. కోవిడ్19 రాక ముందు మెడికల్ ఆక్సిజన్ డిమాండ్ తీర్చేందుకు థర్డ్ పార్టీ విక్రేతలపైనే ఆసుపత్రులు ఎక్కువగా ఆధారపడ్డాయి. మహమ్మారి విజృంభణతో డిమాండ్ పెరిగి బ్లాక్‌మార్కెటింగ్ జరిగింది. పరిమితికి మించి నిల్వలు చేశారు. సామాజిక మాధ్యమాల వేదికగా మెడికల్ ఆక్సిజన్ కోసం వినతులు విపరీతంగా వచ్చాయి. కొన్ని అసాధారణ సందర్భాల్లో కోర్టులు జోక్యం చేసుకున్నాయి. ఆక్సిజన్ సరఫరా కోసం సంబంధిత సంస్థలకు, ప్రభుత్వానికి ఆదేశాలిచ్చాయి. ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండాలంటే సముచిత రీతిలో మెడికల్ ఆక్సిజన్ సరఫరా ఉండాలని అధ్యయనకర్తలు సూచించారు. ప్రభుత్వాలకు, పరిశ్రమలకు, అంతర్జాతీయ ఆరోగ్య సంస్థలకు, విద్యా సంస్థలకు, పౌర సమాజానికి కొన్ని సిఫార్సులు చేశారు. మెడికల్ ఆక్సిజన్‌ను అందుబాటులో ఉంచుకునేలా ఆరోగ్య వ్యవస్థలను బలోపేతం చేసుకోవాలని, ఇందు కోసం ఐక్య కృషి అవశ్యమని సూచించారు. అంతర్జాతీయ ప్రజారోగ్య సంరక్షణకు దోహదమయ్యే విధంగా మెడికల్ ఆక్సిజన్ వనరులు ఉండాలన్నారు. అయితే మెడికల్ ఆక్సిజన్‌తో వైద్యం వ్యయంతో కూడుకున్నదని గుర్తుచేశారు. 2030 నాటికి ఆరోగ్యపరంగా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా ప్రపంచం పురోగమించడంలో మెడికల్ ఆక్సిజన్ పాత్ర ప్రధానమన్నారు. తదుపరి మహమ్మారికి ప్రపంచ దేశాలు సంసిద్ధంగా ఉండటం కోసం సముచిత చర్యలు అవసరమని, మెడికల్ ఆక్సిజన్‌పై దృష్టి సారించకుంటే భవిష్యత్‌లో ఆరోగ్య సంరక్షణ లక్ష్యాల సాధనకు తక్షణ చర్యలు అత్యవసరమని అధ్యయనకర్తలు సూచించారు. మెడికల్ ఆక్సిజన్‌పై పెట్టుబడి ప్రపంచ ప్రజారోగ్య మెరుగుదలకు సరళమైన, సమర్థమైన మార్గాల్లో ఒకటి కాగలదని అధ్యయనం వెల్లడించింది. తద్వారా సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో పురోగతి సాధ్యమని పేర్కొంది. ఆరోగ్య సంరక్షణ సవాళ్లను పరిష్కరించడంతో పాటు సంబంధిత వ్యత్యాసాలను తగ్గించడానికి సమష్టిగా కృషి చేయడం అవసరమని నివేదిక నొక్కిచెప్పింది. మెడికల్ ఆక్సిజన్ ఉత్పత్తి, పంపిణీలో భారత్ పురోగతి సాధించినట్లు తెలిపింది.

## ఢిల్లీ సిఎం ప్రమాణానికి భారీ ఏర్పాట్లు

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘన విజయం సాధించింది బిజెపి ప్రభుత్వ ఏర్పాటుపై దృష్టి సారించింది. ఢిల్లీలో సుదీర్ఘకాలం తర్వాత అధికారంలోకి వస్తుండటంతో నూతన ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి భారీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి పెద్దఎత్తున సినీ తారలు, పారిశ్రామిక వేత్తలను ఆహ్వానించినట్లు తెలుస్తోంది. గురువారం సాయంత్రం 4.30 గంటలకు కొత్త సిఎం ప్రమాణ స్వీకారానికి ముహూర్తం ఖరారైనట్లు బిజెపి వర్గాలు వెల్లడించాయి. రామ్‌లీలా మైదాన్‌లో భారీ ఏర్పాట్లు చేస్తోంది. ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనుంది. దాదాపు 50 మంది సినీతారలు, ప్రముఖ పారిశ్రామికవేత్తలతో పాటు ఇతర దేశాల దౌత్యవేత్తలు, 20 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, బిజెపి అగ్రనేతలు ఈ కార్యక్రమానికి రానున్నట్లు తెలుస్తోంది. వీరితోపాటు ఢిల్లీకి చెందిన రైతులు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఆహ్వానించినట్లు సమాచారం. బాబా రాందేవ్, స్వామి చిదానంద, బాబా బాగేశ్వర్ ధీరేంద్ర శాస్త్రి వంటి ఆధ్యాత్మిక గురువులు అతిథులుగా హాజరుకానున్నట్లు బిజెపి వర్గాలు తెలిపాయి. ఎన్నికల ఫలితాలు వెలువడి 10 రోజులు అవుతున్నా నూతన సిఎం ఎవరనేది ఇంకా తెలియరాలేదు. మాజీ సిఎం సాహిబ్ సి ంగ్ వర్మ కుమారుడు పర్వేశ్ వర్మ పేరు సిఎం రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది. ఆయన తాజా ఎన్నికల్లో ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత కేజ్రీవాల్‌పై విజ యం సాధించారు. బుధవారం బిజెపి శాసనసభాపక్ష భేటీ జరగనుంది. అం దులో కొత్త సిఎంతో పాటు కేబినెట్ మంత్రులను ఎన్నుకోనున్నట్లు తెలుస్తోంది.

## రాజస్థాన్‌లో ‘ఉర్దూ’ వివాదం

**జైపూర్:** బీజేపీ పాలిత రాజస్థాన్‌లో ‘ఉర్దూ’ వివాదం తెరపైకొచ్చింది. అక్కడి ప్రభుత్వ పాఠశాలల్లో ఊర్దూకు బదులు సంస్కృతాన్ని మూడో భాషగా చేర్చాలంటూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. నకిలీ పట్టాలతో ఉద్యోగ భద్రత పొందారంటూ ఉర్దూ టీచర్లనుద్దేశించి ఓ మంత్రి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. థర్డ్ లాంగ్వేజ్‌గా ఊర్దూకు బదులు సంస్కృతం బోధించాలని, ఊర్దును ఆప్షనల్‌గా ఉంచాలని జైపూర్‌లోని మహాత్మాగాంధీ ప్రభుత్వ పాఠశాల (ఆర్ఏసీ బెటాలియన్)ను రాజస్థాన్ విద్యాశాఖ ఇటీవల ఆదేశించింది. ఆపై కొన్ని రోజులకు బికానీర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకూ ఇవే ఉత్తర్వులు జారీ అయ్యాయి. మరోవైపు ఉర్దూ టీచర్లపై మంత్రి జవహర్ సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలతో వివాదం మరింత ముదిరింది. కాంగ్రెస్ గత ప్రభుత్వం సంస్కృతం టీచర్లను తొలగించి వారి స్థానంలో ఉర్దూ అధ్యాపకులను నియమించినట్లు మంత్రి ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను రాజస్థాన్ ఉర్దూ టీచర్ల సమాఖ్య తీవ్రంగా ఖండించింది. నిర్లక్షపూరిత, నిరాధార వ్యాఖ్యలను మంత్రి చేయడం హేయమని దుయ్యబట్టింది. తప్పుడు ఆరోపణలు ఎలా చేస్తారని నిలదీసింది. తాజా వివాదంపై పాఠశాల విద్యా మంత్రి మదన్ దిలావర్ స్పందించలేదు. సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు డైరెక్టర్ ఆశీష్ మోదీ మాత్రం వివరణ ఇచ్చారు. అన్ని స్కూళ్లకు ఈ ఉత్తర్వులు ఇవ్వలేదు... బికానీర్, నపాసర్ ప్రభుత్వ పాఠశాలలో ఒకరు తప్ప ఉర్దూ విద్యార్థులు లేరు కాబట్టే దాని తొలగింపునకు ఉత్తర్వులు జారీ అయ్యాయని వివరించారు.

## సత్యేంద్ర జైన్ విచారణకు రాష్ట్రపతి అనుమతి

**న్యూఢిల్లీ:** ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సీనియర్ నాయకుడు, ఢిల్లీ మాజీమంత్రి సత్యేంద్ర జైన్ మనీలాండరింగ్ కేసులో సత్యేంద్ర జైన్ విచారణకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. భారత పౌర రక్షణ నియమావళిలోని సెక్షన్ 218 కింద 60 ఏళ్ల జైన్‌పై కేసు నమోదు చేయడానికి హోం మంత్రిత్వ శాఖ రాష్ట్రపతి అనుమతి కోరింది. ఈడి దర్యాప్తు, తగినంత సాక్ష్యాలు ఉండటంతో రాష్ట్రపతికి ఈ అభ్యర్థన చేసింది. కాగా... ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణపై జైన్ తదితరులపై సిబిఐ 2017 ఆగస్టులో ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. 2018 డిసెంబర్‌లో చార్జిషీటు దాఖలు చేసింది. రూ.1.47 కోట్ల అక్రమాస్తులు ఉన్నాయని సిబిఐ తన చార్జిషీటులో పేర్కొంది. మనీలాండరింగ్ కేసులో సుదీర్ఘ కాలం జైలులో ఉండటంతో సత్యేంద్ర జైన్‌కు సిటీ కోర్టు బెయిలు మంజూరు చేసింది. 2022 మేలో జైన్ అరెస్టు కాగా, 2023 మే 26, 2024 మార్చి 18 మధ్య 10 నెలలు మెడికల్ బెయిల్ మినహా తక్కిన కాలమంతా ఆయన జైలులోనే ఉన్నారు.

### సిఇసి, ఇసిల నియామకాలపై

# అర్జీని 19న విచారిస్తాం

### సుప్రీంకోర్టు వెల్లడి

**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్(సిఇసి), ఇతర ఎలక్షన్ కమినర్ల ఎన్నికల ప్రక్రియపై దాఖలైన అర్జీని 2023 చట్టం కింద ప్రాధాన్యత అంశంగా 19వ తేదీన విచారించనున్నట్టు సుప్రీంకోర్టు మంగళవారం వెల్లడించింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు అడ్వకేట్ ప్రశాంత్ భూషణ్‌కు తెలిపింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లను నియమించే ప్యానెల్‌నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందంటూ ఒక ఎన్జీఓ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. వాస్తవంగా తమ అభ్యర్థనను 19వ తేదీన నంబర్ 41గా లిస్ట్ చేశారని, అయితే ప్రాధాన్యతా అంశంగా ముందుగా విచారించేందుకు ధర్మాసనం అంగీకరించిందని ప్రశాంత్ భూషణ్ వెల్లడించారు. కాగా పిటిషనర్ జయ ఠాకూర్ తరఫున అడ్వకేట్ వరుణ్ ఠాకూర్ ఫిబ్రవరి 17న ప్రధాన ఎన్నికల కమిషనర్, మరో ఎన్నికల కమిషనర్ నియామకం చట్ట విరుద్ధంగా ఉన్నాయని, దీనిని ప్రాధాన్యతా అంశంగా పరిశీలించాలని తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అభ్యర్థనపై విచారణకు సుప్రీంకోర్టు 19వ తేదీని ఖరారు చేసింది. కానీ ఈలోగా సెలెక్షన్ ప్యానెల్ సిఇసి, మరో కమిషనర్ నియామకాన్ని ఖరారు. చేసింది. ప్యానెల్‌నుంచి చీఫ్ జస్టిస్‌ను తప్పించి మరో మంత్రికి స్థానం కల్పించడాన్ని పిటిషనర్ సవాల్ చేశారు. ప్యానెల్‌లో ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా ఉంటారు. కానీ చీఫ్ జస్టిస్ స్థానంలో మంత్రిని ప్యానెల్‌లో చేర్చడం ప్రభుత్వం తనకు అనుకూలమైన వారిని ఎలక్షన్ కమిషనర్లుగా నియమించుకునేందుకేనని పిటిషనర్లు పేర్కొన్నారు. ప్యానెల్‌నుంచి చీఫ్ జస్టిస్‌ను తొలగించడాన్ని అసోషియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఎడిఆర్) అనే ఎన్‌జిఒ వ్యతిరేకిస్తూ ఎలక్షన్ కమిషన్‌ను రాజకీయ, కార్యనిర్వాహక వ్యవస్థలకు దూరంగా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే విధంగా చూడాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషనర్ల చట్టం 2023లోని సెక్షన్ 7లోని అంశాలను చాలెంజ్ చేస్తూ ఎడిఆర్ పిటిషన్ దాఖలు చేసింది. 2023 మార్చి 2నాటి సుప్రీంకోర్టు తీర్పుకూడా ఎలక్షన్ కమిషనర్ల నియామకంలో కార్యనిర్వాహక జోక్యం ప్రజాస్వామ్యానికి, నిష్పక్ష ఎన్నికల వాతావరణానికి హానికరమని పేర్కొన్నది.

# రాజీవ్ కుమార్ పదవీ విరమణ



**న్యూఢిల్లీ :** ఎలక్షన్ కమిషన్ ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ మంగళవారం పదవీ విరమణ చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలు, జమ్ము–కశ్మీర్ ఎన్నికలను నిర్విఘ్నంగా నిర్వహించిన రాజీవ్ కుమార్ 25వ ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా తన బాధ్యతలకు ముగింపు పలికారు. దాదాపు మూడేళ్లపాలు ఆ పదవిలో కొనసాగిన రాజీవ్ కుమార్‌పై ప్రతిపక్షాలు తరచూ విమర్శలు గుప్పించినా విజయవంతమైన ఎన్నికల అధికారిగా పేరు తెచ్చుకున్నారు. 2020, సెప్టెంబర్ 1న ఎలక్షన్ కమిషనర్‌గా నియమితులైన రాజీవ్ కుమార్, 2022 మే 15న ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ రెండు పదవులలో కమిషన్‌లో నాలుగున్నరేళ్లపాటు తన సేవలు అందించారు. రాజీవ్ కుమార్ తన పదవీ కాలంలో మొత్తంగా 31 సార్లు వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో, 2022లో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలు, 2024 లోక్‌సభ ఎన్నికలు, రాజ్యసభ ఎన్నికలు నిర్వహించారు. కానీ పలు అంశాలపై ఆయన ప్రతిపక్ష పార్టీలు, కార్యకర్తల విమర్శలను ఎదుర్కొన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల విశ్వసనీయత, ఓటర్ల డేటాను అందించడంలో తప్పుదారి పట్టించడం, అధికార బిజెపికి విశ్వాసపాత్రుడు అని పలు విమర్శలకు గురయ్యారు. పదవీ విరమణానంతరం పదవీ కాంక్షతోనే ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలకు సమాధానంగా రాజీవ్‌కుమార్ పదవీ విరమణ అనంతరం ఆరునెలలు హిమాలయాలకు వెళ్లి పునీతుడనై వస్తానని సమాధానం చెప్పేవారు. పదవీ విరణమ సమయంలో రాజీవ్ కుమార్ నిర్వచన్ సదన్‌ను ప్రజాస్వామ్య ఆలయంగా అభివర్ణించారు. 75 ఏళ్లుగా ప్రజాస్వామ్యాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నదన్నారు. ఎన్నికల సమయంలో వివిధ పార్టీలు ఎన్నికల సరళిపై వ్యక్తంచేసే సందేహాల వెనుక ఉన్న ఉద్దేశాలను అర్థం చేసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఉనికిని, ఎన్నికల సరళిని ఆక్షేపించేవిగా ఉంటాయన్నారు. ఎన్నికల సమయంలో ఉచితాలు, రాజకీయ పార్టీల మానిఫెస్టోలలో హామీల పైకూడా కమిషన్ దృష్టి సారిస్తుందన్నారు. ఈ అంశాలు కోర్టు పరిధిలో ఉన్నందున సకాలంలో సరైన నిర్ణయం వెలువడుతుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. 2021లో కొవిడ్ సమయంలో ఎన్నికల నిర్వహణకు రాజీవ్‌కుమార్ సిద్ధమైనపుడు బాధ్యత వహించేందుకు అఫిడవిట్ సమర్పించేందుకు సిద్ధమయ్యారు. తరువాత మద్రాస్ హైకోర్టు దానిన తేలికగా తీసుకుంది. ఎగ్జిట్ పోల్స్‌ను వ్యతిరేకించే రాజీవ్ కుమార్ ఒక్కోసారి అవి ప్రజల మనోభావాలకు వ్యతిరేకంగా ఉంటాయని, ఓట్ల లెక్కింపుకు ముందు వెలువడే ఎగ్జిట్ పోల్స్ విశ్వసనీయతను సమర్ధించుకునేలా అవి ఏ విధంగా లెక్కిస్తారు, వాటి ప్రామాణికత ఏమిటి, అందుకు బాధ్యత వహిస్తారా! అన్న విషయాలు కూడా తెలుపాలని కోరేవారు.

ఎలక్షన్ కమిషన్‌లో నియామకానికి ముందు రాజీవ్ కుమార్ 2020 ఏప్రిల్–ఆగస్టు మధ్య పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ బోర్డు చైర్మన్‌గా పనిచేశారు. అంతకుముందు 2019జులైనుంచి 2020 ఫిబ్రవరివరకు కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శిగా, 2017 సెప్టెంబర్‌నుంచి 2019 జులై వరకు ఫైనాన్షియల్ సర్వీసెస్ అధికారిగా, 2015 మార్చినుంచి 2017 జూన్‌వరకు ఎస్టాబ్లిష్‌మెంట్ అధికారిగా పనిచేశారు. బిహార్/జార్ఖండ్ క్యాడర్‌కు చెందిన 1984 బ్యాచ్ ఐఎఎస్ అధికారి అయిన రాజీవ్‌కుమార్ 2020 ఫిబ్రవరిలో రిటైర్ అయ్యారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా రాజీవ్ కుమార్ అస్సాంలోని పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనలో ప్రధానపాత్ర పోషించారు. వివిధ అంశాలలో సహచర కమిషనర్ల మధ్య పరస్పర చర్చలు, అభిప్రాయ వ్యక్తీకరణ ద్వారా ఏకాభిప్రాయం తేవడంలో రాజీవ్ కుమార్ కీలకంగా వ్యవహరించేవారు.



# మహాకుంభ మేళా

### 55 కోట్ల మంది పుణ్యస్నానాలు

**మహాకుంభ్ నగర్:** ప్రయాగ్‌రాజ్‌లో వైభవంగా కొనసాగుతోన్న కుంభమేళాకు ఊహించని రీతిలో భక్తులు తరలివెళ్తున్నారు. మంగళవారం సాయంత్రానికి 55 కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం ఓ ప్రకటనలో వెల్లడించింది. మానవ చరిత్రలో ఏ మతపరమైన, సాంస్కృతిక, సామాజిక కార్యక్రమంలో ఇంత భారీగా జనం పాల్గొనలేదని పేర్కొంది. దేశ విదేశాల నుంచి భారీగా సామాన్యులు, ప్రముఖులు తరలివచ్చి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. జనవరి 13న మొదలైన ఈ ఆధ్యాత్మిక సంబరం ఫిబ్రవరి 26వరకు కొనసాగనున్న విషయం తెలిసిందే. భారత్‌లోని 110 కోట్ల మంది సనాతనుల్లో దాదాపు సగం మంది పవిత్ర గంగానదిలో స్నానం ఆచరించారని తెలిపింది. ఫిబ్రవరి 26నాటికి ఈ సంఖ్య 60 కోట్లు దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తొలుత కుంభమేళాకు 45 కోట్ల మంది మాత్రమే వస్తారని అంచ నా వేయగా.. ఊహించని రీతిలో భక్తులు పోటెత్తుతుండటం గమనార్హం. ఫిబ్రవ రి 14 నాటికే 50 కోట్ల మార్కును అధిగమించి.. తాజాగా 55 కోట్ల మార్కును చేరుకుంది. జనవరి 29న మౌని అమావాస్య రోజే దాదాపు 8 కోట్ల మంది ప్ర యాగ్‌రాజ్‌కు రాగా.. మకర సంక్రాంతి రోజున 3.5 కోట్ల మంది, జనవరి 30న రెండు కోట్ల మందికి పైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించినట్లు ప్రభుత్వం పేర్కొంది. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు కుంభమేళాలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించారు. మహా కుంభమేళా అనేది ప్రపంచంలోనే అతిపెద్ద మత, ఆధ్యాత్మిక వేడుక అన్నారు. సనాతన సంప్రదాయం, వారసత్వానికి ఇదో గొప్ప ప్రతీకగా పేర్కొన్నారు. దేశం ఆరోగ్యంగా, సౌభాగ్యంగా ఉండాలని గంగామాతను ప్రార్థించినట్లు తెలిపారు.

# ముగింపు దశకు కుంభమేళా



**ప్రయాగ్‌రాజ్:** కుంభమేళా ముగిం పు దశకు చేరుకుంది. ఈ నెల 26న శివరాత్రితో ముగియనున్న ది. దీంతో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్ చేరుకుంటున్నారు. ఇప్పటికే 50కోట్ల మందికి పైగా భక్తులు త్రివేణీ సంగమంలో స్నానాలు ఆచరించారు. కుంభమేళా ముగింపునకు రైళ్లు, బస్సులు, ప్రత్యేక వాహనాల ద్వారా పెద్ద సంఖ్యలో జనం ప్రయాగ్‌రాజ్ చేరుకుంటున్నారు. అదే సమయంలో విమాన మార్గంలోనూ పెద్ద సంఖ్యలోనే భక్తులు తరలివస్తున్నారు. ఇప్పటికే ప్రయాగ్‌రాజ్ వెళ్లే విమానాల్లో టికెట్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. తాజాగా విమాన చార్జీలు మరింత పెరుగుతున్నాయి. విమానాల రాకపోకల సంఖ్య సైతం భారీగానే పెరిగింది. మహా కుంభమేళా సమయంలో ఢిల్లీ నుంచి రూ.13 వేలకు తక్కువ కాకుండా చార్జీ ఉండగా... కొన్ని తేదీల్లో రూ.20 వేలకుపైగా ధర పలికింది. రెండురోజులుగా ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయం నుంచి నడిచే విమానాల సంఖ్య వంద మార్క్‌ను దాటింది. చాలా నగరాల నుంచి నేరు గా విమాన సర్వీసులు నడుస్తున్నప్పటికీ చార్జీలు ఏమాత్రం తగ్గడం లేదు. చార్జీలు అధికంగా ఉన్నా... సీట్లు దొరకడం లేదు. మంగళవారం (ఫిబ్రవరి 18) రోజున ప్రయాగ్‌రాజ్ నుంచి బెంగళూరు ప్రయాణానికి ఓ ప్రైవేట్ ఎయిర్‌లైన్ కంపె నీ ఒక్కొక్కరికి రూ.39,146 వసూలు చేసింది. కుంభమేళా సమయంలో బెంగళూరుకు రూ.22 వేల వరకు వసూలు చేస్తుండేవారు. తాజాగా కంపెనీలు భారీగా పెంచేశాయి. ముంబై వెళ్లే విమానాల్లో టికెట్ల ధర ఇలాగే ఉంది. మంగళవారం ప్రయాగ్‌రాజ్ నుంచి ముంబైకి ఏడు విమానాలు నడుస్తుండగా... రూ.20 వేలకుపైగా వసూలు చేశా యి. సోమవారం కనీసం రూ.21,974 వసూలు చేశాయి. మహారాష్ట్రలోని పూణేకు సైతం విమాన చార్జీలు రూ.20 వేలకు తక్కువగా లేవు. హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు రూ.28 వేల నుంచి రూ.32 వేలు, ప్రయాగ్‌రాజ్ నుంచి హైదరాబాద్‌కు రూ.33 వేల వరకు ధర పలుకుతున్నది. కోల్‌కతా, భువనేశ్వర్ తదితర ప్రాంతాలకు నడిచే విమానాల్లోనూ టికెట్ల ధరలు ఇదే తరహాలో ఉన్నాయి. విమానయాన సంస్థలు ప్రయాణికుల నుంచి భారీగానే దండుకుంటున్నాయి. విశేషమేంటంటే.. స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా తదితర విమానయాన సంస్థలు ఫిబ్రవరి 28 వరకు విమానాలు నడిపేందుకు షెడ్యూల్ చేశాయి. ప్రస్తుతం ప్రయాగ్‌రాజ్ నుంచి జైపూర్, గువహతి, కోల్‌కతా, భువనేశ్వర్, ఢిల్లీ, డెహ్రాడూన్, రాయపూర్, బిలాస్‌పూర్, పూణే, ముంబై, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్, హైదరాబాద్, చండీగఢ్, లక్నోకు నేరుగా విమానాలు నడుస్తున్నాయి. అదే సమయంలో ప్రయాగ్‌రాజ్ నుంచి రాంచీకి డైరెక్ట్ విమానం నడిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నది.

### గృహహింస చట్టాల అమలుపై...

# ప్రభుత్వాలు విఫలం :‘సుప్రీం’

**న్యూఢిల్లీ :** గృహహింస చట్టాల అమలు జరుగుతున్న తీరుపై ఎప్పటికప్పుడు నివేదికలు అందించడంలో విఫలమవుతున్నాయని మంగళవారం నాడు సుప్రీంకోర్టు పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలపై తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. అయితే ఖర్చుల కింద రూ.5,000తో చెల్లించడానికి వారికి మరో 4వారాలు గడువు పొడిగిస్తున్నట్లు సర్వోన్నతన్యాయస్థానం తెలిపింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు ఉన్నప్పటికీ పలు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు వారి స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేయలేదని పిటిషనర్ తరపున న్యాయవాది చెప్పడంతో సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బివి.నాగరత్న, జస్టిస్ ప్రసన్న బి వరాలే దృష్టిసారించారు.‘స్టేటస్ రిపోర్టులను దాఖలు చేసేందుకు ఆయారాష్ట్రాల న్యాయవాది మరింత సమయం కోరిఉన్నారు. అందుకే సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వ కేంద్రానికి ఖర్చుల కింద రూ.5,000చెల్లించి స్టేటస్ రిపోర్ట్ దాఖలు చేసేందుకు మరో 4వారాల గడువు ఇవ్వడం జరిగింది’ అని ధర్మాసనం చెప్పింది. డిఫాల్టర్లలో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్‌ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, మేఘాలయ, ఒడిషా, తెలంగాణ, పశ్చిమబెంగాల్, అసోం రాష్ట్రాలు ఉన్నాయని ధర్మాసనం పేర్కొంది. ‘కేంద్రపాలిత ప్రాంతాలైన దాద్రానగర్‌నగర్ హవేలీ, డామన్‌డయ్యు, జమ్ము,కశ్మీర్, లడఖ్, లక్షద్వీప్ సేట్టస్ రిపోర్టులు చెల్లించని వాటిలో ఉన్నాయని మరింత సమాచారం ఇచ్చారు. చెల్లించాల్సిన ఖర్చు రూ.5,000చెల్లించి ఆ ఫైల్ దాఖలు చేయండి. లేదంటే రెట్టింపు అవుతుంది’ అని జస్టిస్ నాగరత్న చెప్పారు. అనంతర ం ధర్మాసనం ఈ కేసును మార్చి 25కు వాయిదా వేశారు. గృహహింస చట్టం2025 నుంచి మహిళల రక్షణ అమలుకు సంబంధించి స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని అత్యున్నత న్యాయస్థానం 2024 డిసెంబరు 2నాటి ఆదేశాలలో సుప్రీంకోర్టు పేర్కొంది. జనవరి 17న అత్యున్నత న్యాయస్థానం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ స్టేటస్ రిపోర్టు దాఖలు చేసేందుకు ఫిబ్రవరి 14కు గడువుకాలం పెంచింది. గత ఏడాది నవంబర్‌లో పిటిషన్ విచారణ సమయంలో సుప్రీంకోర్టు ధర్మాసనం మాట్లాడుతూ పిటిషన్‌కు సంబంధించి అభ్యర్థనలు 2005 చట్టం అమలును తప్పనిసరిగా చేయాలంది.నోటీసులు జారీచేసే సమయంలో అత్యున్నత న్యాయస్థానం మాట్లాడుతూ ఈ చట్టం అమలు కేవలం కేంద్ర ప్రభుత్వానికి సంబంధించింది మాత్రమే కాకుండా సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు కూడా విధిగా నిర్వర్తించాలని తెలిపింది.



## భక్తులు అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి

**ప్రజాపక్షం/చివ్వెంల:** శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరకు వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ అన్నారు. మంగళవారం జాతరలో భద్రత ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు దిశా నిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దొంగతనాలు, ప్రమాదాల జరగకుండా కట్టుదిట్టమైన ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. జాతరలోని కరెంట్ పోల్స్, వైర్లు ముట్టుకోవద్దని సూచించారు. ఎగ్జిబిషన్‌లో పిల్లలను పట్టుకొని తిరగాలన్నారు. భక్తుల అవసరాల దృష్ట్యా ఎక్కడిక్కడ బారికేడ్స్ ఏర్పాటు చేశామని, వాటిని దాటుకుంటూ, దూకుకుంటూ వెళ్లవద్దని, పోలీసులు సూచనలు పాటిస్తూ దైవదర్శనం చేసుకోవాలన్నారు. జాతర సరళి, వాహనాల రద్దీ, భక్తుల రాకపోకల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, డిఎస్‌పి రవి, సిఐ రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను పరిశీలించిన రాచకొండ సిపి



**ప్రజాపక్షం/బీబీనగర్ :** మండలంలోని పడమటి సోమవారం గ్రామంలో గల శ్రీ లింగ బసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22, 23, 24 తేదీల్లో జరిగే జాతర ఏర్పాట్లను రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు మంగళవారం ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గిరిజనులకు ఆరాధ్య దైవమైన శ్రీ లింగ బసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుండి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులను ఆదేశించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆలయ చైర్మన్ సందిగారి బసవయ్య, పోలీస్ కమిషనర్‌కు శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. డిసిపి రాజేష్ చంద్ర, ట్రాఫిక్ సిఐ మధుసూదన్, ఎస్సై రమేష్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి గోలి నరేందర్ రెడ్డి, మాజీ చైర్మన్ బసవయ్య, డైరెక్టర్లు ప్రదీప్ గౌడ్, కృష్ణారెడ్డి, రామ కొండలు పాల్గొన్నారు.

### పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/మోటకొండూరు :** రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు మోటకొండూరు పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు రికార్డులను పరిశీలించారు ఇసుక అక్రమ రవాణలను అరికట్టాలని ఆదేశాలు జారీ చేశారు.సైబర్ నేరాలు ,దొంగ తనాలు జరుగకుండా నిఘా ఏర్పాటు చేయాలని తెలిపారు. అనంతరం మోటకొండూరు మండల కేంద్రంలో నూతనంగా నిర్మాణం చేపట్టబోయే పోలీసు స్టేషన్ భవన నిర్మాణ సముదాయ స్థలం పరిశీలించారు.

## సమర్ధవంతంగా పథకాలు అమలు

జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్



**ప్రజాపక్షం/ జోగులాంబ గద్వాల ప్రతినిధి :** ప్రభుత్వ పథకాలను సమర్ధవంతంగా అమలు చేసేందుకు క్షేత్రస్థాయిలో పొందిన శిక్షణ అనుభవాన్ని సక్రమంగా ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ కేంద్ర సచివాలయ సేవల సెక్షన్ అధికారులకు సూచించారు.మంగళవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్సీఆర్ హెచ్‌డీ ఇనిస్టిట్యూట్ 139 వ స్థాయిడి శిక్షణా కార్యక్రమంలో భాగంగా కేంద్ర సచివాలయ సేవల సెక్షన్ ఆఫీసర్లు 16 గురికి శిక్షణా కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల క్రియాశీల అమలుతోనే ప్రజలకు నిజమైన లబ్ధి కల్గుతుందని పేర్కొన్నారు. శిక్షణలో భాగంగా మల్దకల్ మండలంలోని శేషంపల్లి గ్రామం,గద్వాల మండలంలోని కొత్తపల్లి,ధరూర్ మండలంలోని జాంపల్లి, కేటిదొడ్డి మండలంలోని మైలగడ్డ, గద్వాల మున్సిపాలిటీలోని పలు ప్రాంతాలను సందర్శించి పథకాల అమలు తీరును పరిశీలించారని,ఆయా పథకాల ప్రబావాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల అభిప్రాయాల ఆధారంగా అవగతం చేసుకున్నారన్నారు. ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి రమేష్ బాబు,కేంద్ర సచివాలయ సేవల సెక్షన్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

## నల్లగొండలో రౌడీ షీటర్ అరెస్టు




**ప్రజాపక్షం/నల్లగొండ:** గంజాయి మత్తులో వీరంగం సృష్టించి వర్గ వైషమ్యాలు రెచ్చగొట్టాలని చూసిన పేరు మోసిన రౌడీషీటర్ ను నల్లగొండ టూ టౌన్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించినట్లు డిఎస్‌పి శివరాం రెడ్డి తెలిపారు.గత కొన్ని సంవత్సరాలుగా నల్లగొండలో అనేక హత్య కేసులలో ఉన్న నలపరాజు రాజేష్ అలియాస్ మెంటల్ రాజేష్ రౌడియిజం పేరుతో అనేక సెటిల్మెంట్లు చేస్తూ అమాయకులను బెదిరిస్తూ హైదరాబాద్ కేంద్రంగా ఎప్పుడు వెంట పది,పదిహేను మందితో ఆగడాలు అరాచకాలు సృష్టిస్తున్నాడు.ఇతడు ఎవరినైనా టార్గెట్ చేస్తే గంజాయి మత్తులో ఫోన్లు చేసి బెదిరించడం వారి దగ్గరికి తన మనుషులని పంపించి చంపేస్తానని నల్లగొండలో నేను మించిన రౌడీషీటర్ లేరని మెంటల్ రాజేష్ అంటే అందరికీ దడ అని చెప్పుకుంటూ తిరుగుతున్నాడు అని తెలిపారు.ఈ క్రమంలో ఇతర మతానికి చెందిన ఒక వ్యక్తికి ఫోన్ చేసి అతనిని చంపేస్తానంటూ అతని వర్గాన్ని కించపరుస్తూ బెదిరించగా బాధితుడు ముందుకు వచ్చి టూ టౌన్ పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ చేయడం జరిగింది. అతనిపై దాదాపు 17 కేసులు ఐదు హత్య కేసులు, గంజాయి కేసులు పీడీ యాక్ట్ లో కూడా పోయినట్లు తెలుస్తుంది. అలాగే బాధితులు స్వచ్ఛందంగా ఇతని ఆగడాలకు గురైనట్లయితే ముందుకు వస్తే మరిన్ని విషయాలు వెలుగు లోకి వచ్చేది ఉందని తెలిపారు.

## ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని లే అవుట్‌ల కింద వచ్చిన పది శాతం స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు మున్సిపల్ కమీషనర్ ఎండి.యూసుఫ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వివిధ వార్డుల్లో ఇప్పటివరకు ఏర్పాటు చేసిన వెంచర్ల నుంచి పది శాతం భూములను గుర్తించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. పట్టణంలో 30 స్థలాలను పార్కుల కోసం నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. పట్టణంలో ప్రస్తుతం ఉన్న 13 ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకుల నీటి సరఫరా జరుగుతుందని, ఎక్కడైనా పైపులు దెబ్బ తిని ఉంటే మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని వాటర్ సప్లయ్ అధికారులను ఆదేశించామన్నారు.

# అంతా 'దుర్గంధం'

గట్టుపై ఎక్కడ చూసినా రక్తపు మరకలు
అదురుతున్న ముక్కుపుటాలు
మేకల, గొర్రెల తోళ్ళే,
కొబ్బరి చిప్పల రాసులే
ముక్కులు మూసుకొని లింగన్నను
దర్శించుకున్న భక్తులు
పట్టించుకోని అధికారులు





**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** ఐదు రోజుల పాటు ఘనంగా జరిగే శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతరకు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా చత్తీస్‌ఘడ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల నుండి భక్తులు లక్షలాది మందిగా తరలి వచ్చి గట్టుపై ఉన్న లింగన్నకు మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుంది. ఇంత అతి పెద్ద జాతరలో పారిశుధ్యాన్ని ఎప్పటికప్పుడు మెరుగుపర్చాలిన దేవాదాయ, మున్సిపల్ శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో పారిశుధ్యం పూర్తిగా పడకేసింది. గట్టుపైన గతంలో ఎన్నడు లేని విధంగా దుర్గందం వెదజల్లుతుంది. భక్తులు వేలాది మేకలు, గొర్రెలు, కోళ్ళను గట్టుపై ఉన్న చౌడమ్మ తల్లికి బలి ఇవ్వగా గట్టు మొత్తం రక్తంతో తడిసి ముద్దయ్యింది. మొక్కులు చెల్లించుకున్న భక్తులు వాటి తోళ్ళను అక్కడే తొలగించి, పొట్టలే ఉన్న కసరును తీసి గట్టుపైనే పడవేశారు. వీటిని తొలగించాల్సిన అధికారులు ఏలాంటి చర్యలు చేపట్టకపోవడంతో గట్టు ప్రాంగణం దుర్గందం వెదజల్లుతుంది. దీనికి తోడు భక్తులు కొట్టిన కొబ్బరికాయలు చిప్పలు ఆలయం ఎదుట రాసులుగా పోయడంతో అందులో నుండి కూడా దుర్వాసన వస్తుంది. దీంతో భక్తులు ముక్కులు మూసుకొని... ప్రాణం బిగపట్టుకొని స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆలయ ఆవరణలోని గట్టుపైన తినుబండాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అవి భక్తులు కొనుగోలు చేస్తున్నారు. దుర్గందంపై వాలిన ఈగలు, దోమలు ఈ తినిబండారలపై కూడా వాలుతున్నాయి. ఇవి తిన్నవారు అనారోగ్యాలభారీన పడే ప్రమాదం పొంచి ఉంది.

**శ్రీ లింగమంతులస్వామి ఆలయ ఆవరణ గట్టుపై అంతా దుర్గంధమే. గట్టుపై ఎటు చూసిన జంతుబలి రక్తపు మరకలు...., మేకలు,గొర్రెల తోళ్లు..., జంతువుల పొట్ట నుండి తీసిన కసరు, కొబ్బరి చిప్పల రాసులే దర్శనమిస్తున్నాయి. వీడినుండి దుర్గంధం వెదజల్లుతుండడంతో లింగన్న దర్శనానికి వచ్చిన భక్తులు ముక్కులు మూసుకొని స్వామివారికి మొక్కులు చెల్లించుకుంటున్న పరిస్థితి. ఈ దుర్గంధతో వ్యాధులు ప్రభలే ప్రమాదం పొంచి ఉన్నా దేవాదాయ, మున్సిపల్ శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

గట్టుపై మేకలు, గొర్రెలు, కోళ్ల బలి ఇవ్వడంతో ఏర్పడ్డ రక్తపు మరకలను తొలగించేందుకు గత ప్రభుత్వ హాయాంలో మున్సిపల్ శాఖ రూ. 20లక్షల వ్యయంతో జట్టింగ్ మిషన్‌ను కొనుగోలు చేసింది. గత జాతరలో ఈ మిషన్ ద్వారా రక్తపు మరకలన్నింటిని తొలగించడం జరిగింది. కానీ ఈ జాతరలో మాత్రం ఏలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు కంటికి కనబడలేదు. ఈ విషయమై మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తే పారిశుధ్య విషయంలో తమ సేవలు భేష్ అని జిల్లా కలెక్టర్‌నే మెచ్చుకోవడం జరిగిందని గొప్పలు చెప్తున్న పరిస్థితి. ఐదు రోజుల పాటు జరిగే జాతరలో 130 మంది పారిశుధ్య కార్మికులు నిరంతరం విడతల వారిగా పని చేస్తున్నారని చెబుతున్నరు. 48 బాక్స్ మొబైల్ టాయిలెట్స్ క్లినింగ్‌కు షిఫ్టుకు 16 మంది స్కావెంజర్లు, 7 పర్మినెంట్ టాయిలెట్స్ క్లినింగ్ 14 మందిని నియమించామని, గట్టుపైన రక్తపు మరకల తొలగింపుకు జట్టింగ్ మిషన్‌తో శుభ్రపరచినట్లు చెప్పడం గమనార్హం. కాగా అధికారులు చెప్తున్న దానికి అక్కడి పరిస్థి పూర్తి భిన్నంగా ఉంది.

## మంచినీటి ఎద్దడి లేకుండా చర్యలు

:జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి




**ప్రజాపక్షం/నల్లగొండ :** వేసవిలో మంచినీటి ఎద్దడి లేకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. మంగళవారం ఆమె నల్గొండ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నల్గొండ మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు, విద్యుత్ , పారిశుద్ధం, తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు, ఇతర అభివృద్ధి పనులు, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. వేసవికాలం ప్రారంభమైనందున ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని వార్డ్ అధికారులను ఆదేశించారు. అవసరమైతే వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని చెప్పారు. గత ఏడాది మంచినీటి డిమాండ్ ఆధారంగా ఈ సంవత్సరం సైతం తాగునీటిని సరఫరా చేయాలని సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంకులు, మంచినీటి ట్యాంకులన్నింటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా ఎప్పటికప్పుడు బ్లీచింగ్ పౌడర్ తో శుభ్రం చేయాలని తెలిపారు. నల్లగొండ మున్సిపల్ శివారు కాలనీలలో సైతం తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని వనమహోత్సవం కింద నాటిన మొక్కలు వేసవిలో ఎండల కారణంగా చనిపోయేందుకు ఆస్కారం ఉందని, అలా కాకుండా ఎప్పటికప్పుడు ట్యాంకర్ల ద్వారా చెట్లకు నీరు పోయాలన్నారు. మంచినీటి సరఫరా, విద్యుత్ సరఫరా పారిశుధ్యం తదితర విషయాలలో వార్డు అధికారులు అందుబాటులో ఉంటూ పర్యవేక్షించాలని చెప్పారు. ఎక్కడైనా విద్యుత్ సరఫరాకు సమస్య ఉన్నట్లయితే తక్షణమే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఇటీవల వీఆర్వోల నుండి వార్డ్ ఆఫీసర్లు గా నియమించిన సిబ్బంది వారి పని విధానాన్ని తెలుసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్,ఈ ఈ రాములు, ఆర్డబ్ల్యాఎస్, మిషన్ భగీరథ,విద్యుత్, మున్సిపల్ వార్డ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతు ఉసురు తగులుతుంది

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల ఉసురు తలగుతుందని, సిఎం రేవంత్ రెడ్డి రైతుల గోడును ఏ మాత్రం పట్టించుకోవడం లేదని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. సాగునీరు లేక రైతుల పంటపొలాలు ఎండుతున్నాయని తక్షణమే మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగంలో తేవాలని డిమాండ్ చేశారు. మంగళవారం శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు)కు విచ్చేసిన ఆమె దర్శన అనంతరం బిఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 199 టీఎంలతో బనకచర్ల ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని దీని అనుమతులకు అక్కడి సిఎం చంద్రబాబు నాయుడు ప్రయత్నం చేస్తున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి కనీసం నాగార్జునసాగర్‌ను కూడా మన ఆధీనంలోకి తీసుకరాలేకపోతున్నారని విమర్శించారు. సూర్యాపేట జిల్లాలోని కృష్ణ పరివాహక ప్రాంతాల్లోను కూడా నాటి సిఎం కెసిఆర్ గోదావరి నీళ్లను పారించారన్నారు. కోదాడ నియోజకవర్గానికి కాళేశ్వరం ద్వారా గతంలో లక్ష 22వేల ఎకరాలకు సాగునీరు అందించారని చెప్పారు. ఇప్పుడు నీళ్ల లేక పంటలు ఎండుతున్నా జిల్లాకు చెందిన నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. మరో 40రోజుల పాటు నీళ్ల అందించకుంటే చేతికి వచ్చిన పంటలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు. సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాలో గత పంట కాలంలో 4లక్షల ఎకరాలు ఎండిపోయాయన్నారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపి బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్, బొల్లం మల్లయ్య యాదవ్, కంచర్ల భూపాల్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గుజ్జ దీపికయుగేందర్ రావు ఉన్నారు.

## సేవాలాల్ మహరాజ్ ఆశయాలను సాధిస్తూ ఉన్నత స్థాయికి...

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు




**ప్రజాపక్షం/యాదాద్రి :** శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ జీవిత ఆశయాలను సాధిస్తూ ప్రతి ఒక్కరు ఉన్నత స్థాయికి ఎదగాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. మంగళవారం శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి సందర్భంగా భువనగిరి పట్టణంలోని రావిభద్ర రెడ్డి గార్డెన్స్ నందు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా సంత్ సేవాలాల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్, బంజారా ఉత్సవ కమిటీ ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశయాలను, వారి జీవిత చరిత్రను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని జీవితంలో భారత పౌరులుగా ఉన్నత స్థాయికి ఎదగాలని, ముఖ్యంగా ఆర్థికంగా ఎదగాలంటే ఎటువంటి చెడు వ్యసనాలకు గురికాకుండా మంచి మార్గంలో నడవాలని అన్నారు. సంత్ సేవాలాల్ బంజారా వారి కొరకే కాకుండా యావత్ జాతికి కూడా ఆయన మార్గదర్శం అన్నారు. ముఖ్యంగా పేద స్థితి నుండి ఉన్నత స్థాయికి ఎదగాలంటే తర తరాలు మార్చేది చదువు ఒక్కటే అని కలెక్టర్ హితవు పలికారు. జీవితంలో మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగి సమాజంలో ఒక మంచి పేరు తెచ్చుకొని, తల్లిదండ్రులకు ఒక మంచి పేరు తెచ్చే విధంగా విద్యార్థులు చదవాలని, జీవితంలో ముఖ్యంగా పదవ తరగతి అనేది చాలా కీలకమైనదని దానికి అనుగుణంగా జిల్లాలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి పదవ తరగతి చదివే విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి శోభ రాణి, టిజిఓ కోశాధికారి ఉపేందర్ రెడ్డి, ఎంఆర్ఓ, ఎంపిడిఓ, బంజారా ఉత్సవ కమిటీ, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నడని ..

భర్తను హతమార్చిన కేసులో భార్య,ప్రియుడు, సహకరించిన ప్రియుడి స్నేహితులకు జీవిత ఖైదు

**ప్రజాపక్షం/నల్లగొండ:** అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను ప్రియుడితో కలిసి హత్య చేసిన కేసులో నిందితులకు జీవిత ఖైదు, రూ.5వేలు,ప్రతి సెక్షన్ కి మొత్తం 75వేలు జరిమానా చెల్లించడంలో విఫలమైతే మరో 6 నెలల పాటు కఠిన జైలు శిక్షను అదనపు ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డి తీర్పు ఇచ్చినట్లు జిల్లా ఎస్‌పిశరత్ చంద్ర పవార్ తెలిపారు.వివరాలలోకి వెళితే గత 2019 జూలై 1 అర్ధరాత్రి పథకం ప్రకారం నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంద వారిగూడెం రోడ్డు సమీపం లో సోమ కేశవులు భార్య స్వాతితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఇదే క్రమంలో స్వాతి, దుబ్బ ప్రదీప్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకొని, అక్రమ సంబంధానికి భర్త కేశవులు అడ్డు వస్తున్నాడని ప్రియుడు దుబ్బ ప్రదీప్, అతని స్నేహితులైన కొడిదేటి శివకుమార్, కుంభం ప్రసాద్, చింతపల్లి నగేష్ లతో కలిసి ఎలాగైనా భర్తను హతమార్చాలని పథకం ప్రకారం భర్త సోమ కేశవులను సుత్తితో చాతి పైన కొట్టి, ఆధారాలు రూపుమాపాలని ఉద్దేశంతో మరియు నేరపూరితంగా అంతమొందించారు. మృతుని తండ్రి సోమ నాగులు ఇచ్చిన పిర్యాదు మేరకు నిందితులపై నల్గొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో సెక్షన్ 302,201,120(బి) అర్34 ఐపిసి ప్రకారం కేసు నమోదు చేసి, దర్యాప్తు అనంతరం సరి అయిన ఆధారాలు కోర్టుకి సమర్పించగా మంగళవారం విచారణ అనంతరం నిందితులకు జీవిత ఖైదు,జరిమానా విధించి మహిళను నిందితులను జిల్లా జైల్ నల్గొండకు తరలించనైనదని తెలిపారు. ఈ కేసులో సరి అయిన ఆధారాలు సేకరించి కోర్టుకి అందజేసి నిందితుని శిక్ష పడే విధంగా చేసిన అప్పటి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ నిగిడాల సురేష్, నల్లగొండ వన్ టౌన్ ఇన్స్పెక్టర్, ప్రస్తుత నల్గొండ డీఎస్పీ కె శివరాం రెడ్డి, ప్రస్తుత నల్గొండ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఏమిరెడ్డి రాజశేఖర్ రెడ్డి మరియు ప్రాస్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి జవహర్ లాల్, సిడిఓఎస్ వి శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్, బి వెంకటేశ్వర్లు పోలీస్ కానిస్టేబుల్ , లైసెనింగ్ ఆఫీసర్స్ హెడ్ కానిస్టేబుల్ పి.నరేందర్, పిసి ఎన్.మల్లికార్జున్ లను జిల్లా ఎస్‌పి అభినందించి రివార్డ్ అందచేస్తామన్నారు.

## పిఆర్‌ఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం : పల్లా




**ప్రజాపక్షం/దేవరకొండ:** విద్య పట్ల పిఆర్‌ఆర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయం అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం దేవరకొండ మండలం పడమటిపల్లి హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన లాస్ట్ మినిట్ రివిజన్ బుక్‌లను పంపిణి కార్యక్రమంలో ముఖ్య అతిధిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పిఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి నిపుణుల చేత ప్రత్యేకంగా రూపొందించి ఉచితంగా పంపిణి చేయడం చాలా సంతోషం అని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలని కోరారు. పిఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ చెల్లం పాండురంగారావు మాట్లాడుతూ పేద విద్యార్థులు చదువులో రాణించాలని లక్ష్యంతో విద్యార్థులకు పుస్తకాలు గత నాలుగు సంవత్సరాల నుండి పంపిణి చేస్తున్నామని తెలిపారు. అనంతరం పాఠశాలలో చదువుతున్న 53 మంది విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చీన్యనాయక్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు, మాజీ సర్పంచ్ యాదయ్య, పూర్వ విద్యార్థులు కైలాసం, గోవర్ధన్, జంగయ్య, ఉపాధ్యాయులు అంజయ్య, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహాశివరాత్రి సందర్భంగా నల్లగొండ జిల్లా, పానగల్ సమీపంలో ఉన్న ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 25 నుండి 27 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల విషయమై మంగళవారం ఆమె ఛాయా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించారు. బ్రహ్మోత్సవాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఈ నెల 26 న శివరాత్రి సందర్భంగా భక్తులకు ఇబ్బంది కలగకుండా తాగునీరు, అంబులెన్స్, భారికేడింగ్, వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని, నలుగురు డాక్టర్లను అంబులెన్స్ తో సహా సిద్ధంగా ఉంచాలని, తగినంత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా మహిళ కానిస్టేబుళ్లను ఎక్కువగా నియమించాలని, ప్రధాన రహదారి నుండి దేవాలయం వరకు పూర్తిస్థాయిలో లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు విరిగిపోయిన, వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేసి విద్యుత్తు వల్ల ప్రమాదం జరగకుండా ఆడిట్ నిర్వహించాలని చెప్పారు. కోనేటితోపాటు, దేవాలయానికి వచ్చే రహదారికి ఇరువైపులా భారీ కేడింగ్ చేయించాలన్నారు.అనంతరం పక్కనే ఉన్న తాగునీటి శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేసి పట్టణానికి సరఫరా చేస్తున్న తాగునీటి వివరాలు, నీటి శుద్ధి వివరాలను మిషన్ భగీరథ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వంశీకృష్ణ ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత డంపింగ్ యార్డ్ పక్కన ఉన్న జంతు జనన కేంద్రాన్ని సందర్శించి స్టేరిలైజేషన్ తదితర వివరాలను కనుక్కున్నారు.జిల్లా కలెక్టర్ వెంట ఆర్‌డిఓ వై. అశోక్ రెడ్డి, డిఎస్‌పి శివరామిరెడ్డి, సిఐ రాఘవేంద్రరావు, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఆహార భద్రత అధికారి స్వాతి, తహసిల్దార్ శ్రీనివాస్, ఛాయా సోమేశ్వర దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బాలకృష్ణ ,తదితరులు ఉన్నారు.

# సన్నాల 'బోనస్' కొందరికేనా..?

* అందరికీ ఎప్పుడు..?
* రైతుల్లో రోజురోజుకూ పెరుగుతున్న అసంతృప్తి
* మండలంలో సుమారు 1200 మంది రైతుల ఎదురుచూపులు
* మాకేం తెలవదు అంటున్న పలు శాఖల అధికారులు



ప్రజాపక్షం/కూసుమంచి:తెలంగాణ ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి రైతులు పండించిన 2024 ఖరీఫ్లో సన్న రకం ధాన్యానికి క్వింటాకు 500 రూపాయల బోనస్ ఇస్తానని ప్రకటించి కొందరు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది. ఇంకా కూసుమంచి మండలంలో సుమారు 1200 మంది రైతులు వరి ధాన్యం సన్న రకానికి బోనస్ డబ్బులకై ఎదురుచూస్తున్నారు. మండలంలో రైతులు పండించిన ధాన్యాన్ని మ నాలుగు సొసైటీల (చేగొమ్మ, జక్కేపల్లి, కల్లూరు గూడెం ముఠాపురం) వెలుగు డ్వాక్రా మహిళలు ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగింది. ఇప్పటికీ మండలంలోని మొత్తం రైతుల్లో పరిశీలించినప్పుడు రైతులు చెప్పే వివరాలు ప్రకారం కూసుమంచి మండలంలో 40 పర్సెంట్ రైతులకు మాత్రమే సన్న రకాలకు బోనస్ రైతుల ఖాతాల్లో జమ అయినాయని ఇంకా 60 రైతు ఖాతాలో బోనస్ జమ కాలేదని డిసెంబరు మొదటి వారం నుండి ఎదురుచూస్తున్నామని 2025 ఫిబ్రవరి ముగుస్తున్నప్పటికీ ఇంకా జమ కావటం లేదని రైతులు ఎదురుచూస్తూ తమ అసంతృప్తి అసహనాన్ని ప్రభుత్వం పట్ల వెలుబుచ్చుతున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకొని ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంలోని రైతులందరూ తన జిల్లా పరిధిలో బోనస్ డబ్బులు రైతుల ఖాతాల్లో తక్షణమే వచ్చే విధంగా చూడాలని మండలంలోని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ప్రభుత్వ అధికారుల వివరణ కూసుమంచి మండలంలో రైతులు పండించిన సన్నధాన్యానికి బోనస్పై అధికారులను ప్రజాపక్షం విలేకరి వివరణ కోరగా..

**మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్ వాణి వివరణ:** ఇప్పటివరకు మండలంలో సన్నధాన్యం రైతులకు బోనస్ కొంత పడింది. ఇంకా రావాల్సి ఉంది దీనికి సంబంధించిన వివరాలు చెప్పడానికి మా దగ్గర ఏమీ లేదు వస్తాయని ఎదురుచూస్తున్నాము. ఈ బోనస్కు మాశాఖకు ఎటువంటి సంబంధం లేకపోయినా రైతులు మా త్రం నిత్యం మా ఆఫీస్ కి వచ్చి తెలుసుకుంటూనే ఉన్నా రు అన్నారు. **సివిల్ సప్లై డి టి విజయబాబు వివరణ;**రైతులు పండించిన సన్నాలకు సంబంధించి బోనస్ డబ్బులు మాకు ఎటువంటి సంబంధం లేదు. అది వ్యవసాయ శాఖ అధికారులు చూసుకుంటారు మాకు ఏం తెలియదు ఇంకా నేను కూడా తెలుసుకుంటాను అని సమాధానం ఇచ్చారు. సొసైటీ సీఈఓ ల వివరణ కూసుమంచి మండలంలోని చేగొమ్మ, కల్లూరు గూడెం, ముఠాపురం, సిఇఒ లను వివరణ కోరగా సన్నరకం వరి బోనస్ డబ్బులు మాకు ఎటువంటి సమాచారం కానీ చెప్పడానికి చేయడానికి ఏమీ లేదు పై అధికారులను తెలుసుకోండి అని సెలవిచ్చారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా స్థాయి అధికారులు సన్నరకం ధాన్యం కు బోనస్ డబ్బులపై రైతులకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని కూసుమంచి మండలంలోని రైతులు ప్రభుత్వ అధికారులను ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ఉపాధి హామీ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



ప్రజాపక్షం/పాల్వంచ :ఉపాధి హామి పనులకు వచ్చిన ప్రతి ఒక్కరు రూ.300 వేతనం వచ్చే విధంగా కొలతల ప్రకారం పనిచేయాలని డిఆర్డిఓ అండ్ అదనపు కలెక్టర్ విద్యా చందన సూచించారు. మంగళవారం మండల పరిధి జగన్నాధపురం గ్రామ పంచాయితీ పరిధిలోని జరుగుతున్న రోడ్డు పనిని పరిశీలించి మస్టర్లను రోల్ కాల్ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ..ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ఉదయం త్వరగా వచ్చి పని చేసుకోవాలని, బోరు ఉన్న ప్రతి రైతు ఫారం పాండు ఉపాధి హామి పథకం ద్వారా నిర్మించుకోవాలని, పొలాలకు వెళ్లడానికి రైతులు అంగీకరించినట్లయితే కొత్త రోడ్డు నిర్మాణం చేయడం జరుగుతుందని సూచించారు. పని ప్రదేశంలో గ్రామ పంచాయితీ ద్వారా మంచినీరు ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడిఒ విజయభాస్కర్రెడ్డి, టెక్నికల్ అధికారి రాజు, ఎంపిఒ పోరండ్ల రంగా, టిఎ శ్రీను, కార్యదర్శులు సాయిరాం, రవికుమార్, క్షేత్ర సహాయకులు శంకర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## పలువురికి నివాళులర్పించిన మాజీ మంత్రి పువ్వాడ



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్కుమార్ మంగళవారం పర్యటించి పలువురికి నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన మాజీ కార్పొరేటర్ మచ్చా నరేందర్ సతీమణి శోభారాణికి మంత్రి పువ్వాడ అజయ్కుమార్ నివాళులర్పించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. బిఆర్ఎస్ నాయకుడు ఏడవ డివిజన్ చెందిన పొదిల పాపారావు సతీమణి పార్వతి గుండెపోటుతో మృతిచెందారు. ఆమె భౌతికాయాన్ని పువ్వాడ అజయ్కుమార్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. సిపిఐ నాయకులు పుచ్చకాయల కృష్ణ మనవడు గీతాన్ష్ బ్రెయిన్ ట్యూమర్ వ్యాధితో మృతిచెందాడు. వారి భౌతికాయాన్ని పువ్వాడ అజయ్కుమార్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కూరాకుల నాగభూషణం, సొసైటీ ఛైర్మన్ బీరెడ్డి నాగచంద్రారెడ్డి, కార్పొరేటర్లు నాగండ్ల కోటేశ్వరరావు, కూరాకుల వలరాజు, నాయకులు మోతారపు సుధాకర్, దేవభక్తిని కిషోర్, దొంగల తిరుపతిరావు, చిలకల వెంకటనర్సయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కంటి సమస్యలు లేకుండా చర్యలు



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : విద్యార్థులకు కంటి సమస్యలు లేకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి తెలిపారు. ఖమ్మంజిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన కంటి పరీక్షల ప్రత్యేక వైద్య శిబిరాన్ని డిఎం అండ్హెచ్ఓ కళావతి బాయి సందర్శించి కంటి పరీక్షల తీరును పరిశీలించారు. వైద్యులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఆర్బిఎస్కె టీములు ఆప్తాలమిక్ అధికారులు రెండు విడతలుగా అన్ని స్కూళ్లలోని విద్యార్థులకు స్క్రీనింగ్ నిర్వహించి 3,500 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వారికి కంటి వైద్యులచే స్క్రీనింగ్ జరిపి అవసరమైన వారికి కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నామని ఆపరేషన్ అవసరం అనుకుంటే వారిని హైదరాబాద్ పంపి తగిన చికిత్సలు అందించేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చందు నాయక్, డెమో సాంబశివ రెడ్డి, కంటి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఒబి మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేయాలి



ప్రజాపక్షం/ మధిర : మధిర ఆర్ఒబిపై జరుగుతున్న మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంఆర్పిఎస్ మధిర మండల అధ్యక్షులు మేకల రాజా కోరారు. మంగళవారం ఆర్ఒబిని నాయకులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఒబిపై పెద్ద పెద్ద గుంతల పడి చువ్వలు బయటకు రావడంతో గత కొన్ని రోజులుగా రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది గాయాలపాలవుతూ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. గత రాత్రి ఆర్ఒబిపై ఉన్న గుంత వలన జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న మహిళకు తీవ్రగాయాలై రెండు కాళ్లు విరిగిపోయాయని, అలాగే ప్రమాదకరంగా ఉన్న ఆర్ఒబిపై యువత ద్విచక్రవాహనాలను అతివేగంగా నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆర్ఒబిమరమ్మతు పనులను వేగవంతం చేసి పట్టణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్పిఎస్ అధికార ప్రతినిధి దోర్నాల ఆంజనేయులు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ప్రజాపక్షం/జూలూరుపాడు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన జూలూరుపాడులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. సోమవారం రాత్రి 11 గంటల సమయంలో జూలూరు పాడు మార్కెట్ యార్డ్ సమీపంలో ద్విచక్ర వాహనం పై ఈసం శేఖర్ బాబు అనే వ్యక్తి సత్యనారాయణ పురం నుండి ఖమ్మం వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

## వైరాలో అనుమతి లేని రక్త పరీక్ష కేంద్రాలు?

* టెస్ట్లు పేరుతో దోపిడీ
* వైద్యశాఖలో సహకరిస్తుంది ఎవరు?



ప్రజాపక్షం/వైరా:వైరాలో పుట్టగొడుగుల్లా రక్త పరీక్షా కేంద్రాలు రోజురోజుకు పుట్టుకొస్తున్నాయి. హాస్పిటల్కు సంబంధం లేకుండా కొంతమంది కొన్ని ప్రాంతాల్లో రక్త పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ రక్త పరీక్ష కేంద్రాలు వైద్యశాఖ అనుమతి తీసుకున్నారా? అనేదానిపై కూడా వైద్యశాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపడితే వాస్తవాలు బయటికి వస్తాయి. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమీపంలో ఓ మొలలు హాస్పిటల్ ఏర్పాటు చేశారు. ఆ మొలల హాస్పిటల్ నిర్వాహకుడు దాని సమీపంలోనే ఉన్న రక్త పరీక్ష కేంద్రాల నిర్వహకులు మధ్య కుదిరిన ఒప్పందంతో సరికొత్త దందాకు తెర లేపుతున్నారు. అనుమతి లేని మొలలు హాస్పిటల్ వైరాలో కొనసాగుతున్నాయి. ఈ మొలలు హాస్పిటల్ వద్దకు వచ్చిన సామాన్య ప్రజలను వైద్యంపేరుతో రకరకాల టెస్ట్లు చేయాలని చెప్పి వారికి టెస్ట్లు వ్రాసి సమీపంలో ఉన్న రక్త పరీక్ష కేంద్రానికి పంపిస్తున్నారు. ఈ టెస్ట్ల పేరుతో వేల రూపాయల డబ్బులను దండుకుంటున్నారు. జిల్లా వైద్యశాఖ అధికారులు ఇప్పటివరకు ఇటీవల కాలంలో అనుమతి లేని రక్త పరీక్ష కేంద్రాలపై తనిఖీలు నిర్వహించిన సందర్భాలు లేవు. ఆ రక్త పరీక్ష కేంద్రాలకు అర్హతలు ఉన్నాయా లేవా అనేది కూడా పట్టించుకున్న సందర్భం లేదు. హాస్పిటల్స్కు అనుసంధానం లేకుండానే పెద్ద ఎత్తున రక్త పరీక్ష కేంద్రాలు వైరాలో ఏర్పాటు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఎవరన్నా అధికారులు తనిఖీలు వస్తుంటే ముందుగానే వారికి సమాచారం ఇవ్వడం ఇక్కడ ఆనవాయితీ, దీంతో అధికారులు తనిఖీలకు వస్తున్నారని సమయంలో రక్త పరీక్ష కేంద్రాలు తెరవకుండా అలాగే ఉంచుతారు. జిల్లా వైద్యశాఖలో కొంతమంది అధజకారులు అనుమతి లేని రక్త పరీక్ష కేంద్రాల నిర్వహణకు తొత్తులుగా మారారని వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా వైద్య అధికారి జోక్యం చేసుకొని అనుమతి లేని రక్త పరీక్ష కేంద్రాలపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## అప్డేట్ పాస్ పుస్తకాలివ్వండి

ప్రజాపక్షం/ఇల్లెందు: సింగరేణి కాంట్రాక్టు కార్మికుల'సిఎంపిఎఫ్ను మార్చి 2024 వరకు అప్డేట్ చేసి పాస్ పుస్తకాలను ఇవ్వాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం 'సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్ ఎం. కనకమ్మకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి గుర్తింపు సంఘం బ్రాంచి కార్యదర్శి మహమ్మద్ నజీర్ అహ్మద్, సిపిఐ పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య మాట్లాడుతూ..స్థానిక ఇల్లెందు వైసిఒఎ క్లబ్లో జరిగిన బొగ్గుగనుల భవిష్యనిధి ట్రైపాటెట్ సమావేశంలో హాజరైన 'సిఎంపిఎఫ్ కమిషనర్ను కలిసి వినతి పత్రం ఇచ్చామన్నారు.'సిఎంపిఎఫ్ను ఆన్లైన్ చేయాలని, 'సిఎంపిఎఫ్లో కాంట్రాక్టు కార్మికులకు రుణ సదుపాయం కల్పించాలని తెలిపారు. సింగరేణి కాలరీస్ పరిధిలో ప్రతీనెల కాంట్రాక్టు కార్మికుల వేతనాల నుంచి 'సిఎంపిఎఫ్కు డబ్బులు కట్ అవుతున్నప్పటికీ ఎప్పటికప్పుడు వాటి వివరాలను కాంట్రాక్టు కార్మికులకు తెలియజేయడంలో'సిఎంపిఎఫ్ సంస్థ, సింగరేణి అధికారులు వైఫల్యం చెందుతున్నారని పేర్కొన్నారు. గత రెండేళ్లుగా 'సిఎంపిఎఫ్ వడ్డీ లెక్కలతో సహా ఎందుకు అప్డేట్ చేయడంలేదని ప్రశ్నించారు. తక్షణమే కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంట్ కార్మికుల మాదిరిగా లోన్ సౌకర్యం కల్పించాలని, దిగిపోయిన కాంట్రాక్టు కార్మికులకు పింఛన్ జాప్యం కాకుండా వచ్చేట్లు చూడాలని కోరారు. కార్యక్రమంలో బ్రాంచి ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, నాయకులు షేక్ వలీ, పండు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## పదో తరగతి ఫలితాలు భవిష్యత్ లక్ష్యాలకు మార్గదర్శకాలు

### కలెక్టర్ జితేష్ వి పాటిల్



ప్రజాపక్షం/భద్రాచలం : పదవ తరగతి ఫలితాలు విద్యార్థులు భవిష్యత్ లక్ష్యాలను సాధించడానికి మార్గదర్శకాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం పట్టణంలోని అంబేద్కర్ భవన్లో షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ప్రేరణ శిక్షణ తరగతులను విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యాతిధిగా హాజరైన ఆయన ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం మాట్లాడుతూ పదో తరగతి ఫలితాల్లో ఎన్ని మార్కులు వస్తాయని విద్యార్థులు ఆశించకుండా వారి భవిష్యత్ లక్ష్యాలను చేరుకునేందుకు కష్టపడి చదవాలన్నారు. కేవలం పదో తరగతిని మాత్రమే ప్రామాణికంగా తీసుకోరాదని, ఇది ఒక మెట్టుమాత్రమే అన్నారు. నిరంతరం కష్టపడుతూ ఉంటే లక్ష్యాలను చేరుకోవడం సులభం అవుతుందని, తాను కూడా విద్యార్థి దశలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొన్నట్లు చెప్పారు. ముందుగా ఇంజనీర్ అవుదామని అనుకున్నానని, ఆ తర్వాత లక్ష్యాన్ని మార్చుకుని ఐఎఎస్ సాధించినట్లు చెప్పారు. విద్యార్థులు భవిష్యత్పై మంచి గోల్ కలిగి ఉండాలని, ఆ లక్ష్యాన్ని సాధించేందుకు నిరంతరం తపిస్తూశ్రమిస్తూ ఉండాలన్నారు. ప్రభుత్వ బడుల్లో మంచి సౌకర్యాలు ఉన్నాయని,వసతి గృహాల్లో ప్రత్యేక స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. పరీక్షలురాసేందుకు కొన్ని రోజులు మాత్రమే సమయం ఉన్నందున ప్రతి నిమిషాన్ని వృధా చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. టీవి, ఫోన్, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులకు స్టడీ హవర్స్ నిర్వహించి నూరు శాతం ఫలితాలు జిల్లాలో వచ్చేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యాశాఖ రిసోర్స్ పర్సన్స్ సైదులు, నాగరాజు, శేఖర్, విజయభాస్కర్, శ్యాంచందర్లు విద్యార్థులకు వివిధ సబ్జెక్టుల్లో మెలుకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖాధికారి అనసూయ, ఏఎస్డబ్ల్యూఓలు హనుమంతరావు, సునీత, హెచ్డబ్ల్యూఓలు గజ్వేల్ శ్రీనివాస్, పద్మావతి, శశిరేఖ, కౌసల్యారామ, నరసయ్య, స్వప్న, కార్యాలయ సిబ్బంది నర్సింహారావు, పార్వతి, శశికళ, హేమంత్, సాయి పాల్గొన్నారు.

## ముస్లింలు శాంతి కాముకులు

### సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



ప్రజాపక్షం/సత్తుపల్లి:ముస్లింలంటే శాంతిని నెలకొల్పే వారని, ఉగ్రవాదులుగా చూడటం సబబు కాదన్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్. మంగళవారం పట్టణంలోని లక్ష్మి ప్రసన్న ఫంక్షన్ హాల్ లో ''ఇస్తేఖ్ బాల్ ఏ రంజాన్, రంజాన్ మాసానికి స్వాగతం'' అనే కార్యక్రమం పవిత్ర రంజాన్ రాక సందర్భంగా జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం సత్తుపల్లి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ హాజరైనారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం సత్తుపల్లి అధ్యక్షురాలు దౌలతున్నిసా బేగం మాట్లాడుతూ మంచి, మానవత్వాన్ని పెంచి, సమాజం లో శాంతి సామరస్యాన్ని పెంచే రంజాన్ మాసానికి స్వాగతమన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపవాసాల ద్వారా ఆకలి అంటే ఏమిటోఆచరణతో తెలుసుకుని పేదవారిని ఆదుకునే గుణం అలవడుతుందన్నారు. ముస్లింలను కొంతమంది ఉగ్రవాదుల్లా చిత్రీకరిస్తున్నారని, అది సబబు కాదని ముస్లింలంటేనే శాంతిని నెలకొల్పే వారన్నారు. ఈ కార్యక్రమంలో ఇస్రత్ భాను సాహెబా, జె ఐ హెచ్ రాష్ట్ర సెక్రటరీ, అస్మా అంజుమ్ సాహెబ్, జె ఐ హెచ్ ఖమ్మం జిల్లా అధ్యక్షురాలు, ఫౌజియ బేగం, రీనా ఇంకా మోతి సాహెబా, పర్వీన్ సాహెబా పాల్గొన్నారు.

## ఇల్లెందు రెవెన్యూ డివిజన్ అయ్యేనా.!




* సిఎం రేవంత్రెడ్డి హామీకి ఏడాది పూర్తి
* స్థానికసంస్థల ఎన్నికల్లో రాజకీయ నాయకులను నిలదీయనున్న ప్రజలు
* రెవెన్యూ డివిజన్, మండలాల ఏర్పాటుతో తగ్గనున్న దూరాభారం




ప్రజాపక్షం/ఇల్లెందు: ఇల్లెందు నియోజకవర్గం ప్రజల చిరకాల వాంఛ ఇల్లెందును రెవెన్యూడివిజన్, బోడు, కొమరారం మండలాలను ఏర్పాటు చేస్తారని నియోజకవర్గం ప్రజలు వేయి కళ్లతో ఆశగా ఎదురుచూస్తున్నారు. కొమరారం ఇల్లెందు మండలానికి సుమారు 20కి.మీ.దూరంలో ఉంటుంది. ఈ క్రమంలో కొమరారం ప్రజలు ఏ అవసరం వచ్చినా..ఇల్లెందు మండలానికి రావాల్సివస్తోంది. విద్యార్థులు, ప్రజలు ఎటువంటి ధృవీకరణపత్రాలు పొందాలన్నా..ఇల్లెందుకు రావాల్సిన నేపథ్యంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొమరారం పరిసర ప్రాంతాలు కలిపి సుమారు 30వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. గతంలో కొమరారంను మండలం చేయడానికి జిల్లా అధికారులు సైతం సందర్శించి మండల ఏర్పాటుకు అన్నివిధాలైన వసతులు ఉన్నాయని తమ నివేధిక అందించారు. ముఖ్యంగా గ్రామాల్లో ఉన్న రైతులు వారి భూరికార్డులను సరిచేసుకోవడానికి నిత్యం కొమరారం నుంచి ఇల్లెందు మండలానికి 20కి.మీ.దూరం ప్రయాణించాల్సివస్తుంది. కొమరారం మండలం ఏర్పాటు అయితే దూరం భారం తగ్గి సుమారు 25గ్రామాలకు కొమరారం మండలంగా ఉంటుందని ప్రజలు అంటున్నారు. బోడు, టేకులపల్లి దూరంలో ఉంటుందని, ఎప్పటి నుంచో వామపక్షాల నాయకులు బోడు మండలం ఏర్పాటుచేయాలని ఉద్యమాలు, వినతిపత్రాలను ఎమ్మెల్యేకు, మంత్రులకు అందిస్తున్నారు. వాస్తవంగా 23గ్రామాలతో బోడు మండలంగా ఏర్పాటైతే దూరభారం తగ్గి సర్టిఫికేట్స్, భూ సమస్యల కోసం టేకులపల్లి మండలానికి వెళ్లాల్సినవసరం ఉండదని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇల్లెందు మండలం, ఇల్లెందు పట్టణం, గుండాల, ఆళ్లపల్లి, కొమరారం, బోడు మండలాలను కలుపుకుని ఇల్లెందు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ ప్రముఖంగా వినిపిస్తోంది. ముఖ్యంగా భూ సమస్యల రికార్డులను సరిచేసుకోవాలంటే 40 నుంచి 50కి.మీ.లు దూరంలో ఉన్న కొత్తగూడెం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. ఇల్లెందు ముఖ్య కార్యాలయాలకు, ఇతరత్రా కార్యక్రమాలకు అనువైన ప్రాంతమని ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఇచ్చిన హామీని వెంటనే అమలుచేయాలని అఖిలపక్ష నాయకులు కోరుతున్నారు. ప్రభుత్వం నాన్చుడి ధోరణి అవలంభిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో గుణపాఠం చెప్పకతప్పదని పేర్కొంటున్నారు.




*** కల నెరవేరేనా.?**

కొన్ని సంవత్సరాలుగా ఇల్లెందును రెవెన్యూ డివిజన్ చేయాలని డిమాండ్ ఉన్నప్పటికీ సార్వత్రిక ఎన్నికల సమయంలో భాగంగా నవంబర్2023లో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, అప్పటి పీసీసీ అధ్యక్షుడు ఇల్లెందు జగదాంబసెంటర్లో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇల్లెందును రెవెన్యూ డివిజన్గా ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లో నూతన మండలాలు, రెవెన్యూ డివిజన్ ఏర్పాట్లలో ప్రజలతో నెలకొన్న అనుమానాలపై శాసనసభలో చర్చ జరిగింది. ఆలేరు, ఖానాపూర్, చెర్యాల, ఇల్లెందు ఎమ్మెల్యేలు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలంటూ ప్రసంగించారు. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, రెవెన్యూ మంత్రివర్యులు పొంగిలేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఇల్లెందు రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేయాలని వినతిపత్రం సమర్పించడం జరిగింది. ప్రస్తుతం స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఎదులాపురం మున్సిపాలిటీ, కేససముద్రం మున్సిపాలిటీలుగా, ఐదు మండలాలను ఏర్పాటు చేసస్తూ రాష్ట్రప్రభుత్వం గెజిట్ ఇవ్వడంతో స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఇల్లెందు ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

*** ' ఇల్లెందు ' రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు అనువైన ప్రాంతం**

ఇల్లెందు నియోజకవర్గంలో ఇల్లెందు పట్టణం భాగమైనప్పటికీ ముఖ్యకార్యాలయాలు, రవాణావ్యవస్థ ఈ ప్రాంతం నుంచే అనువుగా ఉంటుంది. ఇల్లెందులో ఆర్అండ్బీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ట్రెజరీ, గురుకులాలు ఇక్కడే ఉన్నాయి. ఇల్లెందుకు తక్కువ దూరంలో కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల ముఖ్య కార్యాలయాలున్నాయి. ఇల్లెందు నాలుగు కూడళ్లకు మధ్యలో ఉన్న ప్రాంతం.

**అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నాలకు సన్నద్ధం**

అధికార, ప్రతిపక్షాలు రెవెన్యూ డివిజన్కు మద్దతు తెలుపుతున్నప్పటికీ రెవెన్యూ డివిజన్ సాధన ఆలస్యమవడంతో అఖిలపక్షం ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ప్రజల ఆకాంక్షను బలంగా వినిపించేందుకు ప్రతిపక్షాలు కార్యచరణను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. మరికొన్ని నెలలో జరగబోవు సర్పంచి, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో దీనిని అస్త్రంగా మలుచుకుని ప్రజల్లోకి వెళ్లాలనే యోచనలో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.

# భద్రకాళి చెరువు పూడికతీత పనులు వేగవంతం

## హనుమకొండ కలెక్టర్ ప్రావిణ్య



**ప్రజాపక్షం/హనుమకొండ:** భద్రకాళి చెరువు పూడికతీత పనులను వేగవంతం చేయాలని సంబంధిత శాఖల అధికారులను హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య ఆదేశించారు. మంగళవారం భ ద్రకాళి చెరువు పూడికతీత పనులను సంబంధిత శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించా రు. భద్రకాళి చెరువు పూడికతీత పనులు, మట్టి తరలింపు, తదితర విషయాలను అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ చెరువు పూడికతీత పనులలో భాగంగా తీసిన మట్టిని ఎక్కడ కూడా ఇబ్బం దులు లేకుండా తరలింపు జరగాలన్నారు. మట్టి తరలింపునకు వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అంతర్గత రోడ్డు( అప్రోచ్ రోడ్డు)ను నిర్మించాలని సూ చించారు. మట్టి తరలింపు సమయంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. పనులు జరుగుతున్న చోట్ల రాత్రి వేళలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. మట్టి తరలించే వాహనాల నమోదు కోసం జంక్షన్, చెక్ పోస్ట్ ను ఏర్పాటుచేసి రెవెన్యూ, పోలీస్, సాగునీటి పారుదల, మున్సిపల్ శాఖల సిబ్బందితో 24 గంటల పాటు పర్యవేక్షణ, తనిఖీ ఉండేటట్టు చూసుకోవాలన్నారు. పూడికతీత మట్టి కావాలనుకునేవా రు క్యూబిక్ మీటర్ కు రూ. 72 చెల్లించి తీసుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అ శ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, మున్సిపల్, కుడా, సాగునీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

## ఎస్పి కిరణ్ ఖరే



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**నేరాల నియంత్రణ కోసం పోలీసు అధికారులు సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పి కిరణ్ ఖరే అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించి, పోలీస్ స్టేషన్ల వారిగా నమోదైన గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులలో విచారణ, స్థితిగతులు, పెండింగ్ కేసుల పురోగతిపై ఎస్పి సమీక్ష జరిపి, కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, నేర స్థల పరిశీలన, సాక్ష్యాధారాల సేకరణ, కేసు నమోదు, నిందితుల అరెస్టు, దర్యాప్తు, ఛార్జిషీటు దాఖలు సంబంధించి పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ అక్రమంగా ఇసుక రవాణా చేపట్టే వారిపై చట్టపరమైన కఠినచర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అధికారులంతా విజిబుల్ పోలీసింగ్ కి ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు.



పోలీస్ స్టేషన్ పరిధిలో గ్రామ సందర్శనలు, పట్టణంలో వార్డుల సందర్శనలు పెంచాలన్నారు. స్థానికంగా వుండే ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, ఏదైనా శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే సమాచారం అందేలా చూసుకోవాలన్నారు. జిల్లాలో గంజాయి ఇతర మత్తు పదార్థాలపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని, మహిళల పట్ల నేరాలపై వేగంగా స్పందించి, న్యాయం చేయాలన్నారు. వివిధ దొంగతనాల కేసుల్లో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసినట్లు ఎస్పి తెలిపారు. అలాగే రోడ్డు ప్రమాదాలపై సమీక్ష చేసిన ఎస్పి పలు ప్రమాదాలు జరిగిన చోటును హాట్ స్పాట్ గా గుర్తించి, వాటికీ గల కారణాలను తెలుసుకుని, అవసరమైతే ఇతర శాఖల సమన్వయం తో సమస్య పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్పి వేముల శ్రీనివాస్, భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు, వర్టికల్ డిఎస్పి నారాయణ నాయక్, జిల్లా పరిధిలోని సిఐలు ఎస్సైలు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకం

## జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్




**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట వ్యతిరేకమని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో మహిళా, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ, మహిళా సాధికారత కేంద్రం, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో, బేటీ పడావో పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసిపి రాజమహేంద్ర నాయక్‌తో కలిసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్1994పై ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడి టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశాలకు ఓరియెంటేషన్ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్1994ను సరిగ్గా అమలుచేయాలన్నారు. పిసి అండ్ పిఎన్‌డిటి యాక్ట్ ప్రకారం భ్రూణహత్యలు చట్టరీత్యా నేరమన్నారు. జిల్లాలో ఎక్కడా కూడా లింగ నిర్ధారణ పరీక్షలు జరుగకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ పరీక్షలు నిర్వహించే వారిపై మహిళా హెల్ప్‌లైన్ నెంబర్ 181, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబర్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ విషయమై సమాచారం ఇచ్చిన వారికి రూ.10వేల నజారానా ఇస్తామని కలెక్టర్ ప్రకటించారు.ఈ కార్యక్రమంలో డిడబ్ల్యూఒ ఫ్లోరెన్స్, డిఎంహెచ్ఒ మల్లిఖార్జున్‌రావు, డిప్యూటీ డిఎంహెచ్ఒ శ్రీదేవి, మహిళ సాధికారత కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ హెచ్ శారద, ప్రోగ్రామింగ్ అధికారి రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ దేవాలయాల సందర్శన



**ప్రజాపక్షం/లింగాలఘణపురం:**ప్రముఖ పుణ్యక్షేత్రమైన మండలంలోని జీడికల్ గ్రామంలో శ్రీవీరాచల జీడికంటి రామచంద్రస్వామి దేవాలయాన్ని, సోమవారం సాయంత్రం, దేవాదాయ ధర్మాదాయ శాఖ మాజీ కమిషనర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ విధులు నిర్వహిస్తున్న ఎం.హనుమంతరావు, ఆలయాన్ని సందర్శించారు. ఆలయ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి, అర్చకుల చేతి మీదుగా, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి కొండా సురేఖ

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** హన్మకొండ రాంనగర్‌లోని తెలంగాణ రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన నివాసంలో మంగళవారం ప్రజల నుంచి ఆర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని వివిధ వర్గాల ప్రజలు రాంనగర్‌లోని తమ నివాసానికి చేరుకొని సమస్యల్ని మంత్రి కొండా సురేఖకు తెలిపారు. వారి సాధక బాధకాలను మంత్రి విని సంబంధిత అధికారులతో అప్పటికప్పుడే ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. సులువుగా పరిష్కరించాల్సిన సమస్యల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను మంత్రి కొండా సురేఖ మందలించారు. మరోసారి బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించినట్లు తన దృష్టికి వస్తే కఠిన చర్యలకు వెనుకాడనని స్పష్టం చేశారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఏ సమస్యలున్నా ప్రజలు తనను సంప్రదించవచ్చని మంత్రి ప్రజలకు స్పష చేశారు. సమస్యల పరిష్కారం దిశగా అధికారుల నుంచి సరైన స్పందన లేనిపక్షంలో తనకు తెలియచేయాలన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతీ ఒక్కరికీ న్యాయం జరుగుతుందన్నారు.

# పని భారం తగ్గించాలంటూ రైల్వే ఉద్యోగుల దీక్ష



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఎర్రటి ఎండలో రైల్ నిలయం ఎదురుగా మజ్దూర్ యూనియన్ నిరాహార దీక్షలో రైల్వే కార్మికుల హక్కుల కోసం జోనల్ సెక్రటరీ డాక్టర్ శంకర్‌రావు అధ్యక్షతన కాల్వ శ్రీనివాసులు, సికింద్రాబద్ డివిజన్ సెక్రటరీ, డివిజన్ రథసారథి పిల్లలమర్రి రవీందర్, మజ్దూర్ యూనియన్ నాయకులు కాజీపేట, వరంగల్ అన్ని డివిజన్లలో కార్మికులు పెద్ద సంఖ్యలో దీక్షలో పాల్గొన్నారు. అన్ని డిపార్టుమెంట్లలోని ఉద్యోగులకు పని భారం తగ్గించాలని, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, నాలుగు లైన్లు అయిన కూడా రెండు లైన్లలో ఉన్న స్టాఫ్‌తోనే వర్క్ చేస్తున్నారన్నారు. తక్షణమే నూతన ఉద్యోగులను భర్తీ చేయాలని, అన్ని డిపార్టుమెంట్లలో పని భారం తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సెక్రటరీ, కాజీపేట బ్రాంచ్ సెక్రటరీ సమ్మయ్య, చైర్మన్ రాజు, ట్రెజరర్ రాజు, ఆఫీస్ బేరర్స్ సదాశివ్, హరీష్, యూత్ ప్రెసిడెంట్ ముత్యాల విజయ్, కన్వీనర్ రాజ్‌కుమార్, మజ్దూర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసి అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్‌ను గెలిపించాలి

## నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్ ముదిరాజ్



**ప్రజాపక్షం / నర్సంపేట :** ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిసి అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ ను గెలిపించాలి నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి ద్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ పిలుపు నిచ్చారు. నర్సంపేట పట్టణంలోని విజ్ డమ్ హైస్కూల్‌లో పట్టణ ఉపాధ్యక్షులు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బిసి సంక్షేమ సంఘం నర్సంపేట నియోజకవర్గ ఇన్‌చారీ ద్యాగల శ్రీనివాస్ హాజరై కరపత్రాలను ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ద్యాగల శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 27న జరగబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ శాసనమండలి (ఎమ్మెల్సీ) అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ గెలుపు కోసం బీసీ సంఘాలు, ఉపాధ్యాయులు, ఉద్యమకారులు, సామాజిక సంఘాలతో పాటు నర్సంపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న బిసి సంక్షేమ సంఘం మండల, గ్రామ నాయకులు మీ గ్రామాలలో ఉన్న ఉపాధ్యాయులను కలిసి బిసి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్ రాజ్ యాదవ్ విజయం కోసం కృషి చేయాలని ద్యాగల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం జిల్లా కార్యదర్శి, చెన్నారావుపేట మండల ఇన్‌చారీచెన్నూరి రవి ముదిరాజ్, పట్టణ ఉపాధ్యక్షులు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, పట్టణ కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, మారపాక రమేష్ లతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తూర్పు డివిజన్‌లో పెద్దపులి కలకలం

## పల్గుల అటవీ ప్రాంతాల్లో వెలుగు చూసిన పులి సంచారం



**ప్రజాపక్షం/కాళేశ్వరం:**జయశంకర్ భూపాలపల్లి జిల్లా తూర్పు డివిజన్ అటవీ ప్రాంతాల్లో పులి సంచారం కలకలం రేపుతోంది.గత వారం రోజులుగా కాటారం, మహాదేవపూర్ రేంజ్ అటవీ ప్రాంతాల్లోని ఒక నిర్ధిష్ట ప్రాంతాలకు పరిమితం కాకుండా అటవీ ప్రాంతాలంతా కలియ తిరుగుతూ పులి సంచారం కొనసాగుతుండటంతో అటవీ గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. కాగా మహాదేవపూర్ మండలం పల్గుల గ్రామ సమీపంలోని శివారు అటవీ ప్రాంతంలో మంగళవారం పులి సంచరించినట్లు తెలుస్తోంది. పల్గుల గ్రామానికి చెందిన ఓ రైతు మంగళవారం ఉదయం ఎడ్ల బండితో తన వ్యవసాయ పొలానికి వెళుతుండగా మార్గ మధ్యలో ఎద్దులు అక్కడే నిలబడి కదలకుండా ఉండిపోవడంతో ఆ రైతుకు కొంత దూరంలో పులి వెళుతుండటం గమనించి వెంటనే అక్కడనుంచి గ్రామంలోకి వెను తిరిగి పులి సంచార విషయం స్థానికులకు చేరవేసాడు. దీంతో స్థానికుల సమాచారం మేరకు అటవీ అధికారులు, స్థానికులు కలిసి పల్గుల శివారు అటవీ ప్రాంతాలను పరిశీలించగా ఆ ప్రాంతంలో పులి పాద ముద్రల ఆనవాళ్లు గుర్తించినట్లు అటవీ అధికారులు తెలిపారు. పులి పాద ముద్రల ఆధారంగా ఆ ప్రాంతం నుండి పూస్కుపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలోని నల్లవాగు అటవీ ప్రాంతంలో పులి సంచారం సాగనున్నట్లు భావిస్తున్నారు. అటవీ శివారు ప్రాంతాల్లో పులి సంచారం కొనసాగుతున్న నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. కాగా ఇప్పటి వరకు పులి పాద ముద్రల ఆధారంగా పులి సంచారం ఉన్నట్లు గుర్తించిన అటవీ అధికారులు అటవీ ప్రాంతాల్లో అక్కడక్కడ ఏర్పాటు చేసిన



ట్రాకింగ్ కెమెరా లకు పులి జాడ చిక్కక పోవడంతో పల్గుల అటవీ ప్రాంతాల్లో పులి సంచారం చేస్తున్న క్రమంలో ఆ ప్రాంతంలో ట్రాకింగ్ కెమెరాలు ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు తమ ప్రయత్నాలను ముమ్మరం చేశాయి.

# కాంగ్రెస్ పాలనలో పూర్తిగా నిర్వీర్యమైన విద్యా వ్యవస్థ

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/గూడూరు:** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో విద్య వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యంగా అయ్యిందని గురుకుల పాఠశాలలపై పర్యవేక్షణ కొరవగంతోనే విషాహార ఘటనలు వెలుగులోనికి వచ్చాయని మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జీల్లా గూడూరు మండలంలోని బ్రహ్మణపల్లి గ్రామం కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లను ఆయన కలిసీ బిజెపి అభ్యర్థి పులి సరోతరతం రెడ్డికి మొదటి పాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల్లో 6 గ్యారంటీలు అమలు చేస్తామని భామీలతో అధికారంలోకి వ చ్చిన కాంగ్రెస్ పార్టీ గత 14 నెలల పాలనలో ఇచ్చిన హామీలు అమలు చేయక ప్రజలను మో సం చేసిందని నియామకాలు చేపటక నిరుద్యోటుల ఉసురు పోసుకుంటున్న గత బిఅర్ఎస్ పాలన బాటలోనే రేవంత్ సర్కార్ నడుస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపి సీతారాంనాయక్ జీల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి గూడూరు మండల నాయకులు మేరెడ్డి సురేందర్ చిల్పూరి వెంకన్న,రాంబాబు,గుండెబోయిన మల్లేష్.రాసమ్మ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులతోనే 'ఎస్ఆర్'కు గుర్తింపు : వరదారెడ్డి




**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** విద్యార్థుల వల్లనే ఎస్ఆర్‌కు మంచి గుర్తింపు వచ్చిందని, ఎస్ఎస్ఆర్‌లో ఒక ప్రణాళిక ప్రకారం అకాడమీ సిలబస్, దాని ప్రకారమే శిక్షణ ఇస్తున్నట్లు, ఒక్క చదువే కాకుండా నేటి ఆధునిక యు గంలో అన్ని రంగాల్లో శిక్షణ ఇచ్చి 100కు 100 శాతం ప్లేస్మెంట్ ఇవ్వడం జరిగింది అని దీంతో దేశం నాలు మూలల నుండి ఎందరో విద్యార్థులు ఎస్ ఆర్ లో విద్యను అభ్యసిస్తున్నారని ఎస్ఆర్ విద్యా సంస్థలు చైర్మెన్ ఎ.వరదా రెడ్డి అన్నారు. మంగళ వారం హన్మకొండలోని కాకాజీ కాలనిలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమతీ రెడ్డి మహిళ కళాశాలకు (యుజిసి) యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్, (జెఎన్‌టియు ) జవహర్ లాల్ నె హ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ నుండి స్వయం ప్రతి పత్తి హోదా వచ్చింది అన్నారు. దేశంముఖ్య నగరాలలో గల కళాశాలలకు దీటుగా సుమతీ రెడ్డి మహిళ కళాశాల విద్యార్థినులకు కావలిసిన మెలకువలు నేర్పించి వివిధ రంగాల్లో రాణించడానికి దోహదం చేస్తున్నామనిన్నారు. స్వయంప్రతి పత్తి హోదా వలన అకడమిక్ మెరుగుదల,సాంకేతిక అభివృద్ధి ,కళాశాల అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. ఈ స్వయంప్రతిపత్తి సంస్థ తన విద్యార్థులకు సుసంపన్నమైన విద్యా అనుభవాన్ని అందించడానికి మరింత శక్తినిస్తుంది, ప్రపంచ శ్రామిక శక్తి యొక్క డైనమిక్ సవాళ్లకు వారిని సిద్ధం చేస్తుంది. నిలకడగా అత్యుత్తమ ప్లేస్‌మెంట్ రికార్డును కొనసాగిస్తోందని, విద్యార్థులందరూ ప్రతిష్టాత్మక బహుళజాతి కంపెనీలలో స్థానాలను పొందుతున్నారని ఆయన తెలిపారు. ఇది అమలు చేసే విద్య యొక్క నాణ్యత, పరిశ్రమకేంద్రీకృత విధానాన్ని ప్రతిబింబిస్తుంది, ప్రతి విద్యార్థి వారి కెరీర్‌లో రాణించడానికి అవసరమైన నైపుణ్యాలు మరియు జ్ఞానాన్ని కలిగి ఉంటారని ఆయన అన్నారు.కళాశాల అద్భుతమైన విద్యా ఫలితాలను, దాని విద్యార్థులలో సర్వతోముఖాభివృద్ధిని పెంపొందించడంలో ఖ్యాతిని కూడా కలిగి ఉంది అన్నారు. సురక్షితమైన క్యాంపస్, సురక్షితమైన వాతావరణాన్ని అందిస్తుంది, ఇది ప్రతి విద్యార్థి యొక్క విద్యా, వ్యక్తిగత వృద్ధికి మద్దతుగా రూపొందించబడింది అని అన్నారు. సుమతీ రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ రజనీరెడ్డి మాట్లాడుతూ, విద్యాపరమైన నై పుణ్యం, విద్యార్థి సంక్షే మానికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడంలో సంస్థ అద్భుతమైన పురోగతిని సాధించిందని అని అన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధిపతులు, అడ్మినిస్ట్రేటివ్ అధికారి, అధ్యాపకులు, సిబ్బంది అందరూ విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ అద్భుతమైన విజయానికి దారితీసిన ప్రతి ఒక్కరి కృషినీ, అంకితభావాన్ని ఆమె కొనియాడారు.

# భోజన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించిన కలెక్టర్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహ సంక్షేమ గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలలో అల్పాహారం, భోజన సౌకర్యాలు అమలును మరింత మెరుగు పరచేందుకుమండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని మండల ప్రత్యేక అధికారులను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. మంగళవారం మండల ప్రత్యేక అధికారులతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, సంక్షేమ వసతి గృహాల్లో అల్పాహారం, భోజన సౌకర్యాలు, విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేయు అంశాలపై టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నుండి అన్ని మండలాల ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన మండలాల్లో భోజన నాణ్యతను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆదేశించారు. ఇదొక నిరంతర ప్రక్రియగా జరగాలని సూచించారు. ఆహార పదార్థాల శుభ్రత, పోషక విలువలు, వంటగదుల నిర్వహణ, భోజన పరిమాణం, మెనూ అమలు తదితర అంశాలను గమనించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ చర్యల ద్వారా విద్యార్థులకు అధిక పోషక విలువలున్న ఉత్తమమైన భోజనం అందించాలనే ఉద్దేశ్యమని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులను పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలను సందర్శించి, అందుతున్న సౌకర్యాలను సమీక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు అందుతున్న మెను, సౌకర్యాల తనిఖీ చేయాలని, తగినన్ని వసతులు కల్పించబడుతున్నాయా అనే విషయాన్ని పరిశీలించాలని సూచించారు. అలాగే టీచింగ్ సిబ్బంది సమయ పాలనను క్షుణ్ణంగా పరిశీలించి, పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగు పరిచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు

## వీడియో కాన్ఫరెన్స్ లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :**వేసవిలో నీటి సమస్య తలెత్తకుండా సమగ్ర కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. మంగళవారం డా॥ బిఆర్ అంబేద్కర్ సచివాలయం, హైదరాబాద్ నుండి వేసవిలో త్రాగునీరు, విద్యుత్ సమస్యలు రాకుండా చేపట్టాల్సిన చర్యలు, యాసంగిలో సాగునీరు, రైతు భరోసా, సంక్షేమ వసతి గృహాలు తనిఖీ ప్రజాపాలన కుటుంబ సర్వే దరకాస్తులు ఆన్లైన్ తదితర అంశాలపై ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులతో కలిపి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వచ్చే వేసవికాలంలో త్రాగునీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది రాకుండా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. మంచినీటి పైపులైన్స్ లీకేజీ లు లేకుండా అరికట్టాలని అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేయాలని అన్నారు. మంచినీటి కొరత వచ్చిన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 53 సొసైటీల్లో యూరియా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. క్రమం తప్పక వ్యవసాయ అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. మంచినీటి కొరత వచ్చిన గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని, స్థానిక వనరులను గుర్తించాలని తెలిపారు. లీకేజీ లు అరికట్టాలని ఆదేశించారు. బుధవారం సాయంత్రం 3.30 గంటలకు ఐడిఓసి లో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని, సమగ్ర నివేదికలతో హాజరు కావాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ల అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, వ్యవసాయ అధికారి విజయభాస్కర్, పౌరసరఫరాల అధికారి శ్రీనాథ్, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్చూ ర్ నాయక్, ఆర్ డబ్ల్యూ ఎస్ఈఈ నిర్మల, ఇరిగేషన్ ఇఇలుతిరుపతి, యాదగిరి,ఆర్డీఓరవి తదితరులు పాల్గొన్నారు.




# జనగామ సబ్ జైల్‌ను సందర్శించిన డాక్టర్ సౌమ్యామిశ్రా



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామ సబ్ జైల్‌ను డైరెక్టర్ జనరల్ ఆఫ్ తెలంగాణ ప్రిజన్స్ అండ్ కరక్షనల్ సర్వీసెస్ డాక్టర్ సౌమ్యామిశ్రా మంగళవారం సందర్శించారు. ఖైదీల యోగక్షేమాలు, న్యాయపరమైన సమస్యలని అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకి సరైనా వసతులు అందుతున్నాయా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. జైలు యొక్క సెక్యూరిటీని పరిశీలించారు. ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. డిఐజి ప్రిజన్స్ వరంగల్ రేంజ్ సంపత్, జనగామ డిసిపి రాజమహేంద్రనాయక్, జైలర్ రామకృష్ణ, జనగామ సిఐ దామోదర్‌రెడ్డి, జైలు సూపరింటెంట్ పి కృష్ణకాంత్ పాల్గొన్నారు.

# తడి, పొడి చెత్తను వేరుచేయాలి

## నగర మేయర్ గుండు సుధారాణి

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** తడి పొడి చెత్తను వేరుచేసి అందించాలని నగర మేయర్ గుండు సుధారాణి నగర వాసులను కోరారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని బయో గ్యాస్ ప్లాంటును మేయర్ క్షేత్రస్థాయిలో సందర్శించి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రజలందరూ ప్రతీ రోజు తడి, పొడి చెత్తను వేరు చేసి కార్పొరేషన్ తరపున తమ నివాస ప్రాంతాలకు చెత్త సేకరణ వచ్చే వాహనాలకు అందించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరే చేసి అందించడం వల్ల కంపోస్టు ఎరువును తయారుచేసి వచ్చిన కంపోస్టును కార్పొరేషన్ ఆవరణలో హార్టికల్చర్ విభాగం ద్వారా మొక్కల పెంపకానికి వాడుతున్నామన్నారు. కార్పొరేషన్‌లో బయో గ్యాస్ ప్లాంటు ద్వారా గ్యాస్‌ను ఉత్పత్తి చేసి దాని నుంచి వచ్చే విద్యుత్‌ను ప్రతీ రోజు రెండు గంటల పాటు వినియోగించడం జరుగుతుందన్నారు. పొడి చెత్తను నగరంలోని డిఆర్‌సిసి కేంద్రాలకు అక్కడ నుంచి దేశంలోని వివిధ రీ సైక్లింగ్ కేంద్రాలకు పంపడం జరుగుతుందన్నారు. ప్రతీ ఒక్కరూ నగర కార్పోరేషన్‌కు సహకరించాలన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని మేయర్ తెలిపారు.

ఫోకస్


మహిళ

## ధీర వనిత యోగితా సతవ్




పుణేకు చెందిన యోగితా సతవ్ సాహసం ప్రతి మహిళకూ ప్రేరణ కావాలి. కొటక్ మహీంద్ర గ్రూప్‌లోని కొటక్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ యోగితాపై ఒక యాడ్‌ను రూపొందించడమే ఆమె ప్రతిభకు, చూపిన సాహసానికి నిదర్శనం. 2002 జనవరి 7వ తేదీ ఒక బస్సు డ్రైవర్ ప్రాణాలను కాపాడి నప్పుడు యోగిత వయసు 42 సంవత్సరాలు. నాటి సంఘటన వివరాల్లోకి వెళితే, 8 మంది చిన్నారులు, 20 మహిళలతో కూడిన బస్సులో యోగిత కూడా విహారయాత్రకు బయలుదేరింది. మార్గమధ్యంలో హఠాత్తుగా అస్వస్థతకు గురైన డ్రైవర్ బస్సును నిలిపి వేశాడు. ఆ వెంటనే స్పృహ కోల్పోయాడు. దీనితో కొంత మంది మహిళలు అతనిని బతికించేందుకు ప్రాథమిక చికిత్స అందించడానికి ప్రయత్నించారు. మరికొందరు సహాయం కోసం కేకలు వేశారు. యోగిత కూడా తన ప్రయత్నంగా డ్రైవర్ ముఖంపై నీళ్లు చల్లింది. కానీ, ఎలాంటి మార్పు లేకపోవడంతో, అతనిని ఎలాగైనా కాపాడాలనే ఉద్దేశంతో తానే డ్రైవర్ సీటులో కూర్చొని, బస్సును నడపడం మొదలుపెట్టింది. మొదట్లో భయపడినప్పటికీ, క్రమంగా ఆత్మవిశ్వాసాన్ని సంతరించుకుంది. సుమారు 10 కిలోమీటర్లు బస్సును నడిపి, ఆ డ్రైవర్‌ను ఆసుపత్రిలో చేర్పించింది. ఆమె బస్సు నడుపుతున్న వీడియో అప్పట్లో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆమె సాహసోపేతమైన కథను అందరికీ స్ఫూర్తిదాయకం. అంతకు ముందు ఎన్నడూ బస్సు నడిపించకపోయినప్పటికీ, కారు నడిపిన అనుభవాన్ని ఆమె ఉపయోగించుకున్న తీరు అద్భుతం. ఆల్‌నైన్‌లో షేర్ చేసిన ఆమె బస్సు నడిపే వీడియోకు యూట్యూబ్‌లో, కొన్ని రోజుల్లోనే 7 లక్షలaకుపైగా వ్యూస్ వచ్చాయి. ఆమె ధైర్యాన్ని, సమయస్ఫూర్తిని నెటిజన్లు ప్రశంసించారు. ఆ ప్రశంసలకు ఆమె అన్ని విధాలుగా అర్హురాలే.

# బోలు ఎముకల వ్యాధికి 'మెనోపాజ్'తో లింక్




మహిళల్లో మెనోపాజ్‌కూ, బోలు ఎముకల వ్యాధి (ఆస్టియోపొరోసిస్)కు మధ్య విడదీయలేని సంబంధం ఉంది. వయసు పెరుగుతున్న కొద్దీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ఎవరికైనా అవసరమే. అయితే, మహిళలకు ఇది అత్యవసరం. ముఖ్యంగా మెనోపాజ్ (రుతువిరతి) సమీపిస్తున్నప్పుడు దాడి చేసే అత్యంత తీవ్రమైన ఆందోళనకరమైన వ్యాధుల్లో ఆస్టియోపోరోసిస్ ఒకటి. ఇది ఎముకలను బలహీన పరచి, పగుళ్లకు గురిచేస్తుంది. రుతువిరతి సమయంలో హార్మోన్ల మార్పుల కారణంగా మహిళలు ఎక్కువగా శారీరక సమస్యలు ఎదుర్కొంటారు. మెనోపాజ్ సమయంలో తలెత్తే ప్రధాన సమస్యల్లో ఒకటైన బోలు ఎముకల వ్యాధి కారణంగా ఎముకలు సాంద్రత కోల్పోయి, పెళుసుగా మారుతాయి. ఎముక అనేది సజీవ కణజాలం. ఇది నిరంతరం విచ్ఛిన్నమవుతూ ఉంటుంది. ఆ స్థానం కొత్త కణజాలంతో భర్తీ అవుతుంది. ఇది నిరంతర ప్రక్రియ. అయితే, పాత ఎముకకు జరిగిన నష్టాన్ని కొత్త ఎముక సంపూర్ణంగా భర్తీ చేయలేకపోవడాన్ని, ఆస్టియోపొరోసిస్‌గా పేర్కొంటారు. ఫలితంగా ఎముకలు చిట్లుతాయి. దురదృష్టం ఏమిటంటే, ఈ వ్యాధి విరుచుకుపడే ముందు ఎలాంటి అనారోగ్య లక్షణాలు ఉండవు. సాధారణ నొప్పులను రోజువారీ సమస్యగా భావించే మహిళలు పట్టించుకోరనేది నిజం. ఈ వ్యాధి అత్యధికంగా తుంటి, లేదా వెన్నెముక లేదా మణికట్టును ఎక్కువగా దెబ్బతీస్తుంది. 40 లేదా 45 సంవత్సరాలు దాటిన ప్రతి 50 మంది మహిళల్లో కనీసం ముగ్గురు ఆస్టియోపోరోటిక్ ఫ్రాక్చర్లను




అనుభవిస్తారని అంతర్జాతీయ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మన దేశం విషయానికి వస్తే, 62 శాతం మంది మహిళల్లో ఈ బోలు ఎముకల వ్యాధి వ్యాప్తి చెందింది. అధిక రేటు హార్మోన్ల మార్పుల వల్ల మాత్రమేగాక, స్త్రీలలో సహజంగానే ఎముక ద్రవ్యరాశి తక్కువగా ఉన్న కారణంగా కూడా ఈ సమస్య తలెత్తుతుంది. మహిళల ఎముకలు సాధారణంగా చిన్నవిగానూ, తేలికగానూ ఉంటాయి. అందుకే, వారికి ఆస్టియోపొరోసిస్ తొందరగా సోకుతుంది. ఈ వ్యాధిపై జీవితాంతం శ్రద్ధ పెట్టక తప్పదు. ఎముక ద్రవ్యరాశి 30 సంవత్సరాల వయసు లో గరిష్టస్థాయికి చేరి, ఆ తర్వాత క్రమంగా తగ్గుతుంది. మహిళ లు, వారు తీసుకునే ఆహారం, చేసే శారీరక శ్రమతోపాటు వంశపారంపర్యంగా వచ్చే జన్యుపరమైన అంశాలపై కూడా ఈ వ్యాధి వ్యాపించడమనేది ఆధారపడి ఉంటుంది. ఎముకల సాంద్రత మెనోపాజ్ తర్వాత పది నుంచి ఇరవై సంవత్సరాలలో 7 శాతం వరకూ తగ్గుతుంది. నడుము, తుంటి, వెన్నెముక ఎముకలు దెబ్బతినడంతో, నడవడానికి ఇబ్బంది పడతారు. కింద కూర్చోలేరు. కొన్ని సందర్భాల్లో కూర్చున్న చోటు నుంచి లేవడానికి కూడా చేతగాని పరిస్థితి ఉంటుంది. ఇలాంటి సమస్యలను కనిపించిన వెంటనే సరైన వైద్య సేవలు పొందడం అత్యవసరం. తేలికగా తీసుకుంటే, వ్యాధి తీవ్రత మరింత ముదిరి, కదలలేని పరిస్థితి రావచ్చు. వాధి సోకినా, లేకపోయినా, ఎముకలను బలోపేతం చేయడానికి అనుసరించాల్సిన మార్గాల్లో ప్రధానమైనది ఆహారం. ఎముకలు బలంగా ఉండాలంటే కాల్షియం, విటమిన్ 'డి' అత్యవసరం. 50 ఏళ్ల పైబడిన మహిళలకు సగటున రోజుకు 1,200 మిల్లీ గ్రాముల కాల్షియం అవసరం. ఇది పాల ఉత్పత్తులు, ఆకు కూరలు, బలవర్ధకమైన ఆహారంలో లభిస్తుంది. సూర్యరశ్మి తోపాటు వివిధ సప్లిమెంట్స్ ద్వారా విటమిన్ 'డి'ని పొందవచ్చు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం కూడా అవసరమే. శరీర తత్వాన్ని, వయసును బట్టి వ్యాయామ విధానాన్ని నిర్ధారించుకోవాలి. మితిమీరిన పట్టణీకరణ, అందుబాటులోకి వచ్చిన వివిధ సౌకర్యాల కారణంగా మహిళలకు శారీరక శ్రమ చాలా వరకూ తగ్గింది. ఎముకల సాంద్రత క్షీణతకు ఇది ప్రధాన కారణం. కాబట్టి రోజుకు కనీసం 30 నిమిషాలు వ్యాయామం చేయడాన్ని అలవాటు చేసుకోవాలి. ఇలాంటి కొన్ని జాగ్రత్తలతో మహిళలు ఆస్టియోపొరొసిస్ సమస్య నుంచి కొంతవరమైనా ఊరట పొందవచ్చు.

## మానవీయ విలువలు బోధిస్తున్న గాయత్రి

ఫిబ్రవరి 24 జయంతి



కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేసిన గాయత్రి చక్రవర్తి స్పివాక్ వయసు ఇప్పుడు 82 సంవత్సరాలు. నాడు ఉపాధ్యాయినిగా.. నేడు రచయిత్రిగా ఆమె మానవీయ విలువలు బోధిస్తునే ఉన్నారు. ఆమె సాహిత్య సాహిత్య సిద్ధాంత కర్త, తత్వవేత్త, సమకాలీన సాహిత్యం, మెరుగైన సమాజం కోసం ఏర్పాటు చేసిన సంస్థకు వ్యవస్థాపక సభ్యురాలు. ఆమె రాసిన పాఠ్యం 'కెన్ ద సబాల్టన్ స్పీక్?' అనేది వలసోత్తర వాదం అర్థం చేసుకోడానికి ఒక పాఠంగా పేర్కొంటారు. పలు గ్రంథాలను ఆమె అనువదించారు. 2012లో 'క్యోటో ప్రైజ్ ఆన్ ఆర్ట్స్ అండ్ ఫిలాసఫీ' స్వీకరించిన గాయత్రి, పెట్టుబడిదారీ ప్రపంచంలో మేధో వలసవాదానికి వ్యతిరేకంగా, మానవీయ దృక్పథంతో మాట్లాడే ఒక సూక్ష్మ సిద్ధాంతకర్తగా, విద్యావేత్తగా గుర్తింపు సంపాదించారు. ఆమెకు భారత విశిష్ట పురస్కారమైన 'పద్మభూషణ' పురస్కారం 2013 లో వచ్చింది. శివానీ చక్రవర్తి, పారెస్ చంద్ర దంపతులకు కలకత్తా నగరంలో జన్మించిన గాయత్రి, సెయింట్ జాన్ డియోసెసన్ గర్ల్స్ హయ్యర్ సెకండరీ పాఠశాలలో విద్యను పూర్తి చేసిన తరువాత, 1959లో కలకత్తా విశ్వవిద్యాలయం పరిధిలోని ప్రెసిడెన్సీ కళాశాల నుంచి ఆంగ్లంపై డిగ్రీని పొందారు. గ్రాడ్యుయేషన్‌లో ఆంగ్ల, బెంగాలీ సాహిత్యాలను ప్రధాన పాఠ్యాంశాలుగా తీసుకొని, మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. గోల్డ్‌మెడల్ సంపాదించారు. ఆ తరువాత ఆమె కార్నెల్ విశ్వవిద్యాలయంలో హాజరై ఆంగ్ల సాహిత్యంలో ఎంఎ, 'కంపేరటివ్ లిటరేచర్'లో పిహెచ్‌డిని కూడా పొందారు. ఆమె విలియం బట్లర్ యీట్స్ వ్యాసాలపై అధ్యయనం చేశారు. 'టెల్లూరైడ్ అసోసియేషన్'కు ఎన్నికైన రెండవ మహిళగా గుర్తింపు సంపాదించారు. 1960లో టాల్‌బోట్ స్పివాక్‌ను వివాహం చేసుకున్నారు. తన స్వీయ చరిత్ర 'ది బ్రైడ్ వోర్ ది ట్రెడిషనల్ గోల్డ్'లో ఆమె తన జీవితం గురించి అనేక అంశాలను ప్రస్తావించారు. కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేసి, ఆ యూనివర్శిటీ 264 సంవత్సరాల చరిత్రలో ఉత్తమ ఉపాధ్యాయిని గౌరవాన్ని పొందిన ఏకైక మహిళగా చరిత్రకెక్కారు. అంతర్జాతీయంగా విద్యా విధానంలో వస్తున్న మార్పులు, స్త్రీవాద భావనల్ని సమర్థించడంలో గాయత్రి చేసిన కృషి అనన్యసామాన్యం. ఆర్థిక అసమానతల నేపథ్యంలో కింది స్థాయి ఉద్యోగుల కష్టాలపై 1985లో గాయత్రి రచించిన 'కెన్ ది సబ్ అల్ టర్న్ స్పీక్' పుస్తకం సంచలనం సృష్టించింది. వలస పాలన విధానం దుష్పరిణామాలను ఎండగట్టడంలో గాయత్రి రచనల్ని ఇప్పటికి ప్రమాణికంగా తీసుకుంటుంటారు. 51ఏళ్ళ పాటు అమెరికాలో జీవించిన గాయత్రి చక్రవర్తి ఇప్పటికి భారత పౌరసత్వాన్ని వదులుకోకపోవడం విశేషం. పాస్ పోర్టు మార్చుకోవాలనే ఆలోచన తనకెప్పుడు రాలేదంటారు ఆమె. సౌకర్యాల కోసమే బ్రతకనక్కర్లేదని, ఇబ్బందులున్నా ప్రపంచమొత్తం పర్యటించడానికి తనకెప్పుడు పాస్ పోర్ట్ అడ్డంకి కాలేదని అంటారు. తనను తాను న్యూయార్క్ వాసిగా చెప్పుకుంటానే తప్ప అమెరికన్‌గా చెప్పుకోనని స్పష్టం చేస్తారు.

## బరువు తగ్గాలంటే..



బరువు తగ్గడానికి ఎన్నో రకాలుగా కష్టపడుతుంటారు. అయితే, ఉదయం పూట ఎండలో కొంతసేపు గడపడం వల్ల బరువు తగ్గుతుందని నార్త్ వెస్టర్న్ యూనివర్శిటీ పరిశోధకులు అంటున్నారు. సాధారణంగా శరీరానికి విటమిన్ 'డి' అందాలంటే ఉదయం ఎండ తగలనివ్వాలని అంటారు. ఇది అందరికీ తెలిసిందే. అయితే, బరువు కూడా తగ్గవచ్చన్నది కొత్త సిద్ధాంతం. పరిశోధకుల తాజా అధ్యయన పత్రంలో, దీనికి సంబంధించిన ప్రాథమిక అంశాలు ఉన్నాయి. ఉదయం వేళల్లో నడిచే వారి బాడీ మాస్ ఇండెక్స్ (బిఎంఐ) తక్కువగా ఉందని తేలింది. కార్యాచరణ స్థాయి, కేలరీలను తీసుకోవడం, నిద్ర సమయం, వయస్సు, వాతావరణం వంటి అంశాల ఆధారంగా లెక్కించినప్పుడు, ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ వచ్చే స్వచ్ఛమైన సూర్యకాంతి లేదా ఇంటిలోపలికి ప్రవేశించే సూర్యకిరణాల స్పర్శ సాధ్యమైనంత ఎక్కువగా తగిలేలా చూడాలని ఈ అధ్యయనం సూచిస్తున్నది. ఉదయం ఎండ మనిషి శరీరంపై ప్రభావం చూపాలంటే, రోజూ సుమారు 20 నుంచి 30 నిమిషాలు ఎంతలో ఉండాలని పేర్కొంది. ఇది ఖర్చుతో కూడుకున్నది కాదు కాబట్టి, ప్రయత్నించడంలో తప్పులేదు.

## మార్చి 1,2వ తేదీలలో ఎఐవైఎఫ్ రాష్ట్రకౌన్సిల్ సమావేశాలు

ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర




**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** మార్చి 1, 2వ తేదీల్లో జరగనున్న ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర కోరారు. మంగళవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల సమితి ఆధ్వర్యంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరి ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్య ప్రసాద్‌లు ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమావేశాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న యువజన విధానాలపై చర్చించనున్నట్టు తెలిపారు. పోరాటాల తో యువజన సమస్యల పరిష్కారమవుతాయన్నారు. రెండు రోజుల పాటు జరిగే రాష్ట్ర సమితి సమావేశాల్లో మొదటి రోజు 'సాంకేతికత అభివృద్ధి – నిరుద్యోగ సమస్య'పై సెమినార్ ఉంటుందని, రెండవ రోజు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి ఎఐవైఎఫ్ సభ్యులు సమావేశాలకు హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ ఘట్‌కేసర్ మండల కార్యదర్శి సంపంగి శివ, సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, యేసు బాబు, సంపత్, పరమేష్, మంచాల రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలు

సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి




**ప్రజాపక్షం /వరంగల్ ప్రతినిధి :** వందేళ్ళ ఘనమైన చరిత్ర కలిగిన సిపిఐ పార్టీ శాతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి పిలుపునిచ్చారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం విరగోని శంకరయ్య అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా మేకల రవి మాట్లాడుతూ మనిషిని మనిషి దోచుకోలేని వ్యవస్థ నిర్మాణం కావాలన్న ఆశయంతో మార్క్సిజం లెనినిజం పునాదులపై ధనిక పేద తేడాల్లేని సమసమాజ నిర్మాణం కోసం సిపిఐని ఏర్పాటు చేసి గత 99 ఏళ్ళు అవుతుందన్నారు. నాటి నుండి అనేక అక్రమ కేసులు, కుట్ర కేసులు, జైళ్లు, నిర్బంధాలు, అనేక బలిదానాలు, త్యాగాలు చేసిన ఘనమైన చరిత్ర సిపిఐకి తప్ప దేశంలో మరే పార్టీకి లేదన్నారు. కమ్యూనిస్ట్ పార్టీగా ప్రజల పక్షంగా ఉంటూ రానున్న రోజుల్లో పాలకులు ఆవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. జిల్లాలో పల్లె పల్లెన సిపిఐ శతాబ్ది ఉత్సవాలు జరపాలని పార్టీ శ్రేణులను కోరారు. అందులో భాగంగా ఈనెల 25 జిల్లా స్థాయి శతాబ్ది ఉత్సవాలు వరంగల్ నగరంలో జరుగుతుందని అన్ని వర్గాల ప్రజలు సహకరించి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్‌కె బాష్మీయ, పనాస ప్రసాద్, గన్నారపు రమేష్, దండు లక్ష్మణ్, గుండె బద్రి, సంగి ఎలందర్, మునీశ్వరుడు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ శక్తులకు మేలు చేసేదిగా కేంద్రబడ్జెట్

యాదాద్రి జిల్లాకు కేటాయింపులు శూన్యం

వామపక్షాల నాయకులు



**ప్రజాపక్షం/భువనగిరిరూరల్ :** పేదలు, యువత, రైతులు, మహిళలకు కార్మికులకు ప్రాధాన్యతిస్తున్నామని మాటలు చెప్పి ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర వార్షిక బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం భారీకోతలు విధించారని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల బిక్షపతి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జహంగీర్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బేజాడి కుమార్ విమర్శించారు. మంగళవారం కేంద్ర బడ్జెట్ ను నిరసిస్తూ భువనగిరి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎనిమిదవ సారి ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల బడ్జెట్ కాకుండా పెద్దల బడ్జెట్‌గా, బడా కార్పొరేట్ శక్తులకు మేలు చేసేదిగా ఉందన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లో రూ.47వేల కోట్ల విలువ చేసే వాటాలను ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు విక్రయించాలని కేంద్రం నిర్ణయించడం దారుణమన్నారు. భీమా రంగంలో 100 శాతం ఎఫ్‌బిఐలను అనుమతిస్తూ దేశీయ బీమా సంస్థలను ప్రమాదంలో పడేసే విధంగా ఈ బడ్జెట్ ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 0 శాతం పేదరికం లక్ష్యం అంటూనే ఆ వర్గాల ఉన్నతి కోసం తీసుకున్న చర్యలను మాత్రం ఎక్కడ కూడా వెల్లడించలేదన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాలకు ఒకరకంగా, మిగతా రాష్ట్రాలకు ఒకరకంగా బడ్జెట్ కేటాయింపు జరిగిందన్నారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపులో తెలంగాణ రాష్ట్రానికి ఒరిగింది ఏమీ లేదన్నారు. ప్రధానంగా మూసీ ప్రక్షాళన కోసం, యాదాద్రి భువనగిరి జిల్లా అభివృద్ధి కోసం బడ్జెట్లో కేటాయింపులు లేవన్నారు. జిల్లాలో వైద్య సదుపాయం అందించే ఎయిమ్స్ మాటే లేదని, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వూసేలేకుండా ఉందని, దళితులు, గిరిజనులకు బడ్జెట్‌వాటాలో పెంచవలసింది పోయి తగ్గించారన్నారు. కేంద్ర బడ్జెట్‌లో యాదాద్రి భువనగిరి జిల్లాకు కేటాయించింది శూన్యం అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమం కొండమడుగు నరసింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, బూరుగు కృష్ణారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏశాల అశోక్, కొల్లూరి రాజయ్య, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిరిపంగి స్వామి, మాయ కృష్ణ, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, బోలగాని జయరాములు, దయ్యాల నరసింహ, గడ్డం వెంకటేష్, నాయకులు మేక అశోక్ రెడ్డి, మంగ నరసింహులు, పల్లెర్ల అంజయ్య, సిపిఐ నాయకులు కళ్లెం కృష్ణ, న్యూడెమోక్రసీ నాయకులు సహదేవ్, రాజయ్య, కొమురయ్య, ఈర్లపల్లి ముత్యాలు, గంటేపాక శివ, చింతల శివ, కొండమడుగు నాగమణి, మాటూరి కవిత, సబిత,కొండ అశోక్, బందేల ఎల్లయ్య,వనం రాజు, వల్లబుదాసు రాంబాబు, శ్రీకృష్ణ, నరేష్ పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మద్దతు




సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి

**ప్రజాపక్షం/శంకరపట్నం :** ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికే సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందని పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి స్పష్టం చేశారు. శంకరపట్నం మండలం కేశవపట్నంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత పదేళ్లలో బిఆర్‌ఎస్ నిరంకుశ నియంతృత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, మేనిఫెస్టోను ప్రజలు మెచ్చి ఆ పార్టీకి అధికారమిచ్చారని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంలో జాప్యం చేయవద్దని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై హామీల అమలు ప్రభావం పడకుండా చూసుకోవాలన్నారు. మతతత్వ బిజెపితో ప్రమాదం పొంచి ఉందని, లౌకిక వాదానికి సంపూర్ణ మద్దతు ఇచ్చేందుకు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికే సిపిఐ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనపై అధికార పార్టీ స్పష్టత ఇవ్వాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులు, యువత, మేధావులు, ఉద్యోగులు, పట్టభద్రులు ఈ ఎన్నికల్లో ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోయిని అశోక్, మండల కార్యదర్శి, పిట్టల సమ్మయ్య, పిట్టల రామస్వామి, లక్ష్మణ్, తిరుపతి ఉన్నారు.

## గుర్తింపు సంఘంగా బాధ్యతతో వ్యవహరిస్తున్నాం

ఎఐటియుసి నాయకులు




**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి :** సింగరేణిలో గుర్తింపు సంఘంగా బాధ్యతగా వ్యవహరిస్తూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్రకార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీవన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని భాస్కర్‌రావు భవన్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి నిరంతరం కృషి చేస్తుందన్నారు. నేడు కార్మిక వర్గం అనుభవిస్తున్న అనేక హక్కులు ఎఐటియుసి పోరాటంతోనే సాధ్యమయ్యాయన్నారు. ఎఐటియుసి నాయకులు సింగరేణిలో ఫ్రీ మస్టర్లు తీసుకోవడం లేదని, విధులు నిర్వహిస్తూ గనులపై కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాల వల్ల సింగరేణిలో నూతన గనులు రావడం లేదన్నారు. ఎఐటియుసిపై చౌకబారు మాటలు విమర్శలు మానుకోవాలని వారు సూచించారు. సమావేశంలో తాళ్ళపెల్లి మల్లయ్య, చెప్యాల మహేందర్‌రావు, వొడ్నాల మల్లయ్య, గాండ్ల కుమార్, సిరిసిల్ల మల్లేష్, జెరిపోతుల దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణయ్య ఆశయసాధనకు పునరంకితమవుదాం : బాగం



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** సుదీర్ఘ కాలం ప్రజా సమస్యల పరిష్కారం కోసం, కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు పనిచేసిన హనుమంతు కృష్ణయ్య ఆశయ సాధన కోసం పునరంకితం కావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. హనుమంతు కృష్ణయ్య 20వ వర్థంతి మంగళవారం కామంచికల్‌లో నిర్వహించారు. హనుమంతు కృష్ణయ్య స్థూపం వద్ద అరుణ పతాకాన్ని ఆవిష్కరించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ తుదిశ్వాస వరకు ఈ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధి కోసం హనుమంతు కృష్ణయ్య కృషి చేశారన్నారు. నిర్బంధాలు ఎదురైనా ఎర్రజెండా నీడనే ముందుకు సాగారన్నారు. ప్రస్తుతం పేద, మధ్యతరగతి ప్రజలను పట్టించుకునే స్థితిలో పాలక వర్గాలు లేవని హేమంతరావు ఆరోపించారు. కార్పొరేట్ సేవలో మోదీ ప్రభుత్వం తరిస్తుందని ఆయన తెలిపారు. దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని ఇది భవిష్యత్తులో దేశంలో అంతర్యుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత జయంతి ఉత్సవాలను వాడవాడలా నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. డిసెంబర్ 26న ఖమ్మంలో చారిత్రిక సభ జరగనుందని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఘన విజయం సాధించడమే అమరులకు మనమిచ్చే సరైన నివాళి అన్నారు. ఈ వర్థంతి కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, జిల్లా కార్యవర్గ సభుయలు పోటు కళావతి, మందడపు రాణి, జిల్లా నాయకులు పుచ్చకాయల కమలాకర్, బోజడ్ల సూర్యం, హనుమంతు కృష్ణయ్య తనయుడు హనుమంతు రాము, బత్తిని సీతారాములు, బొప్పి గాంధీ, కాళంగి మోహన్‌రావు, వెంకటకృష్ణారావు, ఎస్‌కె షాహీన్, యాదాల లింగయ్య, నూర్‌షా, శారద, లక్ష్మి , వెంకటకృష్ణ, ఉపేందర్, శంకర్, సోమ్లాతో పాటు స్థానిక నేతలు పాల్గొన్నారు.



## కుంగ్‌ఫూలో 'నరేంద్ర' విద్యార్థులకు బంగారు పతకాలు

ప్రజాపక్షం/గంగాధరః రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే కుంగ్‌ఫూ పోటీలలో గంగాధర మండలం లక్ష్మి దేవిపల్లిలోని నరేంద్ర విద్యాలయం విధ్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గంగాధర రాజేశం తెలిపారు. సిరిసిల్ల జిల్లాలో జరిగిన స్పార్క్ కుంగ్‌ఫూ అకాడమీ ఇండియా ఆద్వర్యంలో కరాటే పోటీలలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగానరేంద్ర విద్యాలయం నుంచి ఆరవ తరగతి విద్యార్థులు ఎస్.నందిత్, పి.తేజ గోల్డ్‌మెడల్ సాధించగా ఎ.ఆశీస్ కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. కరెస్పాండెంట్ జి.గోపాల్‌రెడ్డి, కరాటే మాస్టర్ విష్ణు, అధ్యాపక బృందంఅభినందించారు.

## జగిత్యాల బిడ్డల ప్రతిభ



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో జగిత్యాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగిన కరాటే రాష్ట్ర స్థాయి పోటీలు జరుగగా పట్టణానికి చెందిన కరాటే మాస్టర్, పోలీస్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు నేతృత్వంలో పాల్గొన్న విద్యార్థులు 12 మంది బంగారు పతకాలు సాధించారు.వెంకటేశ్వర్లు తో పాటు విద్యార్థులను పలువురు అభినందించారు.

## అంజిరెడ్డికి ఓటు వేయండి



ప్రజాపక్షం/చొప్పదండిః బిజెపి బలపరిచిన కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మె ల్సీ అభ్యర్థి అంజిరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని బిజెపి కరీంనగర్ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యనారాయణ కోరారు. మంగళవారం చొప్పదండి పట్టణంలో అధ్యక్షుడు చిల్ల శ్రావణ్ ఆద్వర్యంలో పలు వార్డులలో బిజెపి నాయకులు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గతంలో బిఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ఏనాడూ నిరుద్యోగులు, పట్టభద్రుల పక్షాన నిలవలేదన్నారు. వారి పక్షాన పోరాడిన బిజెపిని ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికిగుణపాఠంచెప్పాలన్నారు.గుండేటి శివశంకర్, జిట్ట కుమార్, తాదూరి రామకృష్ణ, అనుమండ్ల కోటేష్, అర్ధవెల్లి శ్రీనివాస్, స్వర్గం కళ్యాణ్, గంగు సంపత్, జాగిరి రాజేందర్, దూస రాజులున్నారు.

## నరేందర్‌రెడ్డి గెలుపే లక్ష్యం




ప్రజాపక్షం/సుల్తానాబాద్ : ఎమ్మెల్సీ ఎలక్షన్స్‌లో పార్టీ బలపరిచిన అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేసే కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని నాయకులకు కార్యకర్తలకు పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు పిలుపునిచ్చారు.సుల్తానాబాద్ పట్టణ కేంద్రంలో మంగళవారం యశోద నరహరి ఫంక్షన్ హాల్‌లోఉమ్మడి మెదక్, నిజామాబాద్,ఆదిలాబాద్, కరీంనగర్‌పట్టభద్రులనియోజకవర్గకాంగ్రెస్ఎమ్మెల్సీ అభ్యర్థి, ఆల్ఫోర్స్ వూట్కూరి నరేందర్ రెడ్డి గెలుపు కోసం సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి మండలాల్లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టభద్రులతో ఎమ్మెల్యే విజయ రమణారావు సమీక్షా సమావేశం నిర్వహించి దిశ నిర్దేశం చేశారు.జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్, సుల్తానాబాద్ మార్కెట్ చైర్మన్ మినుపల ప్రకాష్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దానాయక్ దామోదర్ రావు,పట్టణ అధ్యక్షులు అబ్బాయి గౌడ్,మండల అధ్యక్షులు చిలుక సతీష్, ఎలిగేడు మండల అధ్యక్షులు సమా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం ముట్టడి



ప్రజాపక్షం/నిజాంసాగర్ : మహమ్మద్ నగర్ మండలంలోని తెల్గాపూర్ గ్రామస్తులు మంగళవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముట్ట డించారు. గ్రామశివారులోని బొందల గడ్డ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జా చేసుకుంటున్నారనిఆరోపిస్తూ తహసిల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అసైన్మెంట్ భూమిని నాయకులు కబ్జా చేసుకోవడంపై గ్రామస్తుల అభ్యంతర వ్యక్తం చేశారు. కబ్జాలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకొని బొందల గడ్డకు కేటాయించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## పోలీసుల కస్టడీలో భూ ఆక్రమణ నిందితులు



ప్రజాపక్షం/కరీంనగర్‌ప్రతినిధిః కరీంనగర్ కట్టరాంపూర్‌కు చెందిన సర్వే నెంబర్ 954లో నకిలీ ధ్రువ పత్రాలు సృష్టించి తప్పుడు హద్దులు చూపుతూ అసలు యజమాని అయిన బాధితుడి భూమిని పలువురికి విక్రయించిన ఘటనలో 13 మందిపై కేసు నమోదైన విషయం తెలిసిందే. కాగా వారిలో ప్రధాన నిందితులైన నలుగురు కరీంనగర్ మొగ్దుంపూర్‌కు చెందిన బల్మూరి రమణారావు, కరీంనగర్ గణేషనగర్‌కు చెందిన దాసరి సంజీవరెడ్డి, దాసరి బుచ్చి మల్లారెడ్డి, కరీంనగర్ క్రిస్టియన్ కాలనీకి చెందిన మొహమ్మద్ బషీర్‌లను కరీంనగర్ వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ బి.కోటేశ్వర్ ఈ నెల 14న అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండు విధించగా కరీంనగర్ జైలుకు తరలించారు. అయితే ఈ కేసుకు సంబంధించి మరింత సమాచారం సేకరించేందుకు అందులో ముగ్గురు నిందితులను కరీంనగర్ మొగ్దుంపూర్ గ్రామానికి చెందిన బల్మూరి రమణారావు, కరీంనగర్ గణేష్ నగర్‌కు చెందిన దాసరి సంజీవరెడ్డి, కరీంనగర్ క్రిస్టియన్ కాలనీకి చెందిన మొహమ్మద్ బషీర్‌లను మంగళవారం పోలీసు కస్టడీకి తీసుకుని నిందితుల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించిన పలు కీలక డాక్యుమెంట్లను కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్‌పెక్టర్ కోటేశ్వర్, ఎస్సై రాజన్నస్వాధీన పరుచుకున్నారు.

# టెన్త్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

### కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః రానున్న పదవ తరగతి పరీక్షల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విధ్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. పదవ తరగతి పరీక్షలకు సన్నద్ధతపై మంగళవారం మండల విద్యాధికారులతో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం పదవ తరగతి డ్రాప్ అవుట్ అయిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. వారికి అవసరమైన స్టడీ మెటీరియల్ అందించాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేకంగా మాట్లాడి పరీక్షలు పూర్తయ్యే వరకు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని కోరాలన్నారు. నాలుగు మోడల్ ప్రశ్నపత్రాలను ప్రత్యేకంగా తయారు చేసి విద్యార్థులతో ప్రాక్టీస్ చేయించాలని ఎంఇఒలకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇందుకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని ఎంఇఒలను ఆదేశించారు. ఫ్యాన్లు, లైట్లు, తాగునీరు వంటి వసతులు ఏర్పాటు చేయాలన్నారు. సాయంత్రం విద్యార్థులు అలసిపోకుండా స్నాక్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల విద్యాధికారులు ప్రభుత్వ హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల చదువును పర్యవేక్షించాలన్నారు. హాస్టల్‌లోని విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించాలని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్ రెడ్డి, సైన్స్ అధికారి జైపాల్ రెడ్డి, మండల విద్యాధికారులున్నారు.

## మ్యాథమెటిక్స్‌లో కరీంనగర్ విద్యార్థి ప్రపంచ రికార్డు



ప్రజాపక్షం/కరీంనగర్ః కరీంనగర్‌కు చెందిన 12 సంవత్సరాల మనీష్‌రావు జ్ఞాపకశక్తిలో అద్భుత ప్రతిభ కనబరిచి మ్యాథమెటిక్స్ స్క్వేర్స్ అండ్ క్యూబ్స్ రెండు వందల వరకు జ్ఞప్తికి ఉంచుకుని కంఠత చెప్పి ప్రపంచ రికార్డు సాధించారు. కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇంటర్నేషనల్ జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్స్‌ను ప్రధానోత్సవం చేశారు. ప్రముఖ మెమరీ కోచ్‌మెమరీ అండ్ సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ డా.వేణు కుమార్ మాట్లాడుతూ 2025 సంవత్సరానికి గణిత శాస్త్రం ప్రకారం ప్రాముఖ్యత ఉందని, 2025 పర్ఫెక్ట్ స్క్వేర్ (45X45= 2025), ఒకటి నుంచి తొమ్మిది గల సంఖ్యలన్నింటినీ కలిపితే వాటి మొత్తం 2025 అవుతుందని పేర్కొన్నారు. కావున ఈ 2025కున్న ప్రత్యేక గుర్తింపును తెలియజేస్తూ 200 వరకు గల అన్ని అంకెల స్క్వేర్స్, క్యూబ్స్ కంఠత చెప్పి ఇంటర్నేషనల్ రికార్డును సొంతం చేసుకున్నట్లు తెలిపారు. మనీష్ స్థానిక వివేకానంద సిబిఎస్ఈ స్కూల్‌లో ఏడవ తరగతి చదువుతున్నారని తెలిపారు. ఈ ప్రపంచ రికార్డుతో పాటు నేషనల్ సూపర్ మెమరీ చాంప్ టైటిల్‌ని సైతం దక్కించుకున్నట్లు తెలిపారు. తమ తనయుడు ఇంత గొప్ప విజయం సాధించడం పట్ల తల్లిదండ్రులు శ్రీనివాస్ రాధ ఆనందం వ్యక్తం చేశారు. తమ బాలుడికి మ్యాథ్స్‌లో ఉన్న ఆసక్తిని గుర్తించి చేంజ్ మెమరీ అకాడమీలో శిక్షణ ఇప్పించినట్లు తెలిపారు. చేంచ్ మెమరీ అకాడమీ ట్రైనర్స్ తిరుపతి, హరీష్ కుమార్, అఖిల్ తమ విద్యార్థి సాధించిన విజయానికి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రసన్నహరికృష్ణకు గౌడ సంఘాలు మద్దతు



ప్రజాపక్షం/కరీంనగర్ః కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల అభ్యర్థి డాక్టర్ పులి ప్రసన్న హరికృష్ణకు గౌడ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లోవిలేకరుల సమావేశంలో సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోడూరి పర్శరాం గౌడ్,గణగోనిసత్యనారాయణ, ముత్యం శంకర్‌లతో పాటు గౌడ అఫీషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు అమరగాని నర్సయ్య గౌడ్, ఉపాధ్యక్షులు కోడూరి మహేందర్ గౌడ్, కోశాధికారి పర్కాల మురలి గౌడ్ మాట్లాడారు. పట్టభద్రుల ఉన్నతి కోసం, నిరుద్యోగుల ఉపాధి అవకాశాలు కల్పించడానికి తన 19 సంవత్సరాల ఉద్యోగ జీవితానికి రాజీనామా చేసి ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ప్రసన్న హరికృష్ణ గెలుపు కోసం గౌడ సంఘాలు కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో చొప్పదండి మండలం కాట్నపల్లి గ్రా మంలో తల్లిదండ్రులు చనిపోయి అనాథలైన ఇద్దరు అమ్మాయిలకు దాదాపు మూడు లక్షల రూపాయలు అందజేసిన గొప్ప మనసున్న వ్యక్తి అని ప్రసన్న హరికృష్ణ అని కొనియాడారు. పట్టభద్రుల సమస్యల పట్ల పూర్తి అవగాహన కలిగిన ఆయన అట్టి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారనే నమ్మకం ఉండడం వల్ల గౌడ సంఘాల ద్వారా సంపూర్ణ మద్దతు ప్రకటించినట్లు వెల్లడించారు. పట్టభద్రులు, నిరుద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు, యువత పక్షాన తన గొంతు వినిపించడానికి ఈ ఎన్నికల బరిలో నిలిచిన ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గౌడ సంఘాల నాయకులు పార్వతి నర్సయ్య గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, బుర్ర ముత్తయ్య గౌడ్, వంగ వెంకటయ్య గౌడ్, పంజాల లచ్చయ్య, కోడూరి మహేందర్, మంద పరశురాం గౌడ్, బుర్ర జగదీశ్వర్ గౌడ్, నేరెళ్ల నాగన్న, గడ్డమీది రాజేశం, పంజాల మల్లేశం తదితరులున్నారు.

## వికసిత భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో మైనింగ్ రంగానిది కీలక పాత్ర



ప్రజాపక్షం/రామగిరి : మన దేశాన్ని 2047 నాటికి అగ్రదేశంగా తీర్చిదిద్దేందుకు రూపొందించుకున్న వికసిత్ లక్ష్యాలను చేరుకోవడంలో మైనింగ్ రంగం పాత్ర అత్యంత కీలకమని... ముఖ్యంగా క్రిటికల్ మినరల్స్ రంగంలో గణనీయమైన పురోగతి సాధించాల్సిన అవసరం ఉందని సింగరేణి సీఎండీ ఎన్. బలరామ్ అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిప్రోత్సాహంతో క్రిటికల్ మినరల్స్ అన్వేషణలో ఉన్న అవకాశాలపై సింగరేణి ఆధ్వర్యంలో అధ్యయనానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా మైనింగ్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, బడ్జెట్లో ప్రత్యేక నిధులను కేటాయించడంద్వారా ఈ రంగంపై దృష్టిసారిస్తోందన్నారు. ఇప్పటివరకు ప్రభుత్వరంగ సంస్థలఆధ్వర్యంలోబొగ్గు, ఇనుము తదితర ఖనిజాన్వేషణసాగుతోందని, రానున్న రోజుల్లో క్రిటికల్ మినరల్స్ కు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో "ఖనిజ అన్వేషణ ఆత్మనిర్భర్ వికసిత భారత్ – 2047 వైపు ముందడుగు" అన్న అంశంపై హైదరాబాద్ లో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సద స్సు ముగింపు సమావేశంలోఆయన మాట్లాడారు. లిథియం, కోబాల్ట్, నికెల్ తదితర అరుదైన ఖనిజాలఅన్వేషణ చేపట్టడం ద్వారా భవిష్యత్ టెక్నాలజీ అభివృద్ధికి దోహదపడిన వాళ్లం అవుతామన్నారు.ముఖ్యంగామనదేశాన్ని 2070 నాటికి నెట్ జీరో గా మార్చాలన్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఈ అరుదైన ఖనిజాల అన్వేషణ ప్రస్తుతం అత్యవసరమన్నారు. వీటి కోసం పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ అనుమతుల జారీనివేగవంతంచేయడం ద్వారా ముందడుగు వేయొచ్చన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్‌లాంటి అత్యాధునిక సాంకేతికతలను మైనింగ్లో విస్తృతంగా ఉపయోగించుకోవాలన్నారు. ఎన్ఎండీసీ డైరెక్టర్ (కమర్షియల్) వి.సురేశ్, డైరెక్టర్ (టెక్నికల్), ఎంఈఏఐ హైదరాబాద్ ఛాప్టర్ చైర్మన్ వినయ్ కుమార్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ బి.విశ్వనాథ్,సలహాదారు ఎ.కె.శుక్లా, విశ్రాంత డైరెక్టర్ సత్పతి, ఎన్ఎల్‌సీ విశ్రాంత సీఎండీ సురేంద్ర మోహన్ మాట్లాడారు. సింగరేణి జీఎం(కో ఆర్డినేషన్) ఎస్డి.ఎం.సుభానీ ఉన్నారు.

## కేంద్ర బడ్జెట్‌లో కరీంనగర్‌కు తీవ్ర అన్యాయం



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో కరీంనగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందని, కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు, ఆదానీ, అంబానీలకు అనుకూలంగా ఉందని సిపిఎం, సిపిఐ, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శులు మిల్కూరి వాసుదేవరెడ్డి, సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జూపాక శ్రీనివాస్ విమర్శించారు. పార్టీ కేంద్ర కమిటీ పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా వామపక్ష పార్టీల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో తెలంగాణ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్ర బడ్జెట్ రైతులకు, కార్మికులతో పాటు పేద ప్రజానీకానికి వ్యతిరేకంగా ఉందన్నారు. వ్యవసాయ రంగానికి, ఉపాధి హామీ పథకానికి నిధుల కోత విధించారన్నారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణకు పెద్దపీట వేయాలని కేంద్రం చూస్తోందన్నారు. బీమా రంగంలో 100 శాతం ఎఫ్‌డిఐలు తీసుకురావాలని బడ్జెట్‌లో ప్రవేశపెట్టడం దారుణమన్నారు. ప్రభుత్వ సంస్థల నుంచి రూ.47 వేల కోట్ల వాటాలను ఉపసంహరించుకున్నారని, బీమా రంగాన్ని 100 శాతం ప్రైవేటీకరణ చేయాలని చూస్తోందన్నారు. రైతులకు, ఆహార రంగాలకు ఇచ్చే సబ్సిడీలో సైతం కోత పెట్టారన్నారు. తెలంగాణ నుంచి 8 మంది బిజెపి ఎంపిలు, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా తెలంగాణకు చేసిందేమీ లేదన్నారు. రాష్ట్రానికి ఒక్క రూపాయి సైతం తేలేని అసమర్థులన్నారు. ఇక్కడి నుంచి ఎన్నికైన బిజెపి ఎంపి బండి సంజయ్ కేంద్రమంత్రిగా ఉన్నప్పటికీ జిల్లాకు నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమయ్యాడన్నారు. తక్షణమే నిధులు తెస్తారా? రాజీనామా చేస్తారా? ఆలోచించుకోవాల్సిన అవసరముందన్నారు. కార్మిక, రైతులను విస్మరించిన కేంద్ర బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. తెలంగాణలో ఉన్న వనరులను, ఖనిజ సంపదను కేంద్రానికి అప్పజెప్పాలని ఇక్కడున్న బిజెపి ఎంపిలు చూస్తున్నారన్నారు. జిల్లాకు ట్రిబుల్ ఐటి, ఐఐఎం, నవోదయ సైనిక్ స్కూల్ లాంటి సంస్థలు ప్రకటిస్తారన్న ఆశలకు నిరాశే ఎదురయ్యిందన్నారు. జిల్లా ప్రజలు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న కొత్తపల్లి మనోహరాబాద్, కరీంనగర్ కాజీపేట రైల్వే లైన్ల ఊసే లేదన్నారు. బడ్జెట్‌లో మా నిధులు మేము రాబట్టుకునే విధంగా ప్రజలందరినీ సమాయత్తం చేసి పోరాటాలను ఉధృతం చేస్తామన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులుయు.శ్రీనివాస్,ఎస్.సంపత్, ఎడ్ల రమేస్, కోనేటి నాగమణి, జి.రాజేశం, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, కిన్నెర మల్లమ్మ, కటికనపల్లి బుచ్చన్న యాదవ్, న్యాలపట్ల రాజు, బ్రాహ్మణపల్లియుగేందర్,మచ్చరమేష హేమంత్, రాజు, కె.రాజు, సిపిఐ(ఎంఎల్)జిల్లా నాయకులు జిందంప్రసాద్,ఎం.మారుతి, జి.మల్లేష్, అజయ్, సిపిఎంనాయకులు రాయికంటిశ్రీనివాస్, పున్నం రవి,గజ్జల శ్రీకాంత్, కాంపెల్లి అరవింద్, కాల్వ సురేష్‌యాదవ్,వినయ్,నవీన్, రఘుపతి, సురేష్, రోహిత్, బోగేష్, సన్నీ, మహేందర్ ఉన్నారు.

## సమర్థవంతంగా నిర్దేశిత పనులు

### పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష




ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : నిర్దేశిత పనులను మండలాల్లో ప్రతి అధికారి సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నా రు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఓదెల మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు.ఓదెల మండలం కొలనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొలనూర్, నాంసాని పల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,పోత్కపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వ్యవసాయ సహకార సంఘం, ఓదెల మండల కేంద్రంలోని కేజీబీవీ ,ఎంపిడిఓ , తహసిల్దార్ కార్యాలయం,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లను కలెక్టర్ తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తనిఖీ అనంతరం మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎన్.సి.డి సర్వే పూర్తి చేయాలని అన్నారు. వైద్యశాఖ పరిధిలో చేపట్టే ప్రతి కార్యక్రమం పై ఆశా లకు సంపూర్ణ అవగాహన ఉండాలని అన్నారు. టీబీ లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి ఎక్స్ రే తీయించాలని అన్నారు. ఈ తనిఖీల్లో జిల్లా కలెక్టర్ వెంట తాహసిల్దార్ సునీత,ఎంపీడీవో తిరుపతి, ఎంఈఓ రమేష్, ఏ ఈ పి ఆర్ జగదీష్, మండల వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, ప్రాథమిక ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సంజనేష్ కుమార్ , ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధాకర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పట్టభద్రులంతా నరేందర్‌రెడ్డికి పట్టం కట్టాల్సిందే




ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః కాంగ్రెస్ అభ్యర్థిగా పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి వూట్కూరి నరేందర్‌రెడ్డికి తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా కాంగ్రెస్ బిసి సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ యువతీ యువకులను దృష్టిలో పెట్టుకుని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను తూచ తప్పకుండా పాటిస్తోందన్నారు. గడిచిన సంవత్సర కాలంలోనే కనీవినీ ఎరుగని రీతిలో 56 వేల ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చి మాట నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చి కనీసం ఒక్క డిఎస్సీ నిర్వహించనటువంటి దద్దమ్మ ప్రభుత్వమని, దీనికి తోడు కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి పదేళ్లు కాలం వెళ్లదీసిందన్నారు. ప్రజల ఆకాంక్షలను పకడ్బందీగా అమలు చేస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వూ ట్కూరి నరేందర్‌రెడ్డిని గెలిపిస్తే మరింత ఉత్సాహంతో నిరుద్యోగ యువతీ యువకులకు చేయూతనందిస్తుందన్నారు. జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పురం రాజేశం, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి రామిడి తిరుపతిరెడ్డి, నూనె గోపాల్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బిసి అధికార ప్రతినిధి పోతుగంటి శ్రీనివాస్, పెద్ది శ్రీనివాస్, నాయకులు కొలగాని అనిల్‌లున్నారు.

## సిఎం రేవంత్‌కు మహాశివరాత్రి ఆహ్వానం



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : తెలంగాణ రాష్ట్రంలోనే అతిపెద్ద పుణ్యక్షేత్రం అయిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానంలో ఈ నెల 25 నుంచి 27 వరకు ఎంతో వైభవోపేతంగా నిర్వహించే మహా శివరాత్రి జాతర వేడుకలకు రావాల్సిందిగా కో రుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మం త్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఎంపీ, ఎమ్మెల్యే లకు రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ శాసన సభ్యులు ఆది శ్రీనివాస్, ఆలయ అర్చకులు, అధికారులు మహాశివరాత్రి ఆహ్వాన పత్రికను మంగళవారం అందజేశారు.

# 'బండి' ఎంత 'తొండి' చేసినా ఇరవై ఏళ్లు కాంగ్రెస్‌దే

### బండి సంజయ్‌పై 'సుడా' చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి వ్యాఖ్యలు



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధిః కూట్లో రాయి తీయనోడు ఏట్లో రాయితీసినట్లుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ తీరు ఉందని కరీంనగర్ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మండిపడ్డారు.మంగళవారంకరీంనగర్‌లో ఆయన సిటీ కాం గ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటేసిన కరీంనగర్ ప్రజలకు ఏమీ చేయని బండి సంజయ్ కాంగ్రెస్‌ను ఏ మొహం పెట్టుకుని విమర్శిస్తాడని దుయ్యబట్టారు. నిత్యం వార్తల్లో నిలవడం కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రతి రోజు రాష్ట్ర ప్రభుత్వాన్ని తిట్టడం, సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించడం, మంత్రులపై ఆరోపణలు చేయడం, ఎమ్మెల్యేలను టార్గెట్ చేయకుంటే ఆయనకు పూట గడవని పరిస్థితిగా మారిపోయిందన్నారు. ప్రజా సంగ్రామ యాత్ర పేరుతో బండి సంజయ్ వందలాది మందిని బ్లాక్‌మెయిల్ చేసి ఎమ్మెల్యే టికెట్లు ఇప్పిస్తానని జబర్దస్తీగా కొందరిని టార్గెట్ చేసి డబ్బులు దండుకోవడం వల్లే బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి ఊడిపోయిందని బిజెపిలో జరిగిన ప్రచారం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. దేశంలో కులాల పేరుతో మతాల పేరుతో ప్రజల మధ్య వైషమ్యాలను రగిలించి విభజన రాజకీయాలకు పాల్పడుతున్న బిజెపిని రాష్ట్ర ప్రజలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో 8 మంది బిజెపి ఎంపిలు 8 మంది బిజెపి ఎమ్మెల్యేలు ఉండగా వారిలో ఏ ఒక్కరికీ ఒకరిపై ఒకరికి భరోసా లేదని, వారి మధ్య సఖ్యత కోల్పోయినట్లు కనిపిస్తుందని ఎద్దేవా చేశారు. కేవలం ఉనికి కోసమే బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వంపై గోబెల్స్ ప్రచారానికి తెగబడుతున్నారని దుయ్యబట్టారు. నైతికత లేని వ్యక్తి కాంగ్రెస్ ఎంపిలను, ఎమ్మెల్యేలను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నాడు కెసిఆర్ తెలంగాణను అప్పుల పాలు చేస్తే నేడు రాష్ట్రంపై నరేంద్ర మోడీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని, కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు రావాల్సిన నిధులనుఇవ్వకుండా ఏ ముఖం పెట్టుకుని ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి ఓట్లు అడుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి దేశంలో లక్షలాది మంది ఉద్యోగాలను తొలగించి నేడు పట్టభద్రులను ఓట్లు అడగడం బిజెపికి తగదన్నారు. ముస్లిం మైనార్టీలపై విమర్శలు మాని గెలిపించిన సమాజానికి ఏ విధమైన న్యాయం చేశావో చెప్పాలని డిమాండ్ చేశారు. సర్వే సంస్థలు స్పష్టంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మొదటి ప్రాధాన్యతగా ఓటు వేస్తున్నాయని , కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలవబోతున్నాడని చెబుతున్నాయని తెలిపారు. ఈ అంశాన్ని పసిగట్టి బండి సంజయ్ తన తొండి ప్రయత్నాలతో కాంగ్రెస్, ముస్లింమైనార్టీలపై అవసరమైన విమర్శలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని విమర్శించా రు. రాబోయే 20 సంవత్సరాలు రా ష్ట్రాన్ని కాంగ్రెస్ పరిపాలిస్తుందన్నారు. తాజొద్దీన్, శ్రావణ్ నాయక్, కుర్ర పోచ య్య, డి.రమేష్, దన్న సింగ్, అర్ధ మల్లేశం, భూమాగౌడ్, గంటశ్రీనివాస్,దండిరవి, అస్తపురం రమేష్, నగేష్‌ముదిరాజ్, మసుమ్‌ఖాన్, మెరాజ్, సిరాజ్, ఖలీల్, బషీర్,రాజకుమార్,సుదర్శన్,ఊరడిలత, ముల్కల కవిత, అస్తపురం తిరుమల,తదితరులున్నారు.

# కౌలురైతుల కష్టాలు పట్టించుకునేదెవరు?

**● కౌలురైతులకు రైతు భరోసా.. భరోసాగానే మిగిలిపోయిందా? ● పెరిగిన కౌలు... అప్పుల్లో అన్నదాతలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో రావడానికి ఎన్నికలలో కౌలు రైతులకు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చింది. ఇప్పడు ఆ హామీ హామీగానే మిగిలిపోయింది. రైతు భరోసా భరోసాగానే మిగిలిపోనుంది. ప్రభుత్వం ఖరీఫ్‌లో సన్న వరి రకాలకు క్వింటాలుకు రూ.500 రైతులకు బోనస్‌గా ఇచ్చింది. దీంతో కౌలు ధరలు అమాంతంగా పెరగడంతో ప్రభుత్వం పెట్టుబడి సహాయం ఇవ్వకపోవడంతో వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పుల పాలవుతున్నారు. అందుకే కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారు. మమ్ములను ఆదుకొనెదెవరు అని ప్రశ్నిస్తున్నారు. కౌలు రైతులకు ఇస్తామన్న రైతు భరోసా.. భరోసాగానే మిగిలిపోయిందా...





ప్రజాపక్షం / నందిపేట్ : రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతుల కు ఇస్తామన్న రైతు భరోసా.. భరోసాగానే మిగిలిపోయింది. డబ్బులు ఎప్పుడు ఇస్తుందా అని ఎదురుచూస్తుంటే ప్రభుత్వం ఈ విషయమే మరిచిపోయింది. ప్రభు త్వం అధికారంలోకి వచ్చి సుమారు 14 నెలలు కావస్తున్నా కౌలు రైతులకు రైతు భరోసా గురించి మాటెత్తడం లేదు. కానీ ఉపాధి హామీలో పనిచేస్తున్న భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేలు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం పేరుతో జనవరి నెల 26న (రిపబ్లిక్ దినోత్సవం) సిఎం ఈ పథకాన్ని ప్రారంభించారు. కానీ కౌలు రైతుల గురించి కనీసం మాట ఎత్తలేదు. దీన్ని బట్టి చూ స్తే వారితో ఏమి అవసరం లేదని తెలిసిపోయిందని కౌలు రైతులు బాధను వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతుల కు ఇస్తున్న ప్రాధాన్యత కౌలు రైతుకు ఇవ్వడం లేదని, వ్యవసాయ భూమి ఉన్నవారినే రైతులుగా గుర్తిస్తు కౌలు రైతులను పట్టించుకొనే వారు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో కౌలు రైతులే సగానికి పైగా ఉన్నారు. వందలాది ఎకరాల వ్యవసాయ భూ ములు ఉన్న రైతులు, భూస్వాములు పంటలు పండించకుండ వాటిని కౌలుకు ఇస్తున్నారు. చాలా గ్రామాలలో కౌలుకు డిమాండ్ ఉంది. చాలా మంది పేద రైతులకు భూములు లేవు. కొందరికి భూములు ఉన్నా అందులో పంటలు పండవు. బోరుబావులు వేసినా నీళ్ళు పడకపోవడంతో వర్షాధారపు పంటలు వేసుకుంటారు. ఆ పంట చేతికి వస్తుందన్న నమ్మ కం లేదు. అందుకే రైతులు కౌలుకు భూ మిని తీసుకొని పంటలు పండిస్తున్నారు. ఇవన్నీ బాగానే ఉన్న పెద్ద రైతులు అన్న రేటుకే కౌలు చెల్లించాలి. ప్రస్తుతం రెండు పంటలకు ఎకరానికి ఇరవై వేల నుండి ముప్పై వేల రూపాయలు ముందుగానే చెల్లించి పంటలు పండించుకొంటున్నారు. ఈ యాసంగిలో కౌలు రేట్లు రైతులు అమాంతంగా పెంచారు. పంట పండినా, పండక పోయినా కౌలు చెల్లించాల్సిందే. భూ యజమానులకు ప్రభుత్వం ఇచ్చే రైతు భరోసా, బ్యాంకులో పంట రుణా లు, రైతు బీమా వంటి ప్రభుత్వ పథకాలు వారికే దక్కుతాయి. కౌలు రైతులకు ఇవేమి వర్తించవు. వీరు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తీసుకొని పంటలు వేసుకుంటారు. పంట చీడ పీడల వల్ల దిగుబడి తగ్గినా భూ యజమానులకు సంబంధం లేదు. ఎకరానికి పంట ఖర్చు దుక్కి రెండు సార్లు రెండు వేలు, విత్తనాలు 900950 రూపాయలకు పెంచారు. తూకం మడికి వేయి, పొలం దమ్ము రెండు వేలు, నాట్లువేయడానికి ఆరు వేలు, కాంప్లెక్స్ ఎరువులకు మూడు వేలు, పంట కోయడానికి మూడువేలు, వడ్లు ట్రాక్టర్లో తరలించడానికి వేయి రూపాయలు ఖర్చు అవుతాయి. కౌలుకు ఇరవై నుండి ఇరవై ఐదు వేలు పోతే మిగిలేవి అయిదు నుండి పదివేలు మాత్రమే. కౌలు రైతుల కష్టాలు పట్టించుకొనే వారు లేరు. ప్రభుత్వం రైతు భరోసాలో కౌలు రైతుకు ఎకరానికి పన్నెండు వేలు ఇస్తామని చెప్పింది. కానీ ప్రస్తుతం ఆ విషయమే మరిచిపోయింది. అదే ఉపాధి కూలీలకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తామని నివేదికలు, ఏ గ్రామంలో ఎంత మంది ఉన్నారో వివరాలు సేకరించి, జనవరి 26 ఈ పథకం ప్రారంభించింది. ఎన్నికలలో కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని చెప్పినా వాస్తవ రూపం దాల్చలేదు. కౌలు రైతులు నామ కే పరిమితం అవుతున్నారు. అందుకే ప్రభుత్వం కౌలు రైతులకు ప్రభుత్వ రుణాలు, పథకాలు ఇస్తు రుణమాఫీ, రైతు బీమా వర్తింపచేయాలి. సన్నకారు చిన్నకారు రైతుల మాదిరిగా అన్ని సౌకర్యాలు కల్పించాలి. అప్పుడే వారికి మేలు జరుగుతుంది. ఇచ్చిన హామీని నెరవేర్చవలసిన బాధ్యత ప్రభుత్వం మీద ఉంది. ఏమి చేస్తారో వేచి చూడాలి.

## 20న సిపిఐ నియోజకవర్గ స్థాయి సమావేశం

ప్రజాపక్షం /రామకృష్ణాపూర్ : ఈనెల 20వ తేదీన చెన్నూర్ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని నియోజకవర్గ కార్యదర్శి మిట్టపెల్లి పౌల్ తెలిపారు. రామకృష్ణాపూర్ యూనియన్ కార్యాలయం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 99 వసంతాలు పూర్తి చేసుకుని 100 సంవత్సరాలోకి అడుగుపెట్టిన సందర్భంగా చెన్నూర్ నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించడం జరుగుతుందని ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, సిపిఐ జిల్లా కార్యదర్శి, రామడుగు లక్ష్మణ్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎసిసిడబ్ల్యుయు అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, హాజరవుతారని తెలిపారు.

## కార్మికుల సమస్యలపై ఏఐటియుసి చర్చలు



ప్రజాపక్షం/మందమర్రి : కార్మికుల సమస్యలపై ఏఐటియుసి చర్చలు తీసుకోవడం జరుగుతుందని మందమర్రి ఏరియా ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ అన్నారు. మంగళవారం మందమర్రి పట్టణంలోని వివిసిలో నిర్వహించిన ఏఐటియుసి ప్రతినిధుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో, కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ వినతి పత్రం సమర్పించారు. ప్రధానంగా, కెకె 1 డిస్పెన్సరీ నుండి వివిసి వరకు ఉన్న రోడ్డు గుంతలతో నిండిపోయి ఉందని, ఈ మార్గంలో కార్మికులకు సమస్యలు ఎదురవుతుండగా, రోడ్డు మరమ్మత్తు చేయాలని కోరారు. సిహెచ్‌పి కార్మికులకు కోల్ ట్రాన్స్ పోర్ట్ ఈ మార్గంలో అందజేయడం జరుగుతుందని, ప్రస్తుతం గతుకుల గుంతలతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి అని వారు తెలిపారు. అదనంగా, ట్రేడ్ మెన్లకు టూల్ కిట్స్ అందజేయాలని, వాహన సౌకర్యం కల్పించాలని కోరారు. అవుట్‌సోర్స్ విధులకు వెళ్లే కార్మికులకు వాహన సౌకర్యం, గ్యారేజ్ సెక్షన్ ఏర్పాటు చేయాలని, ఈ సమస్యల పరిష్కారం కోసం యూనియన్ కృషి చేస్తుందని యాక్టింగ్ డివిజనల్ మేనేజర్ కృష్ణారెడ్డి తెలిపారు. ప్రముఖంగా యాజమాన్యంతో చర్చించి ఈ సమస్యలు పరిష్కరించబడతాయని నమ్ముతుంటో, సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కృష్ణారెడ్డి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి బ్రాంచ్ ప్రెసిడెంట్ భీమనాదుని సుదర్శన్, సహాయ కార్యదర్శి సోమిశెట్టి రాజేశం, కంది శ్రీనివాస్, ఆంథోనీ దినేష్, పోరెపెల్లి రాజేశం, వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ తోట వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమేష్

ప్రజాపక్షం/ ఆసిఫాబాద్ : రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు మార్చి 8న జిల్లాలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.వి.రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని జిల్లా కోర్టు భవన సముదాయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో క్రిమినల్, సివిల్, ప్రి లిటిగేషన్, బ్యాంకింగ్, విద్యుత్, భూ సమస్యలు, వివాహం, కుటుంబ సమస్యలు, మోటార్ వాహనాల ప్రమాదాల కేసులు, చెక్ బౌన్స్ ఇతర అన్ని రకాల కేసులను ఇరు పార్టీల మధ్య రాజీమార్గం ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంతో కాలం వృధా కాకుండా ఆర్థికంగా కూడా లాభం జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమ నిర్వహణపై ఈ నెల 20న సాయంత్రం 5 గంటలకు జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయంలో ప్రిన్సిపల్ డిస్ట్రిక్ & సెషన్స్ జడ్జ్ కోర్టు హాల్ లో పోలీసు ఉన్నతాధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

## నిర్మల్ డిపోలో పవర్ ప్రోగ్రామ్..



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : ఆర్‌టిసి ఎండి సజ్జనార్ సూచనల మేరకు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఆధ్వర్యంలో ప్రొజెక్టర్ ద్వారా పవర్ ప్రోగ్రామ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదిలాబాద్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎం(ఎం) ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.ఆర్‌టిసి ఉద్యోగుల్లో నైపుణ్యాన్ని, సృజనాత్మకతను పెంపొందించడానికి ఈ ప్రోగ్రామ్ ఏర్పాటు చేయడం జరిగిందని ఉద్యోగులు ఇది నాది ఈ సంస్థ నాది అని పనిచేయాలని, అప్పుడే మనం తృప్తి చెందుతామని,ప్రతి ఒక్క ఉద్యోగి స్వంత పనిలాగా భావించి పనిచేయాలని, ప్రయాణికుల మన్ననలు పొందాలని,ప్రయాణీకుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని,ప్రయాణికుడు మనపై ఆధారపడి లేదని ప్రయాణికుని పైనే మనం ఆధారపడి ఉన్నామని అందరూ ఆలోచించాలని డిప్యూటీ ఆర్.ఎం(ఎమ్) ప్రవీణ్ కుమార్ తెలిపారు.డిపోమేనేజర్ ప్రతిమారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రోగ్రామ్ ద్వారా అందరూ నేర్చుకోవలసింది. ఎంతో ఉందని,ఈ క్లాసులు రోజు ఉంటాయని,మన డిపోలో ఉన్న ప్రతి ఉద్యోగి ఈ క్లాసులకు రావాలని ప్రతి రోజు ఉదయం 9గం లనుండి సాయంత్రం 5 గం.ల వరకు నిర్వహస్తామని తను తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్,ఏ,ఈ(ఎం) నవీణ్ కుమార్,ఉద్యోగులు పాల్గొన్నారు.

## రోడ్డుపై కేజ్‌విల్స్ నడవనీయొద్దు

ఎంఎల్ఏ సుదర్శన్ రెడ్డి

ప్రజాపక్షం/ఎడపల్లి : రోడ్డుపై కేజ్‌విల్స్ నడపకుండా రైతులు చూడాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ నుంచి బోధన్ వెళ్తున్న క్రమంలోఎడపల్లి లో రైతులను కలిసి ఆయన మాట్లాడారు. వరి పంట పొలాలు ఏ దశలో ఉన్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో తమ ప్రభుత్వం రేషన్ డీలర్ దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇచ్చేందుకు సుముఖంగా ఉందన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తమ ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకుంటుందన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని ఇబ్రహీంపూర్ శివారు నుంచి ఏరాజ్‌పల్లి గ్రామం వరకు లక్షల రూపాయాలతో తారు రోడ్డు వేయించినందున ఎడపల్లి గ్రామ ఇబ్రహీంపూర్ శివారు రైతులు పంట పొలాలు అక్కడే ఉన్నందున పంట పొలాల సమయంలో తారు రోడ్డుపై కేజ్‌విల్స్ నడపకుండా చూడాలన్నారు. రోడ్లను కాపాడుకోవాల్సిన బాధ్యత రైతుల పైన ఉందని ఎమ్మెల్యే సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల అభివృద్ధికి పాటుపడే నాయకులను గెలిపించుకోవాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, ఉర్దూ అకాడమీ రాష్ట్ర అధ్యక్షులు తామెర్ బిన్ హుందాన్, మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొబ్బిలి శ్రీనివాస్,రవీందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, రైతులు ఉన్నారు.



## 'నేడు' గజ్వేల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సభ

గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి



ప్రజాపక్షం/గజ్వేల్ : పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా ఈ నెల19 తేదీ బుధవారం రోజున ఉదయం 10 గంటలకు మాజీ ఎమ్మెల్యే, డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో పిఎన్ఆర్ గార్డెన్స్ లో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యకర్తలు, పట్టభద్రుల సమావేశం ఏర్పాటు చేసినట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వంటేరు నరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డితో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి, అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు డాక్టర్ వంశీకృష్ణ, కోఆర్డినేటర్ గుత్తా అమిత్ రెడ్డి ( తెలంగాణ డైరీ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్), మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇన్చార్జి నీలం మధు ముదిరాజ్ తదితర ప్ర ముఖులు హాజరవుతున్నట్లు స్పష్టం చేశారు. దీనిని దృష్టిలో పెట్టుకుని గజ్వేల్ నియోజకవర్గ కార్యకర్తలు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, పట్టభద్రులు ఈ సమావేశానికి విచ్చేసి విజయవంతం చే యాలని కోరారు. ఈ సమావేశంలో వ్యవసాయ మా ర్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నక్క రాములు గౌడ్, మైనార్టీ సెల్ కాంగ్రెస్ జిల్లా నేత సమీర్, నాయకులు గుంటు కు శ్రీను, సుఖేందర్ రెడ్డి, ఉడెం శ్రీనివాస్ రెడ్డి, గాడిపల్లి శ్రీను, జంగం రమేష్ గౌడ్, డప్పు గణేష్, దయా ల యాదగిరి, అహ్మదీపూర్ బాలాగౌడ్, శ్రావణ్, మహేష్, కొడంకడ్ల బాలు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డు కార్యాలయం ఎదుట పసుపు రైతుల ఆందోళన

● పసుపుకు కనీసం మద్దతు ధర చెల్లించాలని డిమాండ్

● దళారులు వ్యాపారులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని రైతుల ఆవేదన

ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు కార్యాలయం ఎదుట మంగళవారం పసుపు రైతులు ఆందోళన చేపట్టారు. పసుపుకు కనీస మద్దతు ధర చెల్లించాలని దళారులు రైతులు కుమ్మకై రైతులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మార్కెట్ యార్డు సిబ్బంది వ్యాపారులకు తొత్తుగా మారి పని చేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ యార్డులో మార్కెటింగ్ డైరెక్ట్ పర్చేసింగ్ సెంటర్ ఏర్పాటు చేయకపోవడమే రైతులను మోసం చేయడానికి నిదర్శనమన్నారు. పసుపు సీజన్ ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా కూడా సెంటర్ ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. రైతులకు మద్దతు ధర వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరలు నిర్ణయిస్తున్నారని, మార్కెట్‌లో వచ్చిన పసు పు నాణ్యత లేదని వంక చూపుతూ రైతు నిండా ముంచుతున్నారని ఆ వేదన వ్యక్తం చేశారు. కనీసం రూ.15 వేలు వస్తేనే రైతులు బాగు పడుతారని మద్దతు ధర వచ్చేలా పోరాడుతామని హెచ్చరించారు. ఆందోళ న కార్యక్రమంలో రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకులు ప్రభాకర్ పాల్గొన్నారు.


## కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తరపున ఎన్నికల సన్నాహక సమావేశంలో నిర్మల జగ్గారెడ్డి

ప్రజాపక్షం/ సదాశివపేట : టిజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యములో కాంగ్రెస్ ఎమ్మెల్సీ కాండేట్ తరపున ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిని మొదటి ప్రధాన్యత నిచ్చి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల జగ్గారెడ్డి, సిడిసి చైర్మన రాంరెడ్డి, ఆత్మ చైర్మేన్ వై ప్రభు ,నియోజక వర్గ ఇన్చార్జి అంజనేయులు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సిద్దన్న మాజీ కౌన్సిలర్‌లు వివిధ గ్రామాల నాయకులు ,కార్యకర్తలు వివిధ వార్డ్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.



## తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

**● ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ ఎ.శరత్ ● కలెక్టర్‌తో కలిసి అధికారులతో సమీక్ష**



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : రానున్న వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తుగానే ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి డాక్టర్ ఎ.శరత్ సూచించారు. జిల్లావ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ తాగునీటి సరఫరాకు అంతరాయం తలెత్తకుండా అంకిత భావంతో పని చేయాలని, నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షించాలని హితవు పలికారు. మంగళవారం ఆయన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి జిల్లాలో మంచినీటి సరఫరా పరిస్థితిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ఏడాది జిల్లాలో ఎక్కడ కూడా నీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారని అధికారులను అభినందించారు. ఈ ఏడాది కూడా వేసవి సీజన్ ముగిసేంత వరకు అదే స్ఫూర్తితో పని చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఏదైనా నివాస ప్రాంతంలో నీఇట ఎద్దడి ఏర్పడే అవకాశాలున్నట్లు గమనించిన వెంటనే ముందస్తుగానే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. బోరు బావుల మరమ్మతులు చేపట్టే మెకానిక్కులందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, బోరు చెడిపోయిందన్న సమాచారమందిన వెంటనే గంటల వ్యవధిలోపు మరమ్మతులు పూర్తి చేయించి దాహార్తి సమస్య ఏర్పడకుండా సత్వరమే పనులు జరిపించాలన్నారు. తాగునీటి సరఫరాను మెరుగుపర్చేందుకు చేపడుతున్న పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించాలన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఏర్పడితే గ్రామపంచాయతీలకు చెందిన ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా ఏర్పాట్లు చేయాలని, అవసరమైతే పక్క జీపీకి చెందిన ట్యాంకర్‌ను కూడా వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించేలా గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. మండల ప్రత్యేకాధికారులు వారం వారం క్రమం తప్పకుండా మండలాల్లో పర్యటిస్తూ పర్యవేక్షణ జరిపేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పట్టణాలతో పాటు ఆయా మండలాలకు తాగునీటిని అందించే జలాశయాల్లో సరిపడా నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ఈ నేపథ్యంలో అన్ని మండలాల్లో ఎంపిడిఒలు, ఎంపిఒలతో కూడిన క్లస్టర్ బృందాలు నిరంతరం నీటి సరఫరాను పర్యవేక్షించేలా చూస్తామన్నారు. నీటి ఎద్దడి నెలకొనేందుకు అవకాశమున్న ప్రాంతాలలో ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటి సరఫరా చేసేలా ప్రణాళికలు రూపొందిస్తామని జిల్లా ప్రత్యేకాధికారి దృష్టికి తెచ్చారు. జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరా సజావుగానే జరుగుతోందని, వేసవి సీజన్‌లో ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే, తక్షణమే స్పందించిచ ర్యలు చేపట్టేలా అధికారులను క్షేత్రస్థాయిలో సిబ్బందిని అప్రమత్తంగా ఉంచుతామన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమీషనర్ దిలీప్‌కుమార్, మిషన్ భగీరథ ఆర్‌డబ్ల్యుఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సాధారణ ఎన్నికల కంటే ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యేకం

ఎన్నికల అబ్జర్వర్ మహేష్ దత్ ఎక్కా



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి : సాధారణ ఎన్నికలకు ఎమ్మెల్సీ, గ్రాడ్యుయేట్ టీచర్ ఎన్నికలకు ఎంతో తేడా ఉంటుందని , నిజామాబాద్ , అదిలాబాద్, మె ద క్ , కా మా రె డ్డి జిల్లాల టీచర్స్ ఎన్నికల అబ్జర్వర్ మహేష్ దత్ ఎక్కా అన్నారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్లోని సమావేశ మందిరం లో జిల్లాలోని ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారు లు ఎఆర్ఒ అధికారులతో ఎన్నికల విధులపై సమీ క్ష సమావేశాన్ని నిర్వహించారు. అంతకు ముం దు తారా డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని ,అంబేద్కర్ స్టేడియంలోని డిఆర్సి సెంటర్‌ను జి ల్లా క్రాంతివల్లూరుతో కలిసి పరిశీలించారు. సమీ క్ష సమావేశం సందర్భంగా అధికారులను ఉద్దేశిం చి ఆయన మాట్లాడారు. సాధారణ ఎన్నికలకు , ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రత్యేకత ఉంటుందన్నారు. ప్రతిసారి జరుగుతున్న ఎన్నికల్లో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని అన్నారు. ఎస్‌పిటి ఎస్ఎఫ్‌టి ఎస్ఓటి, ఎన్‌సిసిటిలంల ఏర్పాటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ఎస్‌టి, ఎఫ్ఎస్‌టి, సర్వేలైన్స్ టీమ్ ఏర్పాటు పనితీరు వివరాలను కలెక్టర్ వల్లూరి క్రాంతి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులకు హాజరు కాని ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు అందజేసి సస్పెండ్ చేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఎన్నికల కు సంబందించి మొదటి ,రెండవ రాండమైజేషన్ పూర్తి చేయడం జరిగిందని ,మూడవ రాండమైజేషన్ కూడా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు అభ్యర్థులు ఉన్నత విద్యావంతులని, ఎన్నికల విధులను సాధారణ ఎన్నికల్లో కాకుండా ఇప్పుడు లేదు . జాగ్రత్త వ్యవహరించాలని ఎన్నికల నిర్వహణను చాలేంజింగ్‌గా తీసుకొని పకడ్బందీగా ఎన్నికల విధుల నిర్వర్థించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి జిల్లా ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా అన్ని రకాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి ,అదనపు ఎస్పీ సంజీవరావు ,ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లాలోని నోడల్ అధికారులు ఆర్ఓలు ,తహసీల్దార్లు, ఎన్నికల విభాగ అధికారులు సంబందిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలి



ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి : ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలను గుర్తించి తక్షణమే వాటిని తొలగించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. సమీకృత రెసిడెన్సియల్ విద్యాసంస్థలు, వసతిగృహ సముదాయాల నిర్మాణాల కోసం ఆయా ప్రదేశాలలో అందుబాటులోని ప్రభుత్వ స్థలాలను గుర్తించేందుకు గాను కలెక్టర్ మంగళవారం నగర శివారులోని నాగారం, గుండారం ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా గుండారం గ్రామంలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించిన సందర్భంగా పలు ఆక్రమణలు కలెక్టర్ గమనించారు. వెంటనే వాటిని తొలగించాలని, ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా పకడ్బంధీ చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పై రెండు ప్రదేశాలలోనూ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ నిర్మాణానికి అనువైన పరిస్థితులు అనుకూల వాతావరనం తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. ఎంత విస్తీర్ణంలో స్థలం అందుబాటులో ఉంది. రాకపోకలకు అనువుగా రోడ్డు మార్గం అందుబాటులో ఉందా అని పరిశీలన జరిపారు. పరిసర ప్రాంతాలలో నెలకొన్న పరిస్థితులపై అధ్యయనం చేశారు. సమగ్ర వివరాలతో ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, తహసీల్దర్ బాలరాజు, సంబంధిత అధికారులు ఉన్నారు.

## స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీకి భూమిని గుర్తించండి : రాహుల్ రాజ్

ప్రజాపక్షం/పాపన్నపేట : మెదక్ జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి భూమిని గుర్తించే ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పాపన్నపేట మండలంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. ముందుగా పాపన్న పేట మండలంలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి భూమికి సంబంధించి వివిధ ప్రదేశాలను సంబంధిత ఆర్డీవో, రమాదేవి, ఇంచార్జ్ తహసిల్దార్ మహేందర్ గౌడ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ నిర్మాణానికి అవసరమైన 10 నుండి 15 ఎకరాల భూమి ని గుర్తించేందుకు పాపన్నపేట మండలంలో తమ్మాయిపల్లి గ్రామంలో మరియు పాపన్నపేట గ్రామంలోని భూమిని చూడడం జరిగిందని తెలిపారు. అనువైన భూమికి సంబంధించి భూ పరిపాలన విభాగం హైదరాబాద్ వారికి ప్రతి పాదనలు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఆర్డిఓ రమాదేవి, ఇంచార్జి డిప్యూటీ తహసిల్దార్ మహేందర్ గౌడ్, సంబంధిత రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీ కార్యదర్శి సస్పెండ్

ప్రజాపక్షం/కంది : ఇచ్చిన విధులను సరిగా నిర్వర్తించకుండా నిధులు దుర్వినియోగం చేసినందుకు కంది మండలం తూనికల తాండ పంచాయతీ కార్యదర్శి రేఖను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి ఉత్తర్వులు జారీ చేసారు. సదాశివపేట మండలం వెల్టూర్ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన సమయంలో రూ.4లక్షలు దుర్వినియోగమైనట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పుస్తకాల నిర్వహణలో కూడా నిర్లక్ష్యం వహించినట్లు తెలిపారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి



ప్రజాపక్షం/సారంగాపూర్ : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని డిఇఒ రామారావు ఉపాధ్యాయులను ఆదేశించారు.మంగళవారం సారంగాపూర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను తనిఖీ చేశా రు. పాఠశాల పరిసారాలు పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు.పదో తరగతి ఫలితాల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించి 100 శాంతి ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు.

## క్రీడ

# నేటి నుంచే మెగా టోర్నీ

### దుబాయ్‌లో భారత్ రికార్డ్




ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025కి రంగం సిద్ధమైంది. మరికొన్ని గంటల్లో ఈ మెగా టోర్నీకి తెర లేవనుంది. డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో పాకిస్థాన్ ఈ టోర్నీకి ఆతిథ్యం ఇస్తున్న విషయం తెలిసిందే. బుధవారం పాకిస్థాన్‌న్యూజిలాండ్ మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో ఈ టోర్నీ ప్రారంభం కానుంది. ఆటగాళ్ల భద్రతా కారణాలతో పాకిస్థాన్‌లో పర్యటించేందుకు భారత్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేలా ఐసీసీ.. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ)ని ఒప్పించింది. దాంతో భారత్ మ్యాచ్‌లన్నీ దుబాయ్ వేదికగానే జరగనున్నాయి. ఒకవేళ భారత్ సెమీఫైనల్, ఫైనల్ చేరితే ఆ మ్యాచ్‌లు కూడా దుబాయ్ వేదికగానే జరగనున్నాయి.

**రేపు భారత్ తొలి పోరు..**

ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో జరిగే తొలి మ్యాచ్‌తో టీమిండియా తమ క్యాంపైన్‌ను ప్రారంభించనుంది. ఫిబ్రవరి 23న పాకిస్థాన్‌తో హైటల్టేజ్ మ్యాచ్ ఆడనున్న టీమిండియా.. మార్చి 2న న్యూజిలాండ్‌తో చివరి లీగ్ మ్యాచ్ ఆడనుంది. 2013లో చివరిసారిగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన భారత్.. 2017లో తృటిలో టైటిల్ చేజార్చుకుంది. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్లో కోహ్లి సారథ్యంలోని టీమిండియా ఓటమిపాలైంది. ఈసారి పటిష్టంగా ఉన్న టీమిండియా.. ఆ ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలనుకుంటుంది.

**ఒకే వేదికలోనే భారత్ మ్యాచ్‌లు..**

ఈ టోర్నీలో టీమిండియా విజయం సాధించాలంటే వరుసగా ఐదు మ్యాచ్‌లు గెలవాలి. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లు గెలవడంతో పాటు సెమీస్, ఫైనల్ గెలిస్తేనే టైటిల్ దక్కుతుంది. ఒక్క మ్యాచ్‌లో ఓడినా టోర్నీ నుంచి నిష్క్రమించాల్సిందే. అందుకే ఛాంపియన్స్ ట్రోఫీని నాకౌట్ టోర్నీ అంటారు. భారత్ మ్యాచ్‌లన్నీ దుబాయ్‌లోని ఒకే వేదికగా జరగనుండటం కలిసొచ్చే అంశం. ఇతర జట్లలా ప్రయాణం చేయాల్సిన అవసరం లేదు. పిచ్ కండిషన్స్‌ను రీడ చేయాల్సిన పరిస్థితి ఉండదు. ఒకసారి అలవాటు పడి లీగ్ దశలో మెరుగ్గా రాణిస్తే.. సెమీస్, ఫైనల్లో టీమిండియాకు దుబాయ్ హోమ్ గ్రౌండ్‌లా మారనుంది.

**టీమిండియా ట్రాక్ రికార్డ్ సూపరో సూపర్..**

ఇక దుబాయ్‌లో టీమిండియాకు మెరుగైన రికార్డ్ ఉండటం కలిసొచ్చే అంశం. మూడు ఫార్మాట్లలో కలిపి ఇక్కడ మొత్తం 15 మ్యాచ్‌లు ఆడిన టీమిండియా 10 విజయాలతో పాటు 4 పరాజయాలను నమోదు చేసింది. మరో మ్యాచ్ ఫలితం తేలకుండా ముగిసింది. వన్డేల్లో అయితే టీమిండియా ఒక్క మ్యాచ్ కూడా ఓడలేదు. దుబాయ్‌లో ఇప్పటి వరకు 6 వన్డేలు ఆడిన టీమిండియా ఐదింటిలో గెలిచింది. ఒక మ్యాచ్ టై అయ్యింది. అది కూడా 2018 ఆసియా కప్‌లో అఫ్గానిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో స్కోర్లు టై అయ్యాయి.

**అతనే టాప్ బౌలర్..**

దుబాయ్ వేదికగా అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్లలో మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతను 68.40 సగటుతో 342 పరుగులు చేశాడు. ఇందులో 2 సెంచరీలు ఉన్నాయి. ఆ తర్వాత రోహిత్ 105.66 సగటుతో 317 పరుగులు చేశాడు. ఇందులో సెంచరీతో పాటు 2 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. దుబాయ్ గడ్డపై అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లలో కుల్దీప్ యాదవ్ టాప్‌లో ఉన్నాడు. అతను 4.08 ఎకానమీతో కుల్దీప్ యాదవ్ 10 వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా 2018 ఆసియా కప్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 4/29 అత్యుత్తమ బౌలింగ్ గణంకాలు నమోదు చేశాడు.

## జెండా వివాదంపై బిసిసిఐ ఫైర్!



ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ప్రారంభానికి ముందు చోటు చేసుకున్న జెండా వివాదంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) స్పందించింది. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు(పీసీబీ) తీరును తప్పుబట్టింది. మిగతా జట్ల తరహాలోనే భారత జెండాను కూడా ఎగరవేయాలని బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా డిమాండ్ చేశారు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇస్తున్న పాకిస్థాన్ ఈ మెగా టోర్నీ ప్రారంభానికి ముందు వివాదంలో చిక్కుకుంది. ఈ టోర్నీలో పాల్గొంటున్న దేశాల జెండాలను కరాచీ స్టేడియంతో పాటు లాహోర్‌లోని గడాఫీ స్టేడియం పైకప్పుపై ఎగరవేసిన పీసీబీ.. భారత త్రివర్ణ పతకాన్ని మాత్రం విస్మరించింది. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్ కావడంతో భారత అభిమానులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. పీసీబీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పాకిస్థాన్ తన నీచ బుద్ధిని బయటపెట్టుకుందని మండిపడ్డారు.

**పాక్‌లో పర్యటించనప్పుడు జెండా ఎందుకు?**

ఈ టోర్నీ కోసం భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించకపోవడంతోనే పీసీబీ జెండాను ఎగరవేయలేదని ఆ దేశ నెటిజన్లు, జర్నలిస్ట్‌లు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పీసీబీ కూడా స్పందించింది. 'ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు ఆడేందుకు పాకిస్థాన్‌కు భారత్ రావట్లేదు. కరాచీ, రావల్పిండి, లాహోర్ స్టేడియాల్లో మ్యాచ్‌లు ఆడుతున్న జట్ల జెండాలను మాత్రమే ఎగరవేశాం. భారత్ తన మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడనుంది. బంగ్లాదేశ్ కూడా ఇంకా పాకిస్థాన్‌కు రాలేదు. ఆ జట్టు తమ తొలి మ్యాచ్‌ను భారత్‌తో ఆడనుంది. కాబట్టి భారత్, బంగ్లాదేశ్ జెండాలను ఇంకా ఎగరవేయలేదు. పాకిస్థాన్‌కు వచ్చిన మిగతా జట్ల జాతీయ పతకాలను మాత్రమే ఎగరవేసాం. ఈ జెండాల గురించి పీసీబీ అధికారికంగా స్పందించాల్సిన అవసరం లేదు.'అని ఆ బోర్డు వర్గాలు మీడియాకు తెలిపాయి.

## రజనీకాంత్‌తో బుట్ట బొమ్మ స్పెషల్ సాంగ్.!

సూపర్ స్టార్ రజనీకాంత్ తన అప్‌కమింగ్ సినిమాలతో ప్రస్తుతం ఫుల్ బిజీగా గడుపుతున్నాడు. ఇప్పటికే జైలర్–2 అనౌన్స్‌మెంట్ ఇచ్చిన తలైవా మరోవైపు లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' అనే చిత్రంలో నటిస్తున్నాడు. ఈ సినిమాను సన్ పిక్చర్స్ నిర్మిస్తుండగా.. నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, చౌబిన్ సాహిర్, శృతి హాసన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తమిళ చిత్రసీమలో ఉన్న టాప్ దర్శకుల్లో ఒకరైన లోకేష్ కనగరాజ్‌తో రజనీకాంత్ జోడీ కడుతుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. గోల్ స్మగ్లింగ్‌కు సంబంధించిన కథాంశంగా ఈ చిత్రం రూపొందుతుండగా ఇప్పటికే విడుదలైన ప్రోమో, సాంగ్ ఆకట్టుకుంటున్నాయి. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమాలో ఒక స్పెషల్ సాంగ్ పెట్టబోతున్నట్లు తెలుస్తుంది. ఈ పాట కోసం బుట్ట బొమ్మ పూజా హెగ్డేను తీసుకోబోతున్నట్లు తమిళ చిత్ర సీమలో వార్తలు వస్తున్నాయి. అయితే ఈ వార్తలపై క్లారిటీ రావాల్సి ఉంది. మరోవైపు పూజా హెగ్డే ప్రస్తుతం దళపతి విజయ్‌తో కలిసి జననాయగన్ అనే చిత్రంలో నటిస్తుంది.



## రీల్




## 'హరిహర వీరమల్లు'.. సందేహాలకు నిర్మాత చెక్!

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'హరిహర వీరమల్లు'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఎలాంటి సాలిడ్ అంచనాలు క్రియేట్ అయ్యాయో అందరికీ తెలిసిందే. ఈ సినిమాను దర్శకుడు జ్యోతికృష్ణ డైరెక్ట్ చేస్తుండగా ప్రముఖ నిర్మాత ఏఎం.రత్నం ప్రొడ్యూస్ చేస్తున్నారు. అయితే, ఈ సినిమా రిలీజ్ డేట్‌ని మేకర్స్ ఇప్పటికే లాక్ చేశారు. కానీ, ఈ మూవీ అనుకున్న రిలీజ్ డేట్‌కు విడుదల అవుతుందో లేదో అనే సందేహం సినీ సర్కిల్స్‌లో నెలకొంది. దీంతో ఈ సినిమా రిలీజ్ మరోసారి వాయిదా పడే ఛాన్స్ ఉందనే టాక్ వైరల్ అయ్యింది. అయితే, ఈ చిత్ర రిలీజ్ డేట్‌పై నెలకొన్న సందేహాలకు నిర్మాత ఏఎం.రత్నం చెక్ పెట్టారు. ఈ సినిమాను ఎట్టిపరిస్థితుల్లో అనుకున్న డేట్‌కే రిలీజ్ చేయబోతున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సినిమాకు సంబంధించిన మెజారిటీ వర్క్స్ అయిపోయాయని.. బ్యాలెన్స్ వర్క్ కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసి రిలీజ్ చేయడం ఖాయమని ఆయన మరోసారి కన్ఫర్మ్ చేశారు. ఇక ఏఎం.రత్నం లేటెస్ట్ కామెంట్స్‌తో ఈ మూవీపై నెలకొన్న సందేహాలకు పూర్తిగా ఫుల్‌స్టాప్ పడిందని చెప్పాలి. ఈ సినిమాలోని సెకండ్ సింగిల్ సాంగ్‌ను ఫిబ్రవరి 24న గ్రాండ్ రిలీజ్ చేసేందుకు చిత్ర యూనిట్ రెడీ అవుతోంది.

## సెన్సార్ పనులు ముగించుకున్న మజాకా

టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్, అందాల భామ రీతూ వర్మ జంటగా తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'మజాకా' ఫిబ్రవరి 26న గ్రాండ రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు త్రినాథరావు నక్కిన డైరెక్ట్ చేయగా పూర్తి కామెడీ ఎంటర్‌టైనర్ మూవీగా ఈ చిత్రం ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యింది. ఇక ఈ సినిమా తాజాగా సెన్సార్ పనులు కూడా ముగించుకుంది. ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. ఇందులోని కామెడీ సీన్స్‌కు ప్రేక్షకులు కడుపుబ్బా నవ్వుకోవడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. ఇక ఓ పక్కా కమర్షియల్ చిత్రానికి సరిపోయేలా ఈ చిత్ర రన్‌టైమ్‌ను 2 గంటల 29 నిమిషాలుగా ఫిక్స్ చేశారు మేకర్స్.

ఈ సినిమాలో సందీప్, రీతూ వర్మలకు సరిసమానంగా రావు రమేష్, మన్మధుడు ఫేమ్ అన్షుల ట్రాక్ కూడా ఉండబోతుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ఈ సినిమాకు లియోన్ జేమ్స్ సంగీతం అందించగా రాజేష్ దండ, ఉమేష్ బన్సల్ సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు.




# జాతరలో జనసంద్రం



(మొదటి పేజీ తరువాయి)

దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు.

**కన్నులపండువగా చంద్రపట్నం**

జాతర 3వ రోజు మంగళవారం పెద్దగట్టుపై స్వామివారి మండపంలో చంద్రపట్నం కార్యక్రమాన్ని యాదవ పూజారులు కన్నుల పండుగగా నిర్వహించారు. పసుపు, కుంకుమలతో అలంకరించిన పంచవర్ణములతో వేసిన చంత్రపట్నంపై దక్షణం దిక్కున లింగమంతులస్వామివారిని, ఉత్తర దిక్కున మాణిక్యమ్మ దేవిని కూర్చోబెట్టి కళ్యాణం జరిపించారు. పూజారులు శ్రీ లింగమంతులస్వామి కళ్యాణం కథను, శ్రీకృష్ణుడి చరిత్రపై పాటలు ఆలపించారు. ఈ సందర్భంగా దేవాలయ ట్రస్టుబోర్డు చైర్మన్ పోలేబోయిన నర్సయ్య యాదవ్ మాట్లాడుతూ చంద్రుడు ఆకాశంలో నిండుగా ప్రకాశించే పౌర్ణమి రోజు శ్రీ లింగమంతులస్వామివారికి ఇష్టమైన రోజు అని ప్రతి పౌర్ణమికి భక్తులు ఇక్కడికి వచ్చి స్నానం ఆచరించి తడిబట్టలతో దర్శనం చేసుకొని గట్టుపై నిద్ర చేస్తే తాము కొరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకమని చెప్పారు. రెండేళ్ళకు ఒకసారి మాఘశుద్ధ పౌర్ణమి రోజు నుండి ఐదు రోజులు జరిగే ఈ జాతరకు తెలుగు రాష్ట్రాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కళ్యాణ కార్యక్రమంలో మెంతనబోయిన, తండు వంశీలు, భైరానీ తేరాచీరల యాదవ పూజారులు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

**లింగన్నను దర్శించుకున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

శ్రీ లింగమంతులస్వామిని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో పాటు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ దర్శించుకొని స్వామివారికి మొక్కులు చెల్లించారు. కవిత చౌడమ్మ తల్లికి బోనం వండుకొని నెత్తినపెట్టుకొని కొట్టపైకి ఎక్కి సమర్పించింది. మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, మాజీ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గుజ్జ దీపికయుగేందర్ రావులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

**3వ రోజు కూడా జాతీయ రహదారిపై వాహనాల మళ్లింపు**

శ్రీ లింగమంతులస్వామి(పెద్దగట్టు) జాతర సందర్భంగా హైద్రాబాద్‌విజయవాడ 65వ ప్రధాన జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల మళ్లింపును కొనసాగించారు. హైద్రాబాద్ నుండి వచ్చే వాహనాలను నార్కెట్‌పల్లి నుండి నల్లగొండ మీదుగా మిర్యాలగూడ, హుజూర్‌నగర్, కోదాడకు మళ్లించగా, విజయవాడ నుండి వచ్చే వాహనాలను కోదాడ నుండి హుజూర్ నగర్ మీదుగా మిర్యాలగూడ, నల్లగొండ, నార్కెట్‌పల్లికి మళ్లించారు. జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ పర్యవేక్షణలో జాతరలో ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

# స్టార్టప్‌ల అభివృద్ధికి కీలక ఒప్పందం చేసుకున్న ప్రభుత్వం




ప్రజాపక్షం/హైదరాబాద్ : స్టార్టప్‌ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ఒప్పందం చేసుకుంది. అంతర్జాతీయ స్టార్టప్ భాగస్వామ్యానికి టీ హబ్, బ్రెజిల్‌కు చెందిన గోయాస్ హబ్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం హెచ్ఐసిసిలో గోయాస్ హబ్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. అనంతరం టీ హబ్ ఫౌండేషన్ సిఈఓ సుజిత్, బ్రెజిల్‌లోని గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సెక్రెటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంతో తెలంగాణ స్టార్టప్‌లకు బ్రెజిల్‌లో అవకాశాలు, అలాగే బ్రెజిల్ స్టార్టప్‌లకు తెలంగాణలో అవకాశాలు లభిస్తాయి. ప్రధానంగా అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రిటెక్, హెల్త్ కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో పరస్పర సహకారం పంచుకుంటాయి.

మార్కెట్ యాక్సెస్‌తో పాటు కెపాసిటీ బిల్డింగ్ ఇంక్యుబేషన్, సాంకేతిక భాగస్వామ్యం, పెట్టుబడుల అవకాశాల మెరుగుదల వంటి కీలక అంశాలపై రెండు సంస్థలు కలిసి పని చేస్తాయి. మన దేశంతో పాటు బ్రెజిల్ స్టార్టప్ ఎకో సిస్టమ్‌ల మధ్య సంబంధాలను ఈ ఒప్పందం బలోపేతం చేయనుంది.

## భారత్, ఖతార్ సంబంధాలు

(మొదటి పేజీ తరువాయి)

అమీర్ పర్యటనతో ఇరు దేశాల బహుముఖ భాగస్వామ్యం మరింత ఉన్నతికి చేరుకుంటుందని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. అంతకుముందు ఖతార్ అమీర్ రాష్ట్రపతి భవన్‌వద్ద సైనికుల గౌరవ వందనం స్వీకరించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అమీర్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మోదీ కూడా పాల్గొన్నారు. తరువాత హైదరాబాద్ హౌస్‌లో మోదీ, అమీర్ తమీమ్ ద్వైపాక్షిక సమస్యలపై చర్చలు జరిపారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం నెలకొల్పే అంశంపై ఒప్పందం కుదిరింది. ఇందుకు సంబంధించిన ఒప్పంద పత్రాలను ప్రధాని మోదీ, ఖతార్ అమీర్ సమక్షంలో ఖతార్ విదేశీ వ్యవహారాల మంత్రి షేక్ మొహమ్మద్ బిన్ అబ్దుల్‌రహమాన్ బిన్ జస్సిమ్ అల్ థని, భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ ఇచ్చిపుచ్చుకున్నారు. 'భారత్–ఖతార్ మధ్య సాంప్రదాయ సంబంధాలు మరింత బలపడ్డాయి. ప్రధాని మోదీ, ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థని ఈరోజు హైదరాబాద్ హౌస్‌లో చర్చలు జరిపారు. భారత్–ఖతార్ మధ్య సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి చేర్చాలని ఇరు దేశాల నేతలు నిశ్చయించారు. పలు విభాగాలలో సంబంధాలు పటిష్టమయేలా చర్చలు సాగాయి. వారు ప్రాదేశిక, ప్రపంచ సమస్యలపైకూడా చర్చించారు' అని విదేశీ వ్యవహారాలు శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. భారత్, ఖతార్‌ల మధ్య బలీయమైన చారిత్రక సంబంధాలు, పరస్పర గౌరవం, విశ్వాసం కొనసాగుతున్నాయి. ఇటీవలి కాలంలో ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, సాంకేతికత, సంస్కృతి, ప్రజల మధ్య సంబంధాలు బలపడుతున్నట్టు అంతకుముందు విదేశీ వ్యవహారాల శాఖ వెల్లడించింది. ఇరు దేశాల నేతల మధ్య చర్చలు భారత్–ఖతార్ భాగస్వామ్యంలో సరికొత్త మైలురాయిగా విదేశీ వ్యవహారాల శాఖ ఎక్స్ వేదికగా పేర్కొన్నది. ఆదాయంపై ద్వంద్వ పన్ను విధానం, ఆర్థిక ఎగవేత అంశాలపైకూడా ఇరు దేశాల మధ్య సవరించబడిన ఒప్పందానికి ఆమోదించినట్టు అధికారులు తెలిపారు. ఖతార్ ప్రధాని, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ఈ ఒప్పందాన్ని పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఖతార్ అమీర్ సోమవారం సాయంత్రం భారత్‌కు చేరుకోగా, ప్రధాని స్వయంగా స్వాగతించారు. గత యేడాది ఫిబ్రవరిలో మోదీ ఖతార్ పర్యటన సందర్భంగా అమీర్ ఆహ్వానం పలికారు. ప్రధాని మోదీ అరుదైన ఆతిథ్యం పలికే రీతిలో స్వయంగా ఢిల్లీ విమానాశ్రయానికి వెళ్లి అమీర్‌కు స్వాగతం పలికారు. ఖతార్ అమీర్‌తో కరచాలనం చేసి, హత్తుకుని తమ మధ్య స్నేహాన్ని చాటారు. అనంతరం మోదీ ఎక్స్ వేదికగా 'విమానాశ్రయానికి వెళ్లి సోదరతుల్యుడు, ఖతార్ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థనికి స్వాగతం పలికాను. తన భారత పర్యటన ఫలవంతం కావాలని, మా మధ్య చర్చలకోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అని పేర్కొన్నారు. ఖతార్ అమీర్ వెంట ఆ దేశానికి చెందిన ఉన్నత స్థాయి అధికార బృందం, పలువురు మంత్రులు, పారిశ్రామికవేత్తలు ఉన్నారు. అనంతరం కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్ కూడా అమీర్‌ను కలుసుకున్నారు. గత యేడాది ప్రధాన మోదీ ఖతార్ పర్యటన సందర్భంగా సాంకేతికత, పెట్టుబడులు, శక్తి, వాణిజ్యం, తదితర అంశాలపై చర్చలు జరిగినట్టు అప్పటి విదేశాంగ శాఖ కార్యదర్శి వినయ్ క్వాత్రా తెలిపారు. ప్రస్తుత అమీర్ పర్యటన ఇరు దేశాల సంబంధాలను మరింత బలపరుస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. ఖతార్‌లో నివసిస్తున్న విదేశీయులలో భారత సంతతి అత్యధికమని, ఖతార్ అభివృద్ధిలో భారతీయుల కృషి ఎనలేనిదని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది.

## అమెరికా, రష్యా చర్చలు

(మొదటి పేజీ తరువాయి)

జెలెన్‌స్కీగానీ, ఆయన తరపు ప్రతినిధులుగానీ చర్చల్లో పాల్గొనలేదు. అవసరమైతే లెన్‌స్కీతో రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ మాట్లాడేందుకు సిద్ధంగా ఉన్నారని రష్యా ప్రభుత్వ ప్రధాన కార్యాలయం క్రెమ్లిన్ వర్గాలు మంగళవారంనాడు చర్చల సందర్భంగా స్పష్టం చేశాయి. జెలెన్‌స్కీతో ముఖాముఖీ చర్చలకు అవకాశమే లేదంటూ పుతిన్ ఇన్నాళ్ళుగా తిరస్కరిస్తూ వచ్చారు. ఉక్రేన్‌లో రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించిన తర్వాత మొట్టమొదటిసారి సమస్య పరిష్కారానికి అధికారులస్థాయి చర్చల ప్రక్రియ ప్రారంభమైంది. రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్ (72), పుతిన్‌కు విదేశీ వ్యవహారాల సలహాదారు, అమెరికాలో రష్యా దౌత్యవేత్తగా పనిచేసిన యూరీ ఉషకోవ్ ఈ చర్చల్లో పాల్గొన్నారు. అమెరికా తరపున విదేశాంగమంత్రి మార్కో రుబియో, దీర్ఘకాలంగా ట్రంప్‌కు విశ్వసనీయుడు, జాతీయ భద్రతా సలహాదారు మైక్‌వాల్జ్ పాల్గొన్నారు. దాదాపు 20 సంవత్సరాలు విరామం తర్వాత లోవరోవ్ అంతర్జాతీయ వేదికపై కనిపించడం ప్రత్యేక విశేషం. మధ్యాసియా తరపున ట్రంప్ వ్యక్తిగత స్నేహితుడు, రియల్ ఎస్టేట్ డవలపర్ స్టీవ్ విట్‌కాఫ్, సౌదీ విదేశాంగమంత్రి ప్రిన్స్ ఫైజల్ బిన్ ఫర్హాన్ అల్‌సౌద్, సౌదీ జాతీయ భద్రతా సలహాదారు ముసాయెద్ బిన్ మహ్మద్ అల్–ఐబన్ పాల్గొన్నారు.

**చర్చల ఫలితాన్ని ఒప్పుకోం : జెలెన్‌స్కీ**

తమ తరపు ప్రాతినిధ్యం లేకుండా రియాద్‌లో ఉక్రేన్ యుద్ధ సమస్య పరిష్కారానికి జరుగుతున్న చర్చల ద్వారా వచ్చే ఫలితాలను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పష్టం చేశారు. ఉక్రేన్, యూరప్, నాటో కూటమి దేశాల ప్రాతినిధ్యం లేకుండా చర్చలు జరిగితే సహించబోమనీ, ఈ చర్చలకు అర్థమే ఉండదనీ గడచిన వారం రోజులుగా యూరోపియన్ యూనియన్ గొంతెత్తి విమర్శిస్తున్నప్పటికీ ట్రంప్ పట్టించుకోలేదు. వారి ప్రాతినిధ్యం లేకుండానే రియాద్‌లో చర్చలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం జెలెన్‌స్కీ ఈజిప్టులో పర్యటిస్తున్నారు. ఆ దేశ అధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డొగాన్‌తో చర్చల నిమిత్తం ఆయన ఈజిప్టు వెళ్ళారు. ఈ శాంతి ఒప్పందాన్ని తాము అంగీకరించబోమని ఆయన అన్నారు.

**ఇంకా చర్చలు మొదలు కాలేదు!**

ఉక్రేన్‌లో యుద్ధం నివారణకు సంబంధించిన చర్చలు ఇంకా ప్రారంభం కాలేదని అమెరికా ప్రకటించింది! దీంతో అయోమయం నెలకుంది. ఉక్రేన్‌లో యుద్ధాన్ని ఆపేందుకు సంబంధించిన చర్చలు ఇంకా ప్రారంభం కాలేదనీ, అసలు ఉక్రేన్‌లో యుద్ధ సమస్య పరిష్కారానికి రష్యా సుముఖంగా ఉందా? లేదా? అనే విషయం తెలుసుకోవడంకోసమే ప్రాథమికంగా ఈ చర్చలు రియాద్‌లో మొదలయ్యాయనీ అమెరికా ప్రభుత్వ యంత్రాంగం ప్రకటించింది. రష్యా అసలింకా చర్చలకు సుముఖంగా ఉందా? అనే విషయాన్ని ఈ చర్చల్లో తెలుసుకుంటామని తెలిపింది. ఐతే రష్యా మాత్రం, 'అమెరికాతో సంబంధాలను సాధారణీకరించుకునేందుకే రష్యా ప్రథమ ప్రాధాన్యత ఇస్తోందని ఆ దేశం ప్రకటించింది.

### చర్చలు విఫలమైతే ఉక్రేన్‌కు బ్రిటన్ సేనలు ! : సంకేతాలిచ్చిన స్టార్‌మర్

ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారానికి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన శాంతి ప్రక్రియ గనుక విఫలమైతే ఉక్రేన్‌లో బ్రిటన్ సేనలను మోహరించే విషయాన్ని తాను పరిశీలిస్తానని బ్రిటన్ ప్రధానమంత్రి సర్ ఖైర్ స్టార్‌మర్ సంకేతాలిచ్చారు. అన్నిరకాలుగానూ ఉక్రేన్‌కు మద్దతు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పారిస్‌లో యూరోపియన్ యూనియన్ నాయకులతో జరిగిన సమావేశంలో స్టార్‌మర్ మాట్లాడుతూ, ఈ చర్చల్లో రష్యా దూకుడును సమర్థవంగా అడ్డుకోవాలంటే ఉక్రేన్‌కు పూర్తి భద్రత కల్పించే భరోసాను సంపాదించాల్సిన అవసరం ఉందని అన్నారు. రష్యాను అడ్డుకోవడానికి అమెరికాను ఒక నియంత్రణశక్తిగా ఈ చర్చల్లో ఉపయోగించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వచ్చేవారంలో తాను అమెరికాలో పర్యటిస్తాననీ, ఈ సందర్భంగా ట్రంప్‌తో చర్చలు జరిపినప్పుడు యావత్ ఉక్రేన్‌కు సంబంధించిన అన్ని విషయాల గురించీ తాను క్షుణ్ణంగా మాట్లాడతానని అన్నారు. ఉక్రేన్‌లో శాంతి చర్చల ఒప్పందం విఫలమైతే ఆ దేశంలో తమ సేనలను మోహరించే విషయం పరిశీలిస్తానని పదే పదే స్టార్‌మర్ అన్నారు. ఐతే జర్మన్ ఛాన్సలర్ ఓలాఫ్ షుల్జ్ మాత్రం స్టార్‌మర్ వ్యాఖ్యలను వ్యతిరేకించారు. ఉక్రేన్‌లో సేనలను మోహరించే విషయం గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు చర్య అవుతుందని అన్నారు. రష్యా నుండి తరతరాలపాటు భద్రతా సమస్య ఎదురుకాకుండా యూరప్ ఖండాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అందుకోసం భవిష్యత్‌లో ఎంతో చేయాల్సిన అవసరం ఉందని స్టార్‌మర్ ఉద్ఘాటించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com